మన రాష్ట్రం మన పత్రిక

నమస్తే తెలంగాణ

NAMASTE TELANGANA

నిపుణ

పోటీ పరీక్షలు, అకడమిక్‌కు సంబంధించిన మెటీరియల్ నేటి 'నిపుణ' ఈ పేపర్‌లో..

సోమవారం MONDAY 15.7.2024 | హైదరాబాద్ HYDERABAD | పేజీలు: 12+4 Pages: 12+4 | సంపుటి (Volume): 14 | సంచిక (Issue): 40 | వెల (Price) రూ.6.50

నవమి

సోమవారం, సూర్యోదయం: 5-50, సూర్యాస్తమయం: 6-54, శ్రీ క్రోధి నామ సంవత్సరం ఉత్తరాయణం గ్రీష్మ ఋతువు ఆషాఢ మాసం శుక్ల పక్షం తిథి: నవమి రాత్రి 7-19 వరకు. నక్షత్రం: స్వాతి రాత్రి 12-20 వరకు. వర్జ్యం: లేదు. రాహుకాలం: ఉదయం 7-28 నుంచి ఉదయం 9-06 వరకు. దుర్ముహూర్తం: పగలు 12-48 నుంచి పగలు 1-40 వరకు, పునః దుర్ముహూర్తం: పగలు 3-24 నుంచి సాయంత్రం 4-16 వరకు. అమృతకాలం: పగలు 2-49 నుంచి సాయంత్రం 4-34 వరకు.

PUBLISHED FROM HYDERABAD • KARIMNAGAR • WARANGAL • KHAMMAM • NALGONDA • MAHABUBNAGAR • NIZAMABAD

www.ntnews.com /ntdailyonline

ఒళ్లు బలిసి దీక్షలు చేస్తున్నరు

నిరుద్యోగుల ధర్నాపై కాంగ్రెస్ నేత చనగాని దయాకర్ అహంకారపూరిత వ్యాఖ్యలు



హైదరాబాద్‌లోని అశోక్‌నగర్‌లో ఆదివారం ఆందోళన చేస్తున్న విద్యార్థులను అరెస్ట్ చేసి వ్యాన్ ఎక్కించి పోలీస్ స్టేషన్‌కు తరలిస్తున్న పోలీసులు

నేడు సెక్రటేరియట్ ముట్టడి

పెద్ద సంఖ్యలో కదులుతున్న నిరుద్యోగులు.. కట్టడికి భారీగా పోలీసుల మోహరింపు

సచివాలయం దారుల్లో భారీ బందోబస్తు.. ఎక్కడికక్కడ ముందస్తు అరెస్టులు

- ఉస్మానియాలో మళ్లీ పోలీసుల దౌర్జన్యం
- తెల్లవారుజామునే హాస్టళ్లలోకి చొరబాటు
- అశోక్‌నగర్, దిల్‌సుఖ్‌నగర్‌లో శనివారం రాత్రంతా పాటలు, నినాదాలతో ఆందోళన
- ఆదివారం అదుపులోకి.. స్టేషన్లకు తరలింపు
- దిల్‌సుఖ్‌నగర్‌ను చుట్టుముట్టిన బలగాలు
- అభ్యర్థులు రోడ్లపైకి రాకుండా కట్టుదిట్టం

హైదరాబాద్, జూలై 14 (నమస్తే తెలంగాణ)/ హైదరాబాద్ సిటీబ్యూరో/ ఉస్మానియా యూనివర్సిటీ/ ఎల్బీనగర్/చిక్కడపల్లి: ఎన్నికల మ్యానిఫెస్టోలో కాంగ్రెస్ ఇచ్చిన హామీల మేరకు ఏటా రెండు లక్షల ఉద్యోగాల భర్తీ, జాబ్ క్యాలెండర్ విడుదల, మెగా డీఎస్సీ నోటిఫికేషన్, గ్రూప్ 2, 3 పోస్టుల పెంపు, డీఎస్సీ పరీక్షల వాయిదా, గ్రూప్-1 మెయిన్స్‌కు 1:100 పద్ధతిలో అభ్యర్థులను పిలవాలనే డిమాండ్లతో సోమవారం తలపెట్టిన రాష్ట్ర సచివాలయం ముట్టడిని జయప్రదం చేయాలని నిరుద్యోగులు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో తరలివచ్చేందుకు నిరుద్యోగులు సిద్ధమయ్యారు. న్యాయమైన డిమాండ్లు నెరవేరేదాకా ఆందోళనలను కొనసాగిస్తామని హెచ్చరిస్తున్నారు. రోజూరోజూ నిరసనలను ఉధృతం చేస్తున్న నిరుద్యోగులను కట్టడి చేసేందుకు పోలీసులు విశ్వప్రయత్నాలు 2వ పేజీలో

రోడ్డెక్కితే ఏం లాభం!

మంత్రులకు చెప్పుకోండి.. పరిష్కరిస్తరు



నిరుద్యోగులతో చర్చలకు సిద్ధంగా ఉన్నాం

గౌడన్నల కృషివల్లే అధికారంలోకి కాంగ్రెస్

ఈత, తాటి వనాలను భారీగా పెంచుతాం

మహేశ్వరంలో న్యూయార్క్‌ను తలదన్నే సిటీ నిర్మిస్తాం: ముఖ్యమంత్రి రేవంత్ 3

పరిహారం నిధుల విడుదలకు సీఎం ఆదేశం

డీఎస్సీ వాయిదా వేయబోం



నోటిఫికేషన్ ప్రకారమే పరీక్షలు నిర్వహిస్తాం 3

త్వరితగతిన ఉద్యోగాలు ఇవ్వడమే మా లక్ష్యం

5-6 వేల పోస్టులతో త్వరలో మరో నోటిఫికేషన్

స్పష్టం చేసిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

ముఖ్యమంత్రి క్షమాపణ చెప్పాలి




నిరుద్యోగులపై అనుచిత వ్యాఖ్యలను రేవంత్ వెంటనే వెనక్కి తీసుకోవాలి 2

8 నెలల్లో ఒక్క నోటిఫికేషన్ కూడా ఇవ్వలేదు

నాలుగు నెలల్లో 2 లక్షల జాబ్స్ ఎలా ఇస్తరు?

ప్రభుత్వాన్ని వదిలిపెట్టం.. నిలదీస్తం: కేటీఆర్

నిరుద్యోగులు సంఘ విద్రోహులా?



ఎన్నికల హామీలు తప్పడం వల్లే పోరాటం

ఇనుప కంచెలు వేసి.. ముందస్తు అరెస్టులా?

అణచివేత చర్యలు, బెదిరింపులు సరికాదు

అభ్యర్థుల డిమాండ్లు వెంటనే నెరవేర్చాలి 3

సీఎంకు మాజీ మంత్రి హరీశ్ బహిరంగ లేఖ



మోనార్క్ వైఖరి వల్లే..

- దుందుడుకుతనంతోనే సమస్య
- ఆరు నెలల్లోనే ఇన్ని ఆందోళనలా?
- కాంగ్రెస్ పార్టీ పరువు పోతున్నది 3
- పరిపాలన చేతకాదన్న అభిప్రాయం
- సీఎం రేవంత్‌రెడ్డిపై సీనియర్ల కుతకుత
- అసలు కాంగ్రెస్ నేతల మండిపాటు
- రాష్ట్ర పరిస్థితులపై అధిష్ఠానం ఆందోళన

రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ సర్కార్ అధికారంలోకి వచ్చి ఆరు నెలలు దాటుతున్నా ప్రభుత్వ పనితీరు పట్ల ఏ వర్గమూ సంతృప్తిగా లేదు. ప్రభుత్వం పట్టాలు ఎక్కలేదని, పాలన గాడిలో పడలేదన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతున్నది.

ఒకవైపు నిరుద్యోగులు, మరోవైపు రైతులు రోడ్లెక్కి ఆందోళనలు చేస్తున్నారు. వేళాపాళా లేని విద్యుత్తు కోతలు.. తాగు నీటి సమస్యలు.. అదుపు తప్పిన శాంతిభద్రతలు.. మహిళలు, చిన్నారులపై లైంగికదాడులు, భూ, ఆస్తి తగాదాలు, హత్యలు, కిడ్నాపులు చోటుచేసుకుంటున్నాయి.

ఈ రకమైన పరిస్థితి కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న ఏ రాష్ట్రంలోనూ లేదని సొంత పార్టీ నేతలే పెదవి విరుస్తున్నారు. ఆరు నెలల స్వల్ప వ్యవధిలోనే ప్రభుత్వం పట్ల ప్రజల్లో చెడ్డ పేరు వచ్చిందని, అప్పుడే తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్నదని వాపోతున్నారు.

ఈ పరిస్థితికి సీఎం రేవంత్‌రెడ్డి అనుభవరాహిత్యం, మొండివైఖరి, ఎవరినీ విశ్వాసంలోకి తీసుకోని అహంభావ వైఖరి కారణమని అసలు కాంగ్రెస్ (ఏఐసీసీ) నేతలు వాపోతున్నారు. దశాబ్దం తర్వాత రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు పట్టం కడితే, ఎన్నికల హామీలను గాలికి వదిలేసి, సీఎం రేవంత్ రెడ్డి పూర్తి సమయాన్ని రాజకీయాలకే కేటాయించి, కక్షసాధింపు చర్యలు, ప్రతిపక్ష ఎమ్మెల్యేలను పార్టీలో చేర్చుకోవడానికి కనబరుస్తున్న శ్రద్ధ పాలనపై కేంద్రీకరించడం లేదని అసలు కాంగ్రెస్ నేతలు ఆందోళన చెందుతున్నారు.

- **నాడు:** నిండుకుండలా కళ కళ..



సిద్దిపేట జిల్లా తొగుట మండలంలోని మల్లన్నసాగర్ రిజర్వాయర్ నిండు ఈ సమయానికి గోదావరి జలాలతో కళకళలాడింది. బీఆర్ఎస్ హయాంలో ఈ రిజర్వాయర్‌ను నింపి వందల చెరువులు, చెక్‌డ్యామ్‌లు నింపేవారు. దీంతో భూగర్భ జలాలు పుష్కలంగా ఉండి ఈ ప్రాంత రైతులు పుష్కలంగా పంటలు పండించారు.

- **నేడు:** వట్టిపోయి వెలవెల..



కాంగ్రెస్ సర్కారు గోదావరి జలాలను ఎత్తిపోయక పోవడంతో రిజర్వాయర్ ప్రస్తుతం కళతప్పింది. 50 టీఎంసీల సామర్థ్యం కలిగిన మల్లన్నసాగర్ డెడ్‌స్టోరేజీకి చేరింది. వానాకాలం ప్రారంభమై నెల గడుస్తున్నా భారీ వర్షాలు పడకపోవడం, రిజర్వాయర్‌లో నీరు లేకపోవడంతో సాగుకు రైతులు వెనకడుగు వేస్తున్నారు.

మేడిగడ్డ నీళ్లివ్వొచ్చు

బరాజ్‌లో 40 వేల క్యూసెక్కుల నీటి ప్రవాహం

ప్రస్తుతం నాలుగు మోటర్లు నడుపొచ్చు

ప్రాజెక్టులు నింపి రైతాంగాన్ని ఆదుకోవాలి 9

కాంగ్రెస్ ప్రభుత్వం పట్టింపులకు పోకుండా వెంటనే మోటర్లు ప్రారంభించాలి: హరీశ్‌రావు



మరో రైతు బలవన్మరణం

పెట్టుబడుల కోసం 4 లక్షల అప్పు

దిగుబడి రాక అప్పు తీరక మనస్తాపం

పురుగుల మందు తాగి ఆత్మహత్య 12

కర్ణాటకలో బస్సు చార్జీల మోత!

ఏకంగా 20% మేర పెంపు?

ప్రభుత్వానికి ప్రతిపాదనలు

కేఎస్ఆర్టీసీ చైర్మన్ శ్రీనివాస్

గత నెల పెట్రోల్, డీజిల్‌పై పన్నును 4 శాతం పెంచిన కాంగ్రెస్ ప్రభుత్వం 8

ఆటోడ్రైవర్ల ఆత్మహత్యలకు బాధ్యుడు రేవంతే

- 7 నెలల్లో 58 మంది బలవన్మరణం
- ఏటా రూ.12 వేలు ఇంకెప్పుడిస్తరు?
- సంక్షేమ బోర్డు హామీని మరిచారా?
- అసెంబ్లీ సమావేశాల్లో వీటిని పెట్టాలి
- లేనిపక్షంలో అసెంబ్లీని ముట్టడిస్తాం
- టీఏటీయూ రాష్ట్ర అధ్యక్షుడు మారయ్య



హైదరాబాద్, జూలై 14 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన ఆటో డ్రైవర్ల ఆత్మహత్యలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డే బాధ్యత వహించాలని బీఆర్‌టీయూ అనుబంధ సంఘం తెలంగాణ ఆటో, మోటర్ డ్రైవర్స్ యూనియన్ (టీఏటీయూ) రాష్ట్ర అధ్యక్షుడు మారయ్య డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు ఆటో డ్రైవర్లకు కాంగ్రెస్ అనేక హామీలు ఇచ్చిందని గుర్తుచేశారు. అధికారం చేపట్టి ఏడునెలలు దాటినా వాటి ఊసెత్తకపోవడంతో ఆర్థిక ఇబ్బందులతో 58 మంది ఆటోడ్రైవర్లు ఆత్మహత్యలకు 5వ పేజీలో



పింఛన్ల రికవరీలపై వెనకడుగు!

మార్గదర్శకాలు వచ్చేవరకు చర్యలొద్దు

హైదరాబాద్, జూలై 14(నమస్తే తెలంగాణ): అనర్హుల పేరుతో ఆసరా పెన్షన్లను రికవరీ చేయాలన్న నిర్ణయంపై ప్రభుత్వం తాత్కాలికంగా వెనక్కి తగ్గింది. దీనిపై స్పష్టమైన మార్గదర్శకాలు వెలువడే వరకు ఎటువంటి నోటీసులు జారీచేయడం కానీ, రికవరీ చర్యలు చేపట్టడం కానీ చేయరాదని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి జిల్లా కలెక్టర్లు, వివిధ శాఖల అధికారులను ఆదేశిస్తూ ఆదివారం ఉత్తర్వులు జారీచేశారు. సంక్షేమ పథకాల ద్వారా అనర్హులు 5వ పేజీలో

ప్రీలాంచ్ మోసం 100 కోట్లు!

టవర్లలో ప్లాట్లు మీవేనంటూ వసూళ్లు

18 నెలల తర్వాత రద్దు చేసుకోవచ్చు

8 శాతం వడ్డీ తిరిగి ఇస్తామని హామీ

బాధితుల ఫిర్యాదుతో వెలుగులోకి

బిచాణా ఎత్తేసిన అర్బనేటెడ్ రియల్టీ సంస్థ

హైదరాబాద్ సిటీబ్యూరో, జూలై 14 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌లో సొంతిల్లు ఉండాలనే మధ్య తరగతి ప్రజల కలను ఆసరాగా చేసుకొని పలువురు రియల్ ఎస్టేట్ వ్యాపారులు ప్రీ లాంచ్ ఆఫర్ల పేరిట భారీ మోసాలకు పాల్పడుతున్నారు. ప్రాజెక్ట్ ప్రారంభమయ్యే సమయంలోనే కొంత, మొత్తం డబ్బు ఇస్తే ధర తగ్గుతుందనే ఉద్దేశంతో ప్లాట్లు బుక్ చేసుకున్న వారిని నట్టేట ముంచుతున్నారు. హైదరాబాద్ సీసీఎస్‌లో ఇప్పటికే పలు సంస్థలపై కేసులు ఉండగా, తాజాగా మరో కేసు నమోదైంది. సుమారు రూ. 100 కోట్ల వరకు మోసం జరిగినట్టు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మార్కెటింగ్ ఏజెంట్ల ద్వారా జూబ్లీహిల్స్‌లో కార్యాలయం నిర్వహిస్తున్న అర్బనేటెడ్ రియల్టీ ఎల్ఎల్‌పీ సంస్థ ఎండీలు శ్రీనివాస్ మేక, గురుదీప్ సింగ్ కోహ్లి, మేనేజర్ వెంకటేశ్ కొండూరులను సోమాజిగూడకు చెందిన మెట్టు శశిభూషణ్‌రెడ్డి కలిశారు. ఈ సంస్థ శేరిలింగంపల్లి మండలం ఖాజాగూడ 5వ పేజీలో



డొనాల్డ్ ట్రంప్‌పై హత్యాయత్నం

అమెరికా మాజీ అధ్యక్షుడిపై కాల్పులు

ఎన్నికల సభలో ప్రసంగిస్తుండగా ఘటన

కుడి చెవికి తాకుతూ దూసుకెళ్లిన బుల్లెట్

ప్రాణాలతో బయటపడ్డ డొనాల్డ్ ట్రంప్

కాల్పుల్లో ఒకరి మృతి, ఇద్దరికి గాయాలు

దుండగుడిని మట్టుబెట్టిన సీక్రెట్ సర్వీస్

ఘటనను ఖండించిన ప్రపంచ దేశాలు 7




డీఎస్సీని వాయిదా వేయాలని డిమాండ్ చేస్తూ హైదరాబాద్ అశోక్‌నగర్‌లో శనివారం రాత్రి మెరుపు ధర్నాకు దిగిన నిరుద్యోగులు ఆదివారం తెల్లవారుజాము వరకు అక్కడే బైఠాయించి నిరసన తెలుపుతున్న దృశ్యం. అశోక్‌నగర్ మొత్తం పోలీసుల గుప్పిట్లో ఉన్నది. ఎక్కడా చూసినా పోలీసుల గుంపే కనిపిస్తున్నది

నిరుద్యోగులకు సీఎం క్షమాపణ చెప్పాలి

అనుచిత వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలి

- 8 నెలల్లో ఒక్క నోటిఫికేషన్ కూడా ఇవ్వలేదు
- నాలుగు నెలల్లో 2 లక్షల జాబ్స్ ఎలా ఇస్తరు?
- రేవంత్ నోటిఫికేషన్లపై శ్వేతపత్రం ప్రకటించాలి
- ప్రభుత్వాన్ని వదిలిపెట్టం.. ప్రజా క్షేత్రంలో నిలదీస్తం
- విద్యార్థులు, నిరుద్యోగులతో కలిసి కొట్లాడుతం
- స్వర్ణకిలారి 'మేక బతుకు' పుస్తకావిష్కరణలో కేటీఆర్

హైదరాబాద్, జూలై 14 (నమస్తే తెలంగాణ): నిరుద్యోగ యువత, విద్యార్థులపై చేసిన అనుచిత వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకొని, వారికి సీఎం రేవంత్‌రెడ్డి క్షమాపణ వెంటనే చెప్పాలని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. నిర్లక్ష్యంగా, నిర్లజ్జగా సీఎం తన స్థాయిని దిగజారి, దివాలాకోరుతనంతో మాట్లాడారని మండిపడ్డారు. ఎనిమిది నెలల్లో ఒక్క నోటిఫికేషన్ ఇవ్వలేని కాంగ్రెస్ సర్కారు.. నాలుగు నెలల్లో 2 లక్షల ఉద్యోగాలు ఎలా ఇస్తుందని నిలదీశారు. రేవంత్‌రెడ్డికి సత్తా, చిత్తశుద్ధి ఉంటే ఉద్యోగాలు, నోటిఫికేషన్లు, జాబ్ క్యాలెండర్‌పై శ్వేతపత్రం ప్రకటించాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని ప్రసాద్ ల్యాబ్‌లో స్వర్ణకిలారి రచించిన 'మేక బతుకు' పుస్తకాన్ని ఆదివారం కేటీఆర్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. నిరుద్యోగుల కోసం దీక్షచేసిన నిరుద్యోగ అభ్యర్థి మోతీలాల్‌ను అవమానించేలా సీఎం మాట్లాడటం తగదని హితవు పలికారు. రాజకీయ నిరుద్యోగులుగా అశోక్‌నగర్ కోచింగ్ సెంటర్లకు వెళ్లి ఉద్యోగాలు సంపాదించుకున్న రాహుల్‌గాంధీ, రేవంత్‌రెడ్డి.. అదే కోచింగ్ సెంటర్లు, నిరుద్యోగ అభ్యర్థులను అవమానించేలా మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. అశోక్‌నగర్‌లోని నిరుద్యోగులు, విద్యార్థులను సన్నాసులు అంటున్న రేవంత్‌రెడ్డి సన్నాసా? లేదా రాహుల్‌గాంధీ సన్నాసా? చెప్పాలని ఎద్దేవా చేశారు. బీఆర్‌ఎస్‌ను దించి కాంగ్రెస్‌ను గద్దెనెక్కించిన అదే యువత ఈరోజు ప్రశ్నిస్తున్నదని వెల్లడించారు. రేవంత్ సర్కారును వదిలిపెట్టబోమని, అసెంబ్లీలో నిలదీస్తామని చెప్పారు. విద్యార్థులు, నిరుద్యోగులతో ప్రజాక్షేత్రంలో కొట్లాడుతామన్నారు.



మేక బతుకు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి కేటీఆర్, ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి, పెద్దింటి అశోక్, డాక్టర్ నీరజ, స్వర్ణ కిలారి

ఇది యువత భవిష్యత్తు..

ఇది రాజకీయ పార్టీల సమస్య కాదని, లక్షల మంది యువత భవిష్యత్తుకు సంబంధించిన అంశమని కేటీఆర్ అన్నారు. ఈ అంశంలో రేవంత్‌రెడ్డి ఇగో, భేషజాలకు పోకుండా నిరుద్యోగులు అడుగుతున్న డిమాండ్లపై సానుకూలంగా నిర్ణయం తీసుకోవాలని సూచించారు. సంయమనంతో మాట్లాడటం రేవంత్‌రెడ్డి అలవాటు చేసుకోవాలని హితవు పలికారు. అశోక్‌నగర్, దిల్‌సుఖ్‌నగర్, యూనివర్సిటీలో పిల్లలను పోలీసులు ఈడ్చుకుపోతున్న విషయం వాస్తవం కాదా? అని నిలదీశారు. 'రేవంత్‌రెడ్డి ఇంకా ప్రతిపక్షంలో ఉన్నట్టుగానే మాట్లాడుతున్నారు. ఆయన సీఎం అనే విషయాన్ని గుర్తుపెట్టుకొని మాట్లాడితే ఆయనకే మంచిది' అని సూచించారు. గ్రూప్-1 మెయిన్స్‌కు అభ్యర్థులను 1:100 నిష్పత్తిలో తీసుకోవాలని నాడు అసెంబ్లీ అడిగింది భట్టి విక్రమార్క కాదా? అని నిలదీశారు.

సాహిత్యంతో సామాజిక చైతన్యం

సాహిత్యంతో సమాజంలో చైతన్యం తీసుకురావచ్చని కేటీఆర్ అభిప్రాయపడ్డారు. తాను దుబాయ్ వెళ్లినప్పుడు స్వయంగా లేబర్ క్యాంపుల్లో కార్మికుల కష్టాలను చూశానని, గుండె తరుక్కుపోయిందని చెప్పారు. వలస ఎంత వాస్తవమో.. వలసలోని దోపిడీ కూడా అంతే వాస్తవం.. అది దుబాయ్ అయినా హైదరాబాద్ అయినా ఇంకెక్కడైనా.. అని పేర్కొన్నారు. పెద్దూరు వలస కార్మికుల కోసం దుబాయ్‌లోని జైలుకు వెళ్లి కలిసి వచ్చానని కేటీఆర్ పేర్కొన్నారు. వారిని ఏండ్ల తర్వాత ఇండియాకు తీసుకురాగలిగామని గుర్తుచేశారు. ప్రస్తుతం సమాజంలో చదివే అలవాటు తగ్గుతూ వస్తున్నదని, ఈ సమయంలో మేక బతుకు పుస్తకాన్ని తీసుకురావడం హర్షణీయమన్నారు. సమాజంలో చైతన్యం, మార్పు తీసుకురాగలిగే సాహిత్యానికి మరింత మద్దతు ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. ఈ దిశగా డిజిటల్, ఆడియో పుస్తకాల ద్వారా మరింత ప్రయత్నం జరగాలని కేటీఆర్ కాంక్షించారు.

పుస్తకావిష్కరణలో ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి, పెద్దింటి అశోక్‌కుమార్, డాక్టర్ కే నీరజ, మీడియా సమావేశంలో ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్, బీఆర్‌ఎస్ నాయకులు గెల్లు శ్రీనివాస్‌యాదవ్, తుంగ బాలు, వాసుదేవరెడ్డి పాల్గొన్నారు.

ఎడారిలో చిక్కుకున్న యువకుడి కథే 'మేకబతుకు'

మెరుగైన జీవితం కోసం కేరళ నుంచి గల్ఫ్‌కు వలస వెళ్లి అక్కడ ఎడారిలో చిక్కుకుపోయిన నజీబ్ అనే యువకుడి కథే 'మేక బతుకు' పుస్తకం. ఈ పుస్తకానికి మాతృక మలయాళంలో బెన్యామిన్ రాసిన 'ఆడుజీవితం'. 2008లో వచ్చిన ఈ నవల బహుళ ప్రజాదరణ పొందింది. ఇప్పటివరకు 100కుపైగా పునర్ముద్రణలు పొంది మూడు లక్షల పైచిలుకు కాపీలు అమ్ముడుపోయాయి. దీనికి కేరళ సాహిత్య అకాడమీ అవార్డు కూడా వచ్చింది. ఈ పుస్తకాన్ని ఇంగ్లిషులోకి 'గోట్ డేస్' పేరిట జోసెఫ్ కోయిప్పళ్లి అనువదించారు. ఈ పుస్తకం ఇప్పటికే ఎనిమిది భాషల్లోకి (ఇంగ్లిష్, అరబిక్, నేపాలీ, ఒడియా, థాయ్, తమిళ్, హిందీ, కన్నడ) అనువాదమైంది. మార్చి 2024లో 'ఆడుజీవితం' పేరుతో ప్రముఖ హీరో పృథ్వీరాజ్ ప్రధాన పాత్రలో సినిమాగా విడుదలై సూపర్ హిట్ అయ్యింది. ఇంగ్లిష్ నుంచి తెలుగులోకి 'మేక బతుకు' శీర్షికన రచయిత్రి స్వర్ణ కిలారి అనువాదం చేశారు. పుస్తకాన్ని అన్వీక్షికి పబ్లికేషన్స్ ప్రచురించింది. అమెజాన్, ఫ్లిప్‌కార్ట్, ఇతర పుస్తకాల షాపుల్లో 'మేక బతుకు' పుస్తకం అందుబాటులో ఉంటుంది.



ఆదివారం ఉదయం ఓయూ హాస్టల్‌లో పోలీసుల నిర్బంధం.. బీఆర్‌ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి జంగయ్యను అరెస్ట్ చేస్తున్న పోలీసులు

నేడు సెక్రటేరియట్ ముట్టడి

> మొదటిపేజీ తరువాయి...

చేస్తున్నారు. ఇందులో భాగంగా సెక్రటేరియట్ ముట్టడిని భగ్నం చేసేందుకు నిరుద్యోగులను ఎక్కడికక్కడే ముందస్తు అరెస్టులు చేస్తున్నారు. చాలాచోట్ల విద్యార్థి నేతలను నిర్బంధంలోకి తీసుకున్నారు. అశోక్‌నగర్, దిల్‌సుఖ్‌నగర్, ఉస్మానియా యూనివర్సిటీలో ఉన్న విద్యార్థులను, నిరుద్యోగులను వెతికిమరీ పట్టుకుని వాహనాల్లో ఎక్కించారు. అశోక్‌నగర్, చిక్కడపల్లి ప్రాంతాల్లోని అన్ని బుక్‌స్టోర్స్, టీ స్టాళ్లను మూసివేయించారు. అశోక్‌నగర్, చిక్కడపల్లి ప్రాంతాల్లో అనధికారికంగా 144 సెక్షన్‌ను అమలు చేస్తున్నారు. ప్రతి గల్లీలో పహారా కాస్తున్నారు. సెంట్రల్ లైబ్రరీ వద్ద గస్తీ తిరుగుతున్నారు. ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి వెళ్లకుండా పికెట్లు ఏర్పాటు చేశారు. సెక్రటేరియట్‌కు వచ్చే దారుల్లో పోలీసులు భారీగా మోహరించారు.

తెల్లవారుజామునే అరెస్టులు

పరీక్షలు వాయిదా వేయబోమని, పరీక్షలు రాయనోళ్లే దీక్షలు చేస్తున్నారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించడంతో శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం దాకా అశోక్‌నగర్, ఆర్టీసీ క్రాస్‌రోడ్, దిల్‌సుఖ్‌నగర్ ప్రాంతాలు నిరుద్యోగులు, అభ్యర్థుల నిరసనలతో అట్టుడికాయి. ఈ సెగ ఉస్మానియా యూనివర్సిటీకి పాకితే ఉద్యమం మరింత తీవ్రరూపం దాలుస్తుందనే అనుమానంతో పోలీసులు ఆదివారం తెల్లవారుజామునే విద్యార్థి నాయకులను అరెస్టు చేశారు. ఉదయం ఆరున్నర గంటలకు హాస్టల్లోకి చొరబడి బీఆర్‌ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి జంగయ్య, నాయకులు పెద్దన్న, రమేశ్, సాయిలను అరెస్టు చేసి, పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

రాజకీయాలు అంటగడుతరా?

ఉద్యోగాల కోసం ఆందోళన చేస్తున్న తమకు రాజకీయాలను అంటగడుతరా? అని నిరుద్యోగులు నిలదీశారు. పరీక్షలకు సమయం కావాలని కోరితే సీఎం రేవంత్‌రెడ్డి తమను అవమానించడమేంటని సమంజసమని ప్రశ్నించారు. దిల్‌సుఖ్‌నగర్‌లో శనివారం అర్ధరాత్రి నుంచి ఉదయం వరకు ఆందోళనలు కొనసాగించారు. నిజాయితీగా, న్యాయబద్ధంగా ఆందోళన చేస్తుంటే బీఆర్‌ఎస్, బీజేపీలను అంటగట్టి రాజకీయం చేయడం సమంజసం కాదని హితవుపలికారు.

16మంది అరెస్ట్.. ఠాణాలకు తరలింపు

శనివారం అర్ధరాత్రి అశోక్‌నగర్ చౌరస్తా వద్ద మెరుపు ధర్నాకు దిగిన నిరుద్యోగులు ఆదివారం ఉదయం దాకా నిరసన తెలిపారు. రాత్రంతా నినాదాలు, తెలంగాణ ఉద్యమ పాటలతో ధర్నా కొనసాగించారు. పోలీసులు, ఆదివారం ఉదయం 6 గంటల ప్రాంతంలో 16 మంది నిరుద్యోగులను అరెస్టు చేసి బొల్లారం, ఫలక్‌నుమా ఠాణాలకు తరలించారు.

బీసీ నేతల నిర్బంధం

నిరుద్యోగులకు మద్దతుగా సచివాలయ ముట్టడికి పిలుపునిచ్చిన నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా బీసీ సంఘాల నేతలను పోలీసులు ఎక్కడివారిని అక్కడ ముందస్తు అరెస్టులు చేసి, నిర్బంధంలోకి తీసుకున్నారు. ఆదివారం ఉదయం నుంచే బీసీ సంఘాల నేతల ఇండ్లకు వెళ్లి ఫొటోలు తీసుకుని కొంత మందిని అదుపులోకి తీసుకున్నారు.

జయప్రదం చేయండి : రాజారాం యాదవ్, ఆర్ కృష్ణయ్య పిలుపు

సెక్రటేరియట్ ముట్టడిని జయప్రదం చేయాలని బీసీ జనసభ అధ్యక్షుడు రాజారాం యాదవ్, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య పిలుపునిచ్చారు. నిరుద్యోగుల ఉద్యమానికి తమ సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ మేరకు హిందూ బీసీ మహాసభ అధ్యక్షుడు బత్తుల సిద్ధేశ్వర్లు, విద్యార్థి, నిరుద్యోగ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు కొంపెల్లి రాజుతో కలిసి తన నివాసంలో మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ వాగ్దానాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

ఒళ్లు బలిసి దీక్ష చేస్తున్నరు

- వీళ్లకు పనీపాటా లేదు.. అవి దొంగ దీక్షలు
- నిరుద్యోగనేతోడు రోడ్డుపైకొచ్చి ధర్నా చేస్తడా?
- కాంగ్రెస్ అధికార ప్రతినిధి, ఓయూ నేత దయాకర్ అహంకార వ్యాఖ్యలు



చనగాని దయాకర్



ఆదివారం అర్ధరాత్రి దిల్‌సుఖ్‌నగర్‌లో నిరసన కొనసాగిస్తున్న డీఎస్సీ అభ్యర్థులు

హైదరాబాద్, జూలై 14(నమస్తే తెలంగాణ): 'ఒళ్లు బలిసి దీక్షలు చేస్తున్నరు. తిన్నది అరగక చేస్తున్నరు. వీళ్లకు పనీపాటా లేదు. నిరుద్యోగుల ముసుగులో దొంగ దీక్షలు చేస్తున్నరు. అసలు నిరుద్యోగి అనేటోడు ఇట్లా రోడ్లపైకొచ్చి ధర్నాలు చేస్తడా..' అని నిరుద్యోగ యువతపై కాంగ్రెస్ అధికార ప్రతినిధి, ఓయూ నేత చనగాని దయాకర్ చేసిన అహంకారపూరిత వ్యాఖ్యలివి! ఆదివారం ఓ చానల్ డిబేట్‌లో ఆయన నిరుద్యోగులను కించపరిచేలా మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి బాటలోనే పలువురు కాంగ్రెస్ నేతలు తమను ఇలా హేళన చేస్తూ మాట్లాడడంపై నిరుద్యోగులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ఎన్నికల మ్యానిఫెస్టోలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలనే అడుగుతున్నామని, ఆ పార్టీ అధికారంలోకి వచ్చేందుకు ఎంతో కృషిచేసిన తమను నయవంచనకు గురిచేసిందని మండిపడుతున్నారు. రెండు మూడు రోజుల క్రితం తలకుమాసినోళ్లే దీక్షలు చేస్తున్నరని మాట్లాడిన సీఎం రేవంత్‌రెడ్డి శనివారం జేఎన్టీయూ వేదికగా మరోసారి నిరుద్యోగులపై అక్కసు వెళ్లగక్కారు. పరీక్షలు రాయనోళ్లు, ఉద్యోగాల కోసం హోటల్‌లో రేనోళ్లు దీక్షలు చేస్తున్నారని హేళన చేశారు. ఆయన బాటలోనే దయాకర్ సైతం అహంకారపూరిత మాటలు మాట్లాడారు. 'ధర్నాలు చేస్తున్న వాళ్లు నిరుద్యోగులే కారు. వాళ్లంతా రాజకీయ ముసుగు వేసుకున్నారు. దొంగ నిరుద్యోగులను తయారు చేసి ధర్నాలు చేయిస్తున్నారు. ఓయూలో నిరుద్యోగులే లేరు. అసలు నిరుద్యోగి బయటకు వస్తడా.. ధర్నాలు చేస్తడా' అంటూ కించపరిచే వ్యాఖ్యలు చేశారు.

నాడు నానా యాగీ.. నేడు వాళ్లంతా ఏరి?

బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో నిరుద్యోగులకు అన్యాయం జరిగిందంటూ కొందరు కాంగ్రెస్ నాయకులు, ఆ పార్టీ మద్దతుదారులు నానా యాగీ చేసిన విషయం తెలిసిందే. వీరిలో ప్రస్తుత ఎమ్మెల్సీలు తీన్మార్ మల్లన్న, బల్మూరి వెంకట్, నేతలు మానవతారాయ్, శివసేనారెడ్డి, రియాజ్, హర్షవర్ధన్‌రెడ్డి ముందు వరుసలో ఉన్నారు. నాడు వీళ్లంతా నిరుద్యోగ యువతను రెచ్చగొట్టి రోడ్లెక్కేలా చేశారనే విమర్శలున్నాయి. అధికారం కోసం నిరుద్యోగులను వాడుకున్న కాంగ్రెస్, ఇప్పుడు అధికారంలోకి వచ్చాక వారికి ఇచ్చిన ఒక్క హామీని కూడా నెరవేర్చలేదు. దీంతో కడుపుమండిన నిరుద్యోగులు కొద్దిరోజులుగా ప్రభుత్వాన్ని దుమ్ముదులుపుతూ కదం తొక్కుతున్నారు. నాడు తమను అడ్డం పెట్టుకొని నానా యాగీ చేసిన వాళ్లంతా ఇప్పుడు ఎక్కడికి పోయారని నిలదీస్తున్నారు. ఇప్పుడు కాంగ్రెస్ నాయకులు అంటున్నట్టుగా నాడు వాళ్లు కూడా దొంగ దీక్షలు చేశారా? అని ప్రశ్నిస్తున్నారు.



బాలు అశోక్ కుమార్

సెక్రటేరియట్ ముట్టడికి మద్దతు

తెలంగాణ స్టూడెంట్స్ పరిషత్ (టీఎస్‌పీ) సంపూర్ణ మద్దతు

ఉస్మానియా యూనివర్సిటీ, జూలై 14 : విద్యార్థి, నిరుద్యోగ, బీసీ సంఘాల ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించనున్న సెక్రటేరియట్ ముట్టడికి తెలంగాణ స్టూడెంట్స్ పరిషత్(టీఎస్‌పీ) సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాలు అశోక్‌కుమార్ ఒక ప్రకటన విడుదల చేశారు. డీఎస్సీ వాయిదాతోపాటు గ్రూప్-2, 3 పోస్టులను పెంచి నిరుద్యోగులకు న్యాయం చేయాలని తలపెట్టిన సెక్రటేరియట్ ముట్టడిని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

నిరుద్యోగులే గద్దె దింపుతారు

- అణచివేయాలని చూస్తే అగ్నిపర్వతం
- మీరు మాట్లాడితే ఉద్యమం.. బీఆర్‌ఎస్ మాట్లాడితే కుట్రనా?
- నిరుద్యోగుల ఆత్మగౌరవం దెబ్బతీసేలా సీఎం వ్యాఖ్యలు
- నిరుద్యోగులకు బీఆర్‌ఎస్ మద్దతు
- బీఆర్‌ఎస్ నేత ఏనుగుల రాకేశ్‌రెడ్డి



హైదరాబాద్, జూలై 14 (నమస్తే తెలంగాణ): ఊరూరా తిరిగి కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేసిన నిరుద్యోగులే ఆ పార్టీని గద్దెదింపుతారని బీఆర్‌ఎస్ నేత ఏనుగుల రాకేశ్‌రెడ్డి హెచ్చరించారు. నిరుద్యోగులు ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద దీక్ష చేయడానికి సిద్ధంగా ఉన్నారని చెప్పారు. తెలంగాణ గడ్డ మీద పుట్టిన ప్రతిబిడ్డకు తెగింపు, తెగువ ఉంటాయని, అణచివేయాలని చూస్తే అగ్ని పర్వతమవుతామని హెచ్చరించారు. తక్షణమే వారి డిమాండ్లను నెరవేర్చడానికి చర్యలు చేపట్టాలని సూచించారు. ఆదివారం ఆయన తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. నిరుద్యోగుల వెనుక బీఆర్‌ఎస్ ఉండి కుట్రలు చేస్తున్నదంటూ ముఖ్యమంత్రి ఆరోపించడం సిగ్గుచేటు అని పేర్కొన్నారు. సీఎం వ్యాఖ్యలు చీప్‌గా ఉన్నాయని, ఆయన స్థాయికి తగ్గట్టుగా లేవని మండిపడ్డారు. నిరుద్యోగుల ఆత్మగౌరవం దెబ్బతినేలా మాట్లాడటం తగదని హితవు పలికారు. నాడు కాంగ్రెస్ పార్టీ నిరుద్యోగుల కోసం మాట్లాడితే ఉద్యమం.. ఇప్పుడు బీఆర్‌ఎస్ పార్టీ మాట్లాడితే కుట్రనా? అని నిలదీశారు. అశోక్‌నగర్‌లో జరిగిన నిరసన నిరుద్యోగుల చైతన్యానికి నిదర్శనమని పేర్కొన్నారు. నిరుద్యోగులు తిన్నది అరగక దీక్షలు చేస్తున్నారని కాంగ్రెస్ నేతలు మాట్లాడటం తగదని మండిపడ్డారు. మోతీలాల్‌నాయక్, బక్క జడ్సన్, అశోక్ అమరణ నిరాహార దీక్షలు చేస్తే వాళ్లు ఏం పరీక్షలు రాశారని సీఎం అనడం ఏమిటని ఆగ్రహం వ్యక్తంచేశారు. 2023 వరకు బీఆర్‌ఎస్ ప్రభుత్వంపై కొట్లాడిన రేవంత్‌రెడ్డి నాడు ఏ పరీక్ష రాశారో చెప్పాలని నిలదీశారు. నీట్ గురించి మాట్లాడిన రాహుల్ గాంధీ ఆ పరీక్ష రాశారా? అని ప్రశ్నించారు. నిరుద్యోగులకు బీఆర్‌ఎస్ మద్దతు కచ్చితంగా ఉంటుందని స్పష్టంచేశారు. పంచాయతీ కార్మికులు, 108 సిబ్బంది ఎవరు పోరాటం చేసినా మద్దతు ఇస్తామని తెలిపారు.

గ్రూప్-2కు డీఎస్సీకి ఒక్కరోజే తేడా

గ్రూప్-2 పరీక్షకు, డీఎస్సీ పరీక్షకు ఒక్క రోజు మాత్రమే తేడా ఉన్నందునే డీఎస్సీకి ప్రిపేర్ అయ్యేవాళ్లు వాయిదా వేయాలని కోరుతున్నారని రాకేశ్‌రెడ్డి చెప్పారు. డీఎస్సీ, గ్రూప్-2 పరీక్షలు వాయిదా వేయాలని కోరిన కోదండరాం కూడా అక్కడా? అని ప్రశ్నించారు. రాష్ట్రంలో పోలీసు రాజ్యం నడుస్తున్నదని, ఉస్మానియా యూనివర్సిటీలో పోలీసులు కవాతు చేస్తున్నారని మండిపడ్డారు. జర్నలిస్టులపై పోలీసులు దాడులు చేస్తున్నారని, రాష్ట్రవ్యాప్తంగా శాంతిభద్రతలు అదుపు తప్పాయని విమర్శించారు. 'రేవంత్‌రెడ్డిది ప్రజాపాలన కాదు. పోలీసుల పాలన, పరిపక్వత లేని పాలన. హైరానా పాలన, హైరాన పాలన' అని ధ్వజమెత్తారు. ప్రజాపాలన అని చెప్తున్న రేవంత్‌కు ఇంత పంతం ఎందుకు? అని నిలదీశారు.

రేవంత్‌రెడ్డి సీఎం పదవికి అనర్హుడు

- విద్యావ్యవస్థపై అవగాహన లేని సీఎం రాజీనామా చేయాలి
- అశోక అకాడమీ డైరెక్టర్ పాలకూరి అశోక్ డిమాండ్



హైదరాబాద్ సిటీబ్యూరో, జూలై 14 (నమస్తే తెలంగాణ): 'రేవంత్‌రెడ్డి సీఎం పదవికి అనర్హుడు. నిరుద్యోగుల కోర్కెలను నెరవేర్చకపోతే, వెంటనే సీఎం పదవి నుంచి దిగి పోవాలి. రాష్ట్రవ్యాప్తంగా నిరుద్యోగులు ఇదే భావిస్తున్నారు' అని కోచింగ్ సెంటర్ నిర్వాహకుడు అశోక్ పేర్కొన్నారు. కోచింగ్ సెంటర్ల పేరిట నిరుద్యోగులతో దందాలు చేస్తున్నారంటూ సీఎం చేసిన విమర్శలు దుమారం రేపాయి. కోచింగ్ సెంటర్లలో వంద కోట్ల దందా అంటూ ఆయన చేసిన వ్యాఖ్యలపై అశోక్ తీవ్రంగా స్పందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రికి కోచింగ్ సెంటర్లపైనా, పోటీ పరీక్షలపైనా, విద్యా వ్యవస్థపైనా అవగాహన లేదని పేర్కొన్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారం నిర్వహించే వ్యక్తి ముఖ్యమంత్రి సీట్లో కూర్చున్నారని, అందుకే ఆయనకు పాలన చేతకావడం లేదని విమర్శించారు. రేవంత్‌రెడ్డి తక్షణమే సీఎం పదవికి రాజీనామా చేసి కాంగ్రెస్‌లో యోగ్యుడైన, చదువుకున్న మరొకరికి బాధ్యతలు అప్పగించాలని సూచించారు. నిరుద్యోగులపైనా, తన కోచింగ్ ఇన్‌స్టిట్యూట్‌పైనా సీఎం కామెంట్ చేశారని, కానీ తన దగ్గర డీఎస్సీ కోచింగే లేదని వెల్లడించారు. రెండు నెలల్లో వంద కోట్లు వస్తాయని కామెంట్ చేశారని, మరి 2 నెలల్లో వందకోట్లు వచ్చేదుంటే... ఇప్పటి వరకు తనకు 4, 5 వేల కోట్లు రావాల్సి ఉండేదని ఎద్దేవా చేశారు. అవగాహనా రాహిత్యంతోనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇలా మాట్లాడుతున్నారని పేర్కొన్నారు. నిరుద్యోగుల ఆలోచనలకు అనుగుణంగా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని కోరారు. డీఎస్సీని సెప్టెంబర్‌లో నిర్వహించి, గ్రూపు 2, 3 పోస్టులు పెంచి డిసెంబర్‌లో పరీక్షలు నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. అభ్యర్థులు పరీక్షలకు హాజరైనా మానసిక సంఘర్షణతో రాయలేని పరిస్థితి ఉంటుందన్నారు. గ్రూప్-1మెయిన్‌లో 1:100 నిష్పత్తి సాధ్యమేనని, 2004లో ఇదే పద్ధతిలో నిర్వహించినట్టు గుర్తుచేశారు.

నిరుద్యోగులు సంఘ విద్రోహులా?

- ఎన్నికల హామీలు తప్పడం వల్లే వారి పోరాటం
- ప్రతిపక్షంలో ఒకలా.. అధికారంలో ఇంకోలా వ్యవహరిస్తరా..?
- ప్రభుత్వ అణచివేత చర్యలు, బెదిరింపులు సరికాదు
- ఆందోళనలో ఉన్న అభ్యర్థుల డిమాండ్లు నెరవేర్చాలి
- సీఎం రేవంత్‌రెడ్డికి మాజీ మంత్రి హరీశ్ బహిరంగ లేఖ



పదోతరగతిలో 10 జీపీఏ సాధించిన 75 మంది విద్యార్థులకు మాజీ మంత్రి, ఎమ్మెల్యే టీ హరీశ్‌రావు ఐ ప్యాడ్‌లు అందజేశారు. ఆదివారం సిద్దిపేటలోని తన క్యాంపు కార్యాలయంలో ఆయన వీటిని అందజేశారు. ఒక్కో ఐ ప్యాడ్ విలువ రూ. ... ఉంటుంది. వీటిని ఆయన తన సొంత ఖర్చులతో అందజేశారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ టెన్త్ ఫలితాల్లో సిద్దిపేట వరుసగా ఐదుసార్లు అగ్రస్థానంలో నిలవడం సంతోషంగా ఉన్నదని అన్నారు. - సిద్దిపేట

హైదరాబాద్, జూలై 14 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించకుండా, వారిని సంఘ విద్రోహులుగా చిత్రీకరించే ప్రయత్నం చేయడం సరికాదని మాజీ మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. గ్రూప్స్, డీఎస్సీ అభ్యర్థుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని ఆదివారం ఆయన సీఎం రేవంత్‌రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. అభ్యర్థుల సమస్యలు పరిష్కరించకుండా సీఎం మరింత రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం తగదని మండిపడ్డారు. ఉద్యోగార్థులతో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సమావేశం నిర్వహించి, ఎలాంటి ఉపశమనం కలిగించే మాటలు చెప్పలేదని పేర్కొన్నారు. హామీలు ఇచ్చి, అధికారంలోకి వచ్చాక మాట తప్పడం వల్లే నిరుద్యోగుల పోరాటం మొదలైందనే విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి గుర్తించాలని సూచించారు. 'మావి కొత్త డిమాండ్లు కావు, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించినవే. రాహుల్ గాంధీ సహా ఇతర కాంగ్రెస్ నాయకులు గ్రంథాలయాలు, కోచింగ్ సెంటర్లకు వచ్చి ఇచ్చిన హామీలే' అని ఉద్యోగార్థులు నెత్తీనోరు కొట్టుకుంటున్నా ప్రభుత్వం ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. ఉస్మానియా యూనివర్సిటీ సహా అభ్యర్థులు ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో పోలీసు బలగాలను మోహరించి, ఇనుపకంచెలు వేసి, ముందస్తు అరెస్టులు చేయడం అప్రజాస్వామిక మని మండిపడ్డారు. ఆఖరికి జర్నలిస్టులనూ బెదిరించడం, అరెస్టు చేయడం, దాడులకు పాల్పడటం హేయమైన చర్య అని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ అణచివేత చర్యలను ఖండించారు. అక్రమంగా అరెస్టు చేసిన వారిని తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

వేషాలకు పోవద్దు

నిరుద్యోగుల పోరాటం వెనుక రాజకీయ శక్తులు ఉన్నాయంటూ సీఎం రేవంత్‌రెడ్డి నిందారోపణలు చేయడం ఆక్షేపణీయమని హరీశ్‌రావు ధ్వజమెత్తారు. సాకులు చెప్పి తప్పించుకునే ప్రయత్నం చేయడం వల్ల అభ్యర్థులు, నిరుద్యోగుల సమస్యలకు పరిష్కారం లభించదని పేర్కొన్నారు. నిరుద్యోగుల కోసం పోరాటం చేసిన మోతీలాల్, గ్రూప్ 1,2,3 పోస్టులు పెంచాలని దరఖాస్తు చేసిన విషయాన్ని ఆధారాలతో సహా అభ్యర్థులు బయట పెట్టిన విషయాన్ని గుర్తుచేశారు. హామీలు ఇచ్చినవారు పదవుల్లో ఉంటే నిరుద్యోగులు మాత్రం ఇంకా రోడ్లమీదే ఉన్నారని ఆయన విమర్శించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు నిరుద్యోగుల డిమాండ్లపై అవకాశం దొరికిన ప్రతిసారి దీక్షకు కూర్చున్న సీఎం రేవంత్‌రెడ్డి ఆ విషయాన్ని మరిచిపోయినట్టు ఉన్నారని ఎద్దేవా చేశారు. ప్రతి అంశాన్ని రాజకీయ కోణంలో చూసే పద్ధతి వీడాలని సీఎం రేవంత్‌రెడ్డికి సూచించారు. విద్యార్థులు, నిరుద్యోగులు ఆశాంతితో ఉన్నారని, రాష్ట్రంలో పరిపాలన సవ్యంగా సాగటం లేదని పేర్కొన్నారు. అభ్యర్థులు, నిరుద్యోగుల జీవితాలను, వారి భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం సానుకూల దృక్పథంతో వ్యవహరించాలని కోరారు.

నోటిఫికేషన్ పాయింట్స్..సీఎం

- గ్రూప్ 2కు రెండు వేల ఉద్యోగాలు, గ్రూప్ 3కు మూడు వేల ఉద్యోగాలు అదనంగా కలుపుతామని ఇచ్చిన మాటను నిలుపుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది.
- పోటీ పరీక్షల మధ్య కాలవ్యవధి చాలా తక్కువ ఉండటం వల్ల అభ్యర్థులు ఇబ్బందులకు గురై ఆందోళనకు గురవుతున్నారు. జూలై చివరి వరకు డీఎస్సీ పరీక్షలు ఉన్నాయి. ఆగస్టు 7, 8 తేదీల్లో గ్రూప్ 2 పరీక్ష ఉన్నది. కేవలం 7 రోజుల గ్యాప్ మాత్రమే ఉన్నదని, ఇది తట్టుకోలేపోతున్నామని ఆవేదన చెందుతున్న అభ్యర్థులకు ప్రభుత్వం న్యాయం చేయదా?
- అధికారంలోకి రాగానే మెగా డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చేందుకు మొదటి క్యాబినెట్‌లోనే నిర్ణయం తీసుకుంటామని మ్యానిఫెస్టోలో ప్రకటించారు. 25 వేల టీచర్ పోస్టుల్లో డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేస్తామని నిరుద్యోగులను నమ్మించారు. ఆచరణలో అందుకు భిన్నంగా ప్రవర్తించారు. కేసీఆర్ ఇచ్చిన 6వేల పోస్టులకు మరో 5వేలు కలిపి 11 వేల పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చి మోసం చేశారు. కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోలో చెప్పిన దానికి కట్టుబడి మొత్తం ఉపాధ్యాయ ఖాళీలు భర్తీ చేసేలా మెగా డీఎస్సీ నిర్వహించాలి.
- అధికారంలోకి వచ్చిన ఏడాదిలోగానే 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామని, జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తామని హామీ ఇచ్చారు. పత్రికల్లో మొదటి పేజీ ప్రకటనలు ఇచ్చారు. అధికారం చేపట్టి ఏడు నెలలు దాటినా ఆ దిశగా అడుగులు పడలేదు. వెంటనే 2 లక్షల ఉద్యోగాల గుర్తింపు జాబ్ క్యాలెండర్, నోటిఫికేషన్ల విడుదల చేయాలి.
- రాష్ట్రంలోని నిరుద్యోగులకు నెలకు రూ. 4000 చొప్పున నిరుద్యోగ భృతి ఇస్తామని ప్రకటించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు నిరుద్యోగులకు బకాయిపడిన మొత్తంతో పాటు, నిరుద్యోగ భృతిని క్రమం తప్పకుండా చెల్లించాలి.
- అధికారంలోకి వస్తే జీవో నంబర్ 46 రద్దు చేస్తామని నిరుద్యోగులను నమ్మించారు. అధికారంలోకి రాగానే జీవో 46 ప్రకారమే నియామక ప్రక్రియ పూర్తిచేశారు. కాంగ్రెస్ మోసపూరిత వైఖరికి ఇది మరో నిదర్శనం. జీవో 46 ద్వారా ఏర్పడ్డ సమస్యలను పరిష్కరించి నిరుద్యోగులకు న్యాయం చేయాలి.

మాటమార్చడమే పనిగా పెట్టుకున్నారా?

కేసీఆర్ ప్రభుత్వం 503 ఉద్యోగాల భర్తీ కోసం గ్రూప్ 1 నోటిఫికేషన్ ఇచ్చిందని, వాటికి మరో 60 మాత్రమే చేర్చి 563 ఉద్యోగాలతో కొత్త నోటిఫికేషన్ వేశారని హరీశ్‌రావు వివరించారు. గతంలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి సీఎంగా ఉన్నప్పుడు గ్రూప్ 1 మెయిన్స్ పరీక్షకు 1:100 నిష్పత్తిలో ఎంపిక చేశారని, ఇటీవల ఏపీలో నిర్వహించిన గ్రూప్ 2 నోటిఫికేషన్‌లో పేర్కొన్నట్టుగా కాకుండా అభ్యర్థుల కోరిక మేరకు 1:100 నిష్పత్తిలో మెయిన్స్‌కి ఎంపిక చేసిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. గ్రూప్ 1 పరీక్ష అనేది యూపీఎస్సీ మాదిరిగా ప్రతి సంవత్సరం ఉండదని, రాష్ట్రస్థాయి సివిల్స్ పరీక్ష కావడం వల్ల ఆశావహుల సంఖ్య పెరిగిందన్నారు. 1:100 నిష్పత్తిలో మెయిన్స్‌కు ఎంపిక చేస్తే ప్రభుత్వానికి వచ్చిన నష్టమేమీ లేదని ఆయన వివరించారు. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కాంగ్రెస్ శాసన సభాపక్ష నాయకుడిగా ఉన్న సమయంలో గ్రూప్ 1 మెయిన్స్‌కు 1 :100 నిష్పత్తిలో అభ్యర్థులను ఎంపిక చేయాలని అసెంబ్లీ వేదికగా డిమాండ్ చేసిన విషయాన్ని గుర్తుచేశారు. ప్రతిపక్షంలో ఉంటే ఒకమాట అధికారంలో ఉంటే వేరొకమాటగా ప్రవర్తించడం ఎందుకని ప్రశ్నించారు.



నల్లగొండలోని గడియారం సెంటర్‌లో నిరసన తెలుపుతున్న నిరుద్యోగులు

గ్రూప్స్ వాయిదా వేయాలి

- పోస్టుల సంఖ్య పెంచాలి
- నల్లగొండలో నిరుద్యోగుల ధర్నా

రామగిరి, జూలై 14 : గ్రూప్- 2, 3 పరీక్షలను వాయిదా వేయడంతో పాటు పోస్టుల సంఖ్యను పెంచాలని డిమాండ్ చేస్తూ నిరుద్యోగులు ధర్నాకు దిగారు. ఆదివారం నల్లగొండ జిల్లాకేంద్రంలోని గడియారం సెంటర్‌లో ప్లకార్డులతో నిరసన తెలిపి, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పలువురు నిరుద్యోగులు మాట్లాడుతూ.. గ్రూప్-2, 3 పరీక్షలకు ఒకే సిలబస్ ఉన్నందున రెండు పరీక్షల నిర్వహణ మధ్య కనీసం రెండు నెలల గడువు ఉండాలని సూచించారు. అప్పుడే అభ్యర్థులు చదువుకోవడానికి సమయం ఉంటుందని తెలిపారు. ఎన్నికల ముందు గ్రూప్-2, 3కి రెండు వేల చొప్పున పోస్టులు పెంచి నోటిఫికేషన్ వేస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని, అధికారంలోకి రాగానే మాట మార్చుతున్నదని మండిపడ్డారు.

'పరీక్షలను వాయిదా వేయాలి'

హైదరాబాద్, జూలై 14 (నమస్తే తెలంగాణ): గ్రూప్-2, 3 పరీక్షలను వెంటనే వాయిదా వేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ ఎల్ మూర్తి, కార్యదర్శి టాకే నాగరాజు, డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు కోట రమేశ్, కార్యదర్శి ఆనగంటి వెంకటేశ్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు.

డీఎస్సీని వాయిదా వేయించండి

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి అభ్యర్థుల వినతి

హైదరాబాద్, జూలై 14 (నమస్తే తెలంగాణ) : డీఎస్సీని వాయిదా వేయించాలని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జీ కిషన్‌రెడ్డిని ఆదివారం అభ్యర్థులు కలిసి తమ గోడును వెళ్లబోసుకున్నారు. ఈ సందర్భంగా 40కి పైగా పుస్తకాలను కిషన్‌రెడ్డికి చూపించి.. వీటిని 25 రోజుల్లో ఎలా చదవగలమని ఆయన ముందు కన్నీటిపర్యంతం చెందారు. టెట్ తర్వాత 25 రోజుల సమయమే ఇచ్చారని, ప్రిపరేషన్‌కు ఈ సమయం సరిపోదని తెలిపారు. తమకు న్యాయం చేయాలని వేడుకున్నారు. స్పందించిన కిషన్‌రెడ్డి.. ప్రభుత్వం, అధికారులతో మాట్లాడి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు.

డీఎస్సీ హాల్‌టికెట్‌లో గందరగోళం

అమ్మాయి హాల్‌టికెట్‌పై అబ్బాయి ఫొటో.. సిగ్నేచర్

రామగిరి, జూలై 14: రేయింబవళ్లు డీఎస్సీకి సిద్ధమవుతున్న అభ్యర్థుల భవిష్యత్తు ప్రభుత్వ యంత్రాంగం నిర్లక్ష్యంగా కారణంగా ప్రశ్నార్థకంగా మారింది. నల్లగొండ జిల్లా చిట్యాలకు చెందిన రుద్రారపు భవ్య డీఎస్సీలో స్కూల్ అసిస్టెంట్ గణితం పోస్టుకు దరఖాస్తు చేసుకున్నది. ఆదివారం హాల్‌టికెట్ డౌన్‌లోడ్ చేసుకోగా.. ఆమె ఫొటో, సంతకానికి బదులు వేరొక అబ్బాయి ఫొటో, అతడి సిగ్నేచర్ వచ్చింది. అధికారులు స్పందించి తనకు న్యాయం చేయాలని భవ్య ప్రాధేయపడుతున్నది. దీనిపై డీఈవో భిక్షపతిని నమస్తే వివరణ కోరగా.. హాల్‌టికెట్‌లో సమస్యలు ఉంటే రాష్ట్ర విద్యాశాఖకు పంపి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు.

మంత్రులను కలిసి బాధలు చెప్పకోండి

- నిరుద్యోగులతో చర్చలకు సిద్ధంగా ఉన్నాం
- గౌడన్నల కృషివల్లే అధికారంలోకి కాంగ్రెస్
- మహేశ్వరంలో న్యూయార్క్‌ను తలదన్నే సిటీ నిర్మిస్తాం: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- 'కాటమయ్య రక్షణ కవచం' కిట్ల పంపిణీ



గీత కార్మికులకు కాటమయ్య రక్షణ కవచం కిట్లను పంపిణీ చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

రంగారెడ్డి, జూలై 14(నమస్తే తెలంగాణ): నిరుద్యోగులతో చర్చలకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. పరీక్షలను వాయిదా వేయాలని కొందరు, వద్దని మరికొందరు అంటున్నారని పేర్కొన్నారు. పరీక్షలు వాయిదా కోసం రోడ్లెక్కే బదులు మంత్రులను కలిసి వారి బాధలు చెప్పుకోవాలని సూచించారు. నిరుద్యోగుల సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం లష్కర్‌గూడలో స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మంత్రులు పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతో కలిసి ఆదివారం 'కాటమయ్య రక్షణ కవచం' కిట్ల పంపిణీ పథకాన్ని ముఖ్యమంత్రి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభా వేదికపై నుంచి రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి గౌడన్నల కృషి ఉన్నదని చెప్పారు. పెండింగ్‌లో ఉన్న రూ.7.9 కోట్ల ఎక్స్‌గ్రేషియా నిధుల విడుదలకు ఆదేశాలు జారీచేశారు. వేదిక ఆవరణలో సీఎం ఈత మొక్కలు నాటారు. గీత కార్మికులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్, మంత్రులకు గీత కార్మికులు మోకు, కల్లు కుండలను బహూకరించారు.

సేఫ్టీ కిట్లను స్వయంగా పరీక్షించిన సీఎం

లష్కర్‌గూడ వేదికగా బీసీ కార్పొరేషన్ ద్వారా 10వేల మందికి సేఫ్టీకిట్లను సీఎం తన చేతుల మీదుగా కొందరికి పంపిణీ చేశారు. అంతకుముందు స్పీకర్, మంత్రులతో కలిసి కిట్ల పనితీరును రేవంత్ స్వయంగా పరిశీలించారు. అంతకుముందు వాటి పనితీరును బీసీ వెల్ఫేర్ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం సీఎంకు వివరించారు. హైదరాబాద్ ఐఐటీ విద్యార్థుల బృందం ఆధునిక టెక్నాలజీతో ఈ సేఫ్టీకిట్లను తయారుచేసినట్టు తెలిపారు. ఎవరెస్టును అధిరోహించిన వారి సూచనలతో వీటికి రూపకల్పన చేసినట్టు వివరించారు. తాటి, ఈత చెట్ల పెంపకానికి ఐదెకరాలు ఇవ్వాలని, వనాలకు వెళ్లేందుకు మోపెడ్లు ఇవ్వాలని ఈ సందర్భంగా గీత కార్మికులు సీఎంను కోరారు. దీనికి రేవంత్ సానుకూలంగా స్పందించారు. రియల్ ఎస్టేట్ పెరగడం వల తాటి వనాలు తగ్గుతున్నట్టు చెప్పారు. కొత్తగా నిర్మిస్తున్న రోడ్ల పక్కన, చెరువు కట్టల వెంబడి ఏర్పాటు సందర్భంగా తాటి, ఈత చెట్లను నాటాలని నిబంధన విధిస్తామని పేర్కొన్నారు. కుల వృత్తులపై ఆధారపడిన వారంతా తమ పిల్లలను ఉన్నత చదువులు చదివించి ఐఏఎస్, ఐపీఎస్‌లుగా తీర్చిదిద్దాలని సూచించారు.

రంగారెడ్డి జిల్లాకు మహర్దశ

రంగారెడ్డి జిల్లాకు మహర్దశ పట్టబోతున్నదని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్ చుట్టూ మణిహారంలా ఏర్పాటవుతున్న రీజినల్ రింగ్‌రోడ్డుతోపాటు భవిష్యత్తులో రేడియల్ రోడ్లను అభివృద్ధి చేసుకోబోతున్నామని, పెద్ద ఎత్తున పార్కులు, ఐటీ పరిశ్రమలను ఏర్పాటు చేయబోతున్నట్టు చెప్పారు. న్యూయార్క్‌తో పోటీపడేలా మహేశ్వరంలో కొత్త నగరాన్ని నిర్మించబోతున్నట్టు తెలిపారు. హయత్‌నగర్‌కు త్వరలోనే మెట్రో రైలు రాబోతున్నదని తెలిపారు. ఐటీ కంటే అద్భుతమైన రాచకొండ ప్రాంతంలో ఫిల్మ్ ఇండస్ట్రీని ఏర్పాటు చేయబోతున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో శాసన సభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్, రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీలు పట్నం మహేందర్‌రెడ్డి, ఎగ్గె మల్లేశం, ఏఐసీసీ కార్యదర్శి, దయానంద్, ఎమ్మెల్యేలు మల్‌రెడ్డి రంగారెడ్డి, ప్రకాశ్‌గౌడ్ ఉన్నారు.

గౌడన్నలకు అధునాతన మోకులు

బీఆర్ఎస్ హయాంలోనే రూపకల్పన

హైదరాబాద్, జూలై14 (నమస్తే తెలంగాణ): తాటిచెట్లపై నుంచి పడి ప్రతి సంవత్సరం ఎంతోమంది కల్లుగీత కార్మికులు ప్రాణాలు కోల్పోతున్న నేపథ్యంలో వాటి నివారణకు ఆధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో సేఫ్టీ మోకులు రూపొందించాలని గత ప్రభుత్వం నిర్ణయించింది. అందులో భాగంగా బీసీ సంక్షేమశాఖకు బాధ్యతలు అప్పగించి దాదాపు రూ. 8 కోట్లు కేటాయించింది. బీసీ సంక్షేమశాఖ ఆ బాధ్యతను ఓ ఏజెన్సీకి అప్పగించింది. ఐఐటీ హైదరాబాద్ సహకారంతో ఆ ఏజెన్సీ సేఫ్టీ మోకులను రూపొందించింది. అప్పుడే వాటిని పంపిణీ చేయాలని బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పాట్లు చేయగా ఎన్నికల కోడ్ కారణంగా నిలిచిపోయింది. ఇప్పుడు 'కాటమయ్య రక్షణ కిట్లు' పేరిట కాంగ్రెస్ ప్రభుత్వం పంపిణీ చేస్తున్నది అవే. రాష్ట్రవ్యాప్తంగా 2 లక్షల మందికి అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఒక్కో సేఫ్టీమోకు రూ. 9 వేలపైనే ఉంటుందని అధికారులు తెలిపారు.

డీఎస్సీ వాయిదా వేయబోం

- నోటిఫికేషన్ ప్రకారమే పరీక్ష నిర్వహిస్తాం
- త్వరితగతిన ఉద్యోగాలు ఇవ్వడమే మా ఆలోచన
- త్వరలో 5-6 వేల పోస్టులతో మరో నోటిఫికేషన్
- తేల్చిచెప్పిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



హైదరాబాద్, జూలై 14(నమస్తే తెలంగాణ): డీఎస్సీని వాయిదా వేయాలంటూ విద్యార్థులు విజ్ఞప్తులు, ధర్నాలు చేస్తున్నారు, అయితే పరీక్ష వాయిదా వేసేది లేదని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టంచేశారు. విద్యార్థులు పరీక్షలు రాయాల్సిందేనని తేల్చిచెప్పారు. ఈ నెల 18 నుంచి నిర్వహించే పరీక్షలకు హాజరై, సెలక్ట్ కావాలని సూచించారు. ఇదే చివరి డీఎస్సీ కాదని, ఇందులో సెలక్ట్ కాకపోతే మరో డీఎస్సీ వస్తుందని అన్నారు. ఈ మేరకు డీఎస్సీ వాయిదా వేయాలంటూ అభ్యర్థులు చేస్తున్న ఆందోళనపై స్పందించిన ఆయన.. ఆదివారం గాంధీభవన్‌లో మాట్లాడారు. నోటిఫికేషన్ ప్రకారమే ముందుకు వెళ్లాలని నిర్ణయించామని తెలిపారు. రాష్ట్రంలో మొత్తం 16 వేల టీచర్ పోస్టుల ఖాళీలు ఉన్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో గత ప్రభుత్వం 5 వేల టీచర్ పోస్టుల భర్తీకి ఇచ్చిన నోటిఫికేషన్‌కు మరో 6వేల పోస్టులను జోడించి తమ ప్రభుత్వం మొత్తం 11 వేల పోస్టులతో నోటిఫికేషన్ జారీ చేసిందని వివరించారు. మిగిలిన 5-6 వేల పోస్టులతో కొద్ది నెలల్లోనే మరో డీఎస్సీ నోటిఫికేషన్ ఇస్తామని వెల్లడించారు. ఇందిరమ్మ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మరుక్షణం నుంచే నిరుద్యోగుల సమస్యపై దృష్టి పెట్టామని, ఇందులో భాగంగానే 3 నెలల్లోనే 30 వేల మందికి అపాయింట్‌మెంట్ ఆర్డర్లు ఇచ్చామని తెలిపారు. చెప్పినట్లుగానే సర్వీస్ కమిషన్‌ను ప్రక్షాళన చేసి పూర్తిస్థాయిలో ఉద్యోగాల క్యాలెండర్‌ను ప్రారంభించినట్టు వివరించారు. ఇప్పటికే 13,321 పోస్టుల భర్తీకి సర్వీస్ కమిషన్ చర్యలు చేపట్టిందని అన్నారు. గత ప్రభుత్వం పరీక్షల వాయిదాతో అభ్యర్థులు ఇబ్బంది పడ్డారని, ఇప్పుడు ఆ పరిస్థితి రాకుండా ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

'కల్యాణ లక్ష్మి' వసూళ్ల'పై సీఎం ఆరా

- 'నమస్తే తెలంగాణ' కథనానికి ముఖ్యమంత్రి స్పందన
- ప్రభుత్వ విప్‌ను హైదరాబాద్‌కు పిలిపించుకున్న సీఎం?

నమస్తే ఎఫెక్ట్

సిరిసిల్ల రూరల్, జూలై 14: రాజన్న సిరిసిల్ల జిల్లాలో కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ కోసం కాంగ్రెస్ నేతలు లబ్ధిదారుల నుంచి పైసలు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలపై సీఎం రేవంత్‌రెడ్డి ఆరా తీసినట్టు తెలిసింది. ఈ విషయమై 'నమస్తే తెలంగాణ'లో ఆదివారం 'కల్యాణలక్ష్మికి పైసా వసూల్' శీర్షికన ప్రచురితమైన వార్తకు సీఎం స్పందించారని సమాచారం. సీఎంవో నుంచి కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు ఫోన్ చేసి హైదరాబాద్‌కు రావాలని సూచించగా.. ఆయన పైసా వసూల్ విషయాన్ని ముఖ్యమంత్రికి వివరించినట్టు తెలిసింది. ఈ విషయంపై స్పెషల్ బ్రాంచి, ఇంటెలిజెన్స్ విభాగ అధికారులు కూడా వివరాలు సేకరించి రిపోర్ట్ చేయడం గమనార్హం. సదరు కాంగ్రెస్ నేతపై ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి.

నిరుద్యోగులకు నరకం చూపిస్తున్న సర్కార్

బీఆర్ఎస్వీ ఉపాధ్యక్షుడు తుంగబాలు



హైదరాబాద్, జూలై 14 (నమస్తే తెలంగాణ): డీఎస్సీని వాయిదా వేయాలని నిరసన వ్యక్తం చేస్తున్న నిరుద్యోగులపై విచక్షణా రహితంగా దాడి చేయడం అప్రజాస్వామికం అని బీఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుంగబాలు దుయ్యబట్టారు. ఉద్యోగాలు పెంచుమని అడిగితే సాంకేతిక కారణాలు చెప్పి కాంగ్రెస్ ప్రభుత్వం తప్పించుకోవాలని చూస్తున్నదని ప్రకటనలో ఆరోపించారు. హామీలను నిలబెట్టుకోవడం కాంగ్రెస్ సర్కారుకు చేతకాక నిరుద్యోగులపై దాడికి పాల్పడి రాక్షస ఆనందం పొందుతున్నదని మండిపడ్డారు. అధికారంలోకి రాగానే నిరుద్యోగులకు స్వర్గం చూపుతామని ఆశలు కల్పించిన కాంగ్రెస్ ఇప్పుడు నరకం చూపిస్తున్నదని వాపోయారు. ఇందిరమ్మ రాజ్యమంటే రాష్ట్రంలో ఎమర్జెన్సీని తేవటమా? అని ప్రశ్నించారు.

పరీక్షలు వాయిదా పడితే చిక్కులు

పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క



హైదరాబాద్, జూలై 14 (నమస్తే తెలంగాణ) : కొందరు విద్యార్థులు పోటీ పరీక్షలను వాయిదా వేయాలని కోరుతున్నారని, వాయిదా వేస్తే న్యాయ, సాంకేతికపరమైన చిక్కులు తలెత్తుతాయని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి సీతక్క అన్నారు. అంతేకాకుండా తోటి నిరుద్యోగులకు తీరని నష్టం వాటిల్లుతుందని పేర్కొన్నారు. నిరుద్యోగుల ప్రయోజనం కోసమే షెడ్యూల్ ప్రకారం పరీక్షలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించినట్టు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు త్వరలో జాబ్ క్యాలెండర్ విడుదల చేసి ప్రతిఏటా నోటిఫికేషన్లు ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నట్టు పేర్కొన్నారు.

మోనార్క్ వైఖరి వల్లే..

- దుందుడుకుతనంతోనే సమస్య
- ఆరు నెలల్లోనే ఇన్ని ఆందోళనలా?
- కాంగ్రెస్ పార్టీ పరువు పోతున్నది
- సీఎం రేవంత్‌రెడ్డిపై సీనియర్ల కుతకుత
- అసలు కాంగ్రెస్ నేతల మండిపాటు

హైదరాబాద్, జూలై 14 (నమస్తే తెలంగాణ): 'ఊరంతా ఒకదారి... ఉలిపికట్టెది ఓ దారి' అన్న చందంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యవహరిస్తున్నారని అసలు కాంగ్రెస్ (ఏసీ) నాయకులు వాపోతున్నారు. రాష్ట్రంలో పదేండ్ల తర్వాత ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే అవకాశాన్ని ప్రజలు ఇస్తే.. వారి నమ్మకాన్ని వమ్ము చేసే ప్రభుత్వానికి చెడ్డ పేరు తెచ్చేలా రేవంత్‌రెడ్డి మొండిగా వ్యవహరిస్తున్నారని సహచర మంత్రులు, సీనియర్ నేతలు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. రేవంత్‌రెడ్డి వైఖరిని మంత్రులు, సీనియర్లు అంతర్గత సంభాషణల్లో తప్పుపడుతున్నారు. రేవంత్‌రెడ్డి మొండివైఖరి, ఏకపక్ష నిర్ణయాల వల్ల ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వచ్చిందని చర్చించుకుంటున్నారు. స్వల్ప వ్యవధిలో వ్యతిరేకత రావడానికి కారణాలపై పార్టీలో అంతర్మథనం జరుగుతున్నది. కారణాలపై అధిష్ఠానం ఆరా తీస్తున్నది.

నిరుద్యోగుల ఆందోళన అంశంలోనూ...

కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి రావడానికి కారణమైన నిరుద్యోగులే ఇప్పుడు ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళనలు చేసే పరిస్థితి వచ్చింది. అన్ని పరీక్షలు ఒకసారి నిర్వహించడం వల్ల అవకాశాలు కోల్పోవాల్సి వస్తుందని, కొన్నింటినైనా వాయిదా వేయాలంటూ నిరుద్యోగ యువత రోడ్డెక్కుతున్నా.. సీఎం రేవంత్‌రెడ్డి మొండిగా వ్యవహరించడం వల్ల వీరిని దూరం చేసుకునే పరిస్థితి ఏర్పడిందని సొంత పార్టీ నేతలే మండిపడుతున్నారు. ఆందోళనకారులతో సమావేశమై వారి డిమాండ్లు విని, ప్రభుత్వ విధానాన్ని వివరించి సమస్యను పరిష్కరించే అవకాశం ఉన్నప్పటికీ, సీఎం రేవంత్‌రెడ్డి మాత్రం వేషాలకు వెళ్లి వారి ఆందోళనను అణచివేసే ధోరణి అవలంబిస్తున్నారని పార్టీ వర్గాలు తప్పుపడుతున్నాయి. సున్నితంగా హ్యాండిల్ చేయడానికి బదులు ఆందోళనకారులను ఉద్దేశించి రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు మరింత జటిలం చేశాయని అభిప్రాయపడుతున్నారు.

ఎమ్మెల్యేల చేరికల్లో ఏకపక్ష ధోరణి

ప్రభుత్వ అధినేతగా సీఎం రేవంత్‌రెడ్డి తీసుకుంటున్న ఏకపక్ష నిర్ణయాలతోపాటు పీసీసీ అధ్యక్షుడిగా అవలంబిస్తున్న విధానాలు పార్టీలోనూ తీవ్ర వ్యతిరేకతకు దారి తీసిందని పార్టీ వర్గాలు చెప్తున్నాయి. సీనియర్ నాయకుడు టీ జీవన్‌రెడ్డికి మాట మాత్రం చెప్పకుండా తన రాజకీయ ప్రత్యర్థి, జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్‌ను పార్టీలో చేర్చుకోవడాన్ని తీవ్రంగా వ్యతిరేకించిన విషయం తెలిసిందే. ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయడానికి జీవన్‌రెడ్డి సిద్ధపడగా అధిష్ఠానం ఆయనను ఢిల్లీకి పిలిపించి బుజ్జగించింది. ఎమ్మెల్యే దానం నాగేందర్‌ను పార్టీలో చేర్చుకొని సికింద్రాబాద్ ఎంపీ టికెట్ ఇవ్వడాన్ని మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్‌తోపాటు వీ హనుమంతరావు, నిరంజన్ వంటి సీనియర్ నేతలు తీవ్రంగా వ్యతిరేకించారు. నిరంజన్ ఏకంగా పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయడం పరిస్థితి తీవ్రతకు అద్దంపడుతున్నది. కడియం శ్రీహరిని పార్టీలో చేర్చుకోవడాన్ని ఉమ్మడి వరంగల్ జిల్లా కాంగ్రెస్ నేతలు ముక్తకంఠం తో వ్యతిరేకించారు. స్టేషన్‌ఘన్‌పూర్‌లో కడియం శ్రీహరిపై పోటీ చేసి ఓడిపోయిన అభ్యర్థి ఇందిర ధర్నా చేసినా ఖాతరు చేయకపోగా, శ్రీహరి కూతురు కావ్యకు వరంగల్ ఎంపీ టికెట్ ఇచ్చి రేవంత్‌రెడ్డి పంతం నెగ్గించుకున్నారని గుర్తుచేస్తున్నారు. గద్వాల కాంగ్రెస్ అభ్యర్థి, మాజీ జడ్పీ చైర్‌పర్సన్ సరితతోపాటు పార్టీ శ్రేణులు గాంధీభవన్ ఎదుట ఆందోళన చేసినా పట్టించుకోకుండా అదే నియోజకవర్గ ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డిని, చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్యను చేర్చుకున్నారు. ఆ నియోజకవర్గ శ్రేణులు వ్యతిరేకించినా పార్టీ కండువా కప్పడంతో పాత తరం నేతలను దూరం చేసుకున్నట్టయిందని అంటున్నారు.

నామినేటెడ్ పోస్టులపైనా వివాదం

నామినేటెడ్ పదవుల విషయంలో తమతో చర్చించకుండా, తమ సొంత జిల్లా, నియోజకవర్గాలకు చెందిన తమ వ్యతిరేకులకు పదవులు ఇవ్వడం ఏమిటని మంత్రులు బాహాటంగానే తప్పుపడుతున్నారు. కరీంనగర్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్‌గా కే నరేందర్‌రెడ్డి నియామకాన్ని ఆ జిల్లాకు చెందిన మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్రంగా వ్యతిరేకించారు. జిల్లాకు చెందిన మంత్రికి సమాచారం లేకుండా నామినేటెడ్ పదవులు కట్టబెడితే తమకు విలువేమి ఉంటుందని పొన్నం మండిపడిన విషయం తెలిసిందే. మీ ప్రమేయం లేకుండానే తనకు పదవి వచ్చిందని నరేందర్‌రెడ్డి పరోక్షంగా మంత్రి పొన్నం ప్రభాకర్‌కు తెలియజేయడానికి వచ్చి, అతను ఇచ్చిన బొకేను విసిరేసి మంత్రి తన ఆగ్రహాన్ని వ్యక్తంచేయడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతున్నది. వరంగల్‌లో ఇనుగాల వెంకట్రామిరెడ్డిని కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్‌గా నియమించడాన్ని మంత్రి కొండా సురేఖ బాహాటంగా వ్యతిరేకించారు. సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి అసంతృప్తిని వ్యక్తం చేశారు.

మంత్రివర్గ విస్తరణలోనూ వివక్ష

మంత్రిమండలిలో ప్రాతినిధ్యం లేని జిల్లాలు, సామాజిక వర్గాలకు మంత్రివర్గ విస్తరణలో తొలి ప్రాధాన్యం ఇవ్వాలనేది అధిష్ఠానం ఆలోచన. కానీ, ఇప్పటికే ప్రాతినిధ్యం ఉన్న జిల్లాలకు, సామాజిక వర్గాలకే మంత్రి పదవులు కట్టబెట్టేందుకు సీఎం రేవంత్‌రెడ్డి చేసిన ప్రయత్నాలకు అధిష్ఠానం తాజాగా బ్రేక్ వేసింది. ప్రస్తుత క్యాబినెట్‌లో ఆదిలాబాద్, నిజామాబాద్, రంగారెడ్డి, హైదరాబాద్‌కు ప్రాతినిధ్యం లభించలేదు. బీసీ సామాజిక వర్గానికి చెందిన ఇద్దరికే మంత్రివర్గంలో చోటు దక్కింది. ఇప్పటికే రెడ్డి సామాజికవర్గానికి చెందిన నలుగురికి స్థానం కల్పించినప్పటికీ , మరో ఇద్దరికి కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి (నల్లగొండ), సుదర్శన్‌రెడ్డి (నిజామాబాద్) పేర్లను సీఎం రేవంత్‌రెడ్డి సిఫారసు చేశారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లా నుంచి ఎవరికీ ప్రాతినిధ్యం లేకపోవడంతో సుదర్శన్‌రెడ్డిని ఎవరూ వ్యతిరేకించలేదు. కానీ ఇప్పటికే నల్లగొండ జిల్లా నుంచి ఇద్దరు మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి కొనసాగుతుండగా, ఒకే కుటుంబం నుంచి రెండో మంత్రి పదవిని రాజగోపాల్‌రెడ్డికి ఇవ్వాలన్న రేవంత్‌రెడ్డి ప్రతిపాదనను అధిష్ఠానం కూడా తప్పుపట్టినట్టు సమాచారం. ఆదిలాబాద్ నుంచి దివంగత వెంకటస్వామి కుటుంబం నుంచి ఇద్దరు కుమారులు వివేక్, వినోద్ ఎమ్మెల్యేలుగా, మనవడు వంశీ పెద్దపల్లి ఎంపీగా ఉండగా, అదే కుటుంబం నుంచి వివేక్‌కు మంత్రి పదవి ఇవ్వాలని రేవంత్‌రెడ్డి సిఫారసు చేశారన్న సమాచారంతో పార్టీలో తీవ్ర వ్యతిరేకత వచ్చింది. ఆదిలాబాద్ జిల్లాలో మొదటి నుంచి పార్టీకి పెద్దదిక్కుగా ఉన్న మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావుకు కాకుండా వెంకటస్వామి కుటుంబానికే అన్ని పదవులు కట్టబెట్టాలన్న సీఎం నిర్ణయాన్ని, పార్టీ ముఖ్య నేతలు కూడా అధిష్ఠానం వద్ద తప్పుపట్టినట్టు సమాచారం. ఒకవైపు పార్టీ పట్ల, మరోవైపు ప్రభుత్వం పట్ల ప్రజల్లో వ్యతిరేకత రోజురోజుకు పెరుగుతున్నదని ఇక్కడి రాష్ట్ర నేతలు, అక్కడి అధిష్ఠానం పెద్దలు ఆందోళన చెందుతున్నట్టు పార్టీ వర్గాల సమాచారం.





చెలిమె

తెలంగాణ ప్రజలకు భాష ఓ పలుకు మాత్రమే కాదు. చరిత్ర మారినా చెదరని అస్తిత్వం. అందుకే తెలంగాణ ఘన సాహిత్యానికి పెద్దపీట వేస్తూ చెలిమెను నిర్వహిస్తున్నది మన పత్రిక. అలిసొలసిన వేళల్లో కళారూపమైనా, పోరుబాటల్లో పాటలా మారినా, ఆత్మగౌరవాన్ని కథతో నినదించినా... తనదైన శైలి తెలంగాణది. ఆ సాహిత్యంలో మీకు ఎలాంటి అభిరుచి ఉన్నా, కలాన్ని కదిలించండి. ఆసక్తిగా, సూటిగా తెలంగాణ సాహిత్యానికి సంబంధించిన రచనలు చేయండి... editpage@ntnews.com

ఎమొనే

ఓ మంచి పుస్తకంలా
అమ్మను ఎప్పుడు చదివినా
నా చదువు సిగ్గు పడుతుంది...

అమెను పరీక్షలా రాయాలని
నా తెలివి ఎంత కష్టపడ్డా
పాస్ మార్కులు కూడా రావడం లేదు

ఏ క్షణం నా గొంతు విడిపడినా
మునివేళ్లతో నిద్ర లేచే ఓపిక ముందు
నా యవ్వనం ఓడిపోతుంది.

ఎన్నో వద్దనుకొని
బిడ్డ కోసం అన్నీ కోరుకునే
ఆ ప్రేమకు ఋణం తీరేది కాదు



చందలూరి నారాయణరావు
97044 37247



నాన్న...

నాన్న..
తనువు త్యాగం కథ చెప్పి
ఇంటికి యజమానిగ
ఊరికే చలామణవుతుంటాడు!
నిజానికి నిజాలను
మింగిన గొప్ప నిరంకుశుడు!!

కుటుంబ కష్టాల్ని
హాలాహలంగ కంఠంలో దాచిన
శివునిలా బిల్డప్ ఇస్తుంటాడు!
కాని కంటికి కనబడని పాపిష్ఠి!!

నాన్న..
పెద్ద డబ్బు పిసినారి
పొదుపుకు కేరాఫ్ అడ్రస్!
ప్రకృతి కూరగాయల్లా బేరమే
లోకం దృష్టిలో అవర కుబేరుడు!!

నాన్న..
నంబర్ వన్ పకీర్ సాహెబ్!
అంక్షలే అంక్షలు..
రూల్స్ రూల్స్..
అదేంటో మేమేమన్నా కాదనడు.
మమ్మల్నెప్పుడూ ఓడిపోనివ్వడు!!

నాన్న..
చదువు చదువు అంటూ
నిత్యం వేధించే పరమ శాడిస్టు!
మోస్ట్ వాంటెడ్..
గొప్ప విలియన్ పిల్లోడు!!

నాన్నంటే
నొప్పించడం, ఏడిపించడం
ఇక అంతే..
వాటికి ప్రేమించడమే రాదు!
దిగ్గన కుమ్మినా
అదేంటో నవ్వులా నిద్రపోడు!!

నాన్న..
ఆధునిక పోకడలు తెల్వని
రాతియుగం మనిషి!
అయినేట్ అప్పుడు
పాత తరం ఎర్రబాగులోడు.
ఏదడిగినా ఇట్టే చెప్పేస్తాడు!!

నాన్న..
తప్పొప్పులకు తక్కెడ పెట్టి
మస్తు అల్సాగ్ జోకుతడు!
ప్రఖ్యాత విమర్శకుడు, లాజికోడు.
మమ్మల్ని ఒక్క మాటా అనడు.
అదేంటో రోజూ పేదంతా అమ్మతోనే!!

నాన్న మొనార్క్..
ఎప్పుడూ మాతో గడపడు.
బాధ్యతల తప్ప
రాజీపడ్డమెరుగని క్రైంచుమన్!
పక్కి పని రాక్షసుడు!!
ఎక్కడా ఎక్స్‌పోజ్ అవ్వని
An Encyclopedian!

నాన్న..
నవ్వితే నవ్వడు
ఏడిస్తే ఏడ్వడు
వామ్మో! అయన లెవలే వేరు!!
అబ్బో! గొప్ప ఆస్కార్ నటుడు!!

నాన్న..
ఎప్పుడూ నిజం చెప్పడు
ఉన్నది లేనట్లు
లేనిది ఉన్నట్లు
అతిశయోక్తికే అలంకారం!
హాలీవుడ్ కేమ్స్‌బాండ్!!

నాన్న..
ఇంటికి దారం, ఆధారము!
ఆజానికి
దానం, మూలదానము!!
నొసటి మీద ఎక్కిస్తే..
నిప్పుల అలోచనల వేడికి కరిగి
ఇట్టే నెయ్యయిపోద్దు!

మేము ఎన్నన్న సెప్పురి!
నమ్మైన అనుకోరి!!
No doubt about it!
He is Pakka Commercial!!!



అశోక్ అవారి
90005 76581

వద్దన్నా వచ్చి వాలే కవిత్వ సీతాకోక చిలుక!



'వద్దంటే వస్తున్నాయి సీతాకోక చిలుకలు, ఈ అర్ధరాత్రి పూట నా ఏకాంతంలోకి ఏ అలికిడీ లేకుండా. దేహం మీద, దండెం మీద, పెదవుల మీద మెత్తగా వాలుతున్నాయి. వస్తూ వస్తూ అదవులను తీసుకుని వస్తున్నాయా? లేక నన్నే అడవుల్లోకి తీసుకొని వెళ్తున్నాయా?' అనే విచికిత్సలోకి జారిపోయాడు వనమూరు శ్రీధర్ బాబు ఈ జూన్ మాసంలో.

> నిత్యం జన సమూహం మధ్య మసలుతూ, ఈ బహిర ప్రపంచపు అనుభవ్యాలను అనుభవంలోకి తెచ్చుకుంటూ కూడా ఒక మహా రత్నం లాంటి ఏకాంతాన్ని ఎంతో కొంత తన కోసం మిగుల్చుకుంటే తప్ప, తన ఏకాంత మందిరంలోకి నిరవ్యంతరంగా వచ్చి వాలదా సీతాకోక చిలుక.

ఎవరి కవిత్వంలోనైనా ఏముంటుంది? కొన్ని బిక్కిళ్లు, కొన్ని విరహాలు, కొంత దుఃఖం, మరికొంత ఆగామి జీవితం పట్ల ఆశలు మోసుకెళ్తే కుతూహలం నిరీక్షణలు తప్పిస్తే. 'శ్రీశ్రీ బాధ ప్రపంచం బాధ' అనీ, 'కృష్ణశాస్త్రి బాధ ప్రపంచానికి బాధ' అనీ అభివ్యక్తి చమత్కారంతో మనం వ్యాఖ్యానించవచ్చు. కానీ, అదంతా లోలోపలి తీవ్రపు బాధ అని విశ్వనాథ అంటే తప్పుబట్టడానికి కూడా ఏమీ ఉండదు.

కవిత్వం ఎప్పుడూ ఒక సఫోకేషన్ నుంచి ఒక బ్రాకెట్ రిలీఫ్ లేదా ఒక విషాద విశ్రాంతిని అన్వేషించడానికి కవి తనను తాను దహించుకునే వ్యర్థ ప్రయత్నం. వ్యర్థ ప్రయత్నం అని ఎందుకు అనడం అంటే లోలోపలి దుఃఖం నిలువెల్లా ముంచెత్తితే తప్ప దుఃఖోద్విగ్న హృదయానికి శాంతి లభించదు కనుక. వ్యర్థ ప్రయత్నం అని ఎందుకు అనడం అంటే లోలోపలి వేదనను, దుఃఖాన్ని వర్ణార్ద్రకోవడానికి లోలోపలే దాగి ఉన్న అంతః సరోవరాలను వెన్నరించి, బాహ్య నదీ సంగమాల కోసం దారి తెన్నూ తెలియక, ఉషాల దుర్గమారణ్యంలో తప్పిపోవడం కనుక.

> 'ఇంతా ఏకవచనమేనా? ఆ మాత్రం గౌరవం లేదా మనిషంటే?' అని రెండు దశాబ్దాల కిందట 'అనేకవచనం'లో ప్రశ్నించిన వనమూరు శ్రీధర్ బాబుకు, రెండు దశాబ్దాల తర్వాత 'అనేక వచనం 2.0' ఎదుర్కొన్న ఎడిషన్ 'నిదుర పోని మెలకువ చెప్పిన కథ' లేదా అనేకవచనం రెండవ ముద్రణ ప్రచురిస్తున్నప్పుడు బహుశా తెలిసి ఉంటుంది.

మనిషి ఏక కాలంలో ఏకవచనము, బహువచనము అంతా అనేక వచనము కూడా అని. అందుకే మో అప్పుడెప్పుడో 16వ శతాబ్దంలో తన ఆధ్యాత్మిక గురువు టాకీన్ జా సూచన మేరకు అత్యద్భుతంగా ఉన్న తోటను శుభ్రం చేసి, అద్దంలా మెరిసేలా తళ తళమని కాంతులీనేలా చేసిన సేన్ నో రిక్యు (Sen no Rikyu) మళ్లీ చెర్రీ పూల చెట్టును బలంగా ఊపి మరీ, పూల రెక్కలతో ఆ Perfect Land Scapeను Imperfect చేసి Perfe -ction is nothing but imperfe - ction అన్న వాబీ, సాబీ తాత్విక తను వాడేసుకున్నాడు.

Wabi–sabi is not slick, modern, shiny, or new. It is a quirky flea market find, an antique family heirloom, or an aged wooden floor. It's about simplicity, natural beauty, and a perfectly imperfect feel. ఇది వాబీ సాబీ అంటే.

వనమూరు శ్రీధర్‌బాబు రెండవ కవిత్వ సంపుటి 'నిదురపోని మెలకువ చెప్పిన కల' కవిత్వం చదువుతున్నప్పుడు నాకు గుర్తొచ్చిన వాక్యాలు అవి. తన కవిత్వం చదువుతున్నప్పుడు, ఆ కవిత్వంలోని మార్దవానికి, మృదుత్వానికి, రాలిన చెర్రీ పూల పరిమళాన్ని మోసుకుని వచ్చే గాలి గంధాల నిగారింపు సౌందర్యానికి నేను పడిపోయాను. మార్మిక శుద్ధ వందమ పూల తొలి ప్రభాతంలో పొగ మంచు తెరలను తొలగించుకుంటూ, నేల మీద రాలిన చంద్ర కాంత పుష్పా ను ముద్దాడటానికి తొలి సూర్యకిరణం తన హృదయాన్ని ఎంత శుభ్రం చేసుకుంటుందో ఈ కవిత్వాన్ని చదవడానికి మనము మన హృదయాన్ని అంత శుభ్రం చేసుకోవాలి. అయినా శుభ్రం చేసిన ల్యాండ్‌స్కేప్ మీద రాలిన చెర్రీ పూల లాగా ఏవో కొన్ని అస్పష్ట నీడలు మన హృదయంలో ఉన్నా వాటితోనూ ఈ కవిత్వాన్ని మనం ప్రేమించగలుగుతాము. ఇంతకూ శ్రీధర్‌బాబు తన కవిత్వం ద్వారా మనకు చెప్తున్నదేమిటి?

నేనొకడిని ఆ చెరువు గట్టుపూ తాడిచెట్టునూ,
నీలాకాశాన్ని తదేకంగా చూసి మెరుపులాగా
అక్కడ అదేదీ వుండదు
నేను మాత్రమే వుంటాను-
ఇప్పుడు మరోలా చెప్తాను
నేనొకడిని ఆ చెరువు గట్టుపూ తాడిచెట్టునూ నీలాకాశాన్ని తదేకంగా చూసి మెరుపులాగా ఇక నేనే
ఉండను చెరువుగట్టు, తాడిచెట్టు
నీలాకాశమే ఉంటాయి
నేను మాత్రమే వున్నప్పుడు నేనొక కవిని
అప్పుడు నువ్వు నన్ను
పాడుకుంటూ పోవచ్చు
నేను లేనప్పుడు... నేను కవిత్వాన్ని
అప్పుడు నువ్వు పఠం కట్టి తీసుకుపోవచ్చు..

ఇది 'తత్ ఏకం' పేరుతో శ్రీధర్‌బాబు రాసిన చివరి నుంచి రెండవ కవిత. ఈ తత్ ఏకం అనే మాట కేవలం మాట మాత్రమే కాదు. అదొక జీవన విధానం కూడా. ఈ స్థావర జంగమాత్మక ప్రపంచంలో, ఈ చరాచర సృష్టిలో ప్రతి అంశంతో, ప్రతి వస్తువుతో తనను తాను సంలీనపరచుకునే శక్తి మనిషికి కలిగినప్పుడు అప్పుడిక దేనితోనూ పేచీ ఉండదు. పేచీ ఉండనప్పుడు దుఃఖం ఉండదు, ఒకవేళ దుఃఖం ఉన్నా అది కూడా అనుభవనీయం అనే జ్ఞానం కలుగుతుంది. దుఃఖాన్ని కూడా నిర్మోహంగా లోపలికి తీసుకుంటున్నప్పుడు మనిషికి కావలసినది ఏదీ ఉండదు. అప్పుడు అతడు కూడా ఈ సకల చరాచర సృష్టిలో ఒక జీవి. అంతే! పువ్వుకీ, పువ్వు మీద వాలే సీతాకోక చిలుకకి అభేదం ఉన్నట్టే మనిషికీ ప్రకృతికీ మధ్య కూడా అభేదం అనే వంతెన ఏర్పడుతుంది. ఆ వంతెన మీద సకల జాతుల సమూహాలు నడిచివెళ్తాయి. అయితే ఇదంతా సులభంకాదు.

వ్యక్తిత్వ వికాస నిపుణులు తరచూ ఇంపాజిబుల్‌లోనే ఐ యామ్ పాజిబుల్ అన్న అర్థం ఉన్నదని చెప్తూ ఉంటారు. శ్రీధర్‌బాబు లాంటి కవులు జీవితపు అసంపూర్ణత్వంలోనే సంపూర్ణత్వం ఉన్నదనీ, జీవితపు అపరిపూర్ణతలోనే పరిపూర్ణత ఉన్నదని చెప్తారు. పరిపూర్ణత అంటే శూన్యమనీ, సంపూర్ణత్వం అంటే పెద్ద సున్నా అనీ మనకు తెలిసినా దేహ దీపంలో వెలుగును పంచే ప్రాణదీపం వెలుగుతున్నంతసేపూ మనం ఒప్పుకోము. కానీ, శ్రీధర్‌బాబు, 'నువ్వు నేను మృత్యువు' అన్న కవితలో ఏం చెప్తున్నారో చూడండి...

> వెలుగులోకి చీకటి జాలు విడిచి నెమ్మదిగా అదు గు పెడుతున్నట్లు
> ప్రాణంలోకి మృత్యువు చొరబడుతున్న క్షణాలలో గుర్తుకువచ్చే బతికిన క్షణాలలో
> వినిపించే రాగాల సమాగాలాలు ఉప్పెత్తున ఎగిసిపడి మీదపడి తడిపేసి
> తడిపేసి తోసేసినప్పుడు నువ్వు నేను

మృత్యువు కలిసే కదా ఆ సంబరంలో కొట్టుకుపోయాం...

మృత్యువుకు తనకూ మధ్య తేడా లేదని, ముగ్గురమూ కలిసే ఆ సంబరంలో కొట్టుకుని పోయాము అన్న వాక్యం రాయడం ద్వారా తను జనన మరణాల మధ్య ఉన్న తాత్విక రేఖను చెరిపేశాడు. జననం సంబరం అయినట్లే, మృత్యువు కూడా సంబరమే, సంతోష సందోహమే అని ఒక విప్లవమైన తాత్వికతను, రణమైనా ప్రయాణమైనా గమ్యం లేని ప్రయాణమే కదా మనం కోరుకున్నాం అని మానవ జీవన ప్రయాణం మొత్తంగా ఒకానొక అగమ్య గమ్యానికి చేసే ప్రయాణం అంటున్నారు. మనిషి పుట్టకముందు ఈ విశ్వం వున్నది మనిషి వెళ్ళిపోయాక ఈ విశ్వం ఉంటుంది. కనుక జనన మరణాల మధ్య మనిషి ప్రయాణం ఒక అశాశ్వతమనే శాశ్వత సత్యం... కవి కనుక శ్రీధర్‌బాబు ఈ సత్యాన్ని చీకట్లో ఇంటికి ప్రయాణం బాగుంటుంది అన్న వాక్యం తో పోల్చారు.

> రేపన్నటో.. అనలు నెపోలా
> పుట్టలేదనే చెబుతారు
> గాంధీ, గాడ్సేలది మిత్ర
> వైరుధ్యమేననీ అంటారు
> కులం లేదనీ
> మతం లేదనీ చెప్పరు
> అజాదివేత మాత్రం
> అబద్ధం అని తేల్చేస్తారు
> మాన్యుఫాక్చరింగ్ ఆఫ్ ది హిస్టరీ ఎలా ఉంటుం దో ఈ కవితలో చెప్తున్న శ్రీధర్ బాబు కొంత శ్లేష్మగా
> సత్యం పాక్షికమే... అది పాక్షిక సత్యమే
> కానీ, అబద్ధం ఒక విధ్వంసం..
> an absolute truth
> వినిర్మించాల్సిందే...
> ప్రతి వా/ క్/ యా/ న్/ నీ/

సత్యం పాక్షికమే అది కూడా పాక్షిక సత్యమే, కానీ అబద్ధం మాత్రం పూర్తిగా నిజం అంటున్నారు. కనుక ప్రతి వాక్యాన్ని వినిర్మించాలంటూ

వా/ క్/ యా/ న్/ నీ/ అని అక్షరాలా వినిర్మించారు. ఈ వినిర్మాణంలో తేలిందేమిటంటే అజాదివేత, అది గాజా కోసమైనా, గంగాజలం కోసమైనా పూర్తిగా నిజం.

***

(ఆత్మీయ మిత్రుడు వనమూరి శ్రీధర్‌బాబు 'మల్లావఝుల సదాశివుడు సాహిత్య పురస్కారం' అందుకున్న సందర్భంగా...)



వంశీకృష్ణ
95734 27422

కథలకు ఆహ్వానం

జాతీయస్థాయిలో గత పద్నాలుగేండ్లుగా తెలుగు చిన్న కథల పోటీలు నిర్వహిస్తూ తెలుగు సాహిత్యరంగంలో విశిష్ట అవార్డులుగా ప్రఖ్యాతిని గాంచుతున్న సోమేపల్లి సాహితీ పురస్కారాలు ఈ ఏడు కూడా ఇవ్వాలని సోమేపల్లి కుటుంబం నిర్ణయించింది. అత్యుత్తమ కథకు రూ.2,500, ఉత్తమ కథకు రూ.1,500, మంచి కథకు రూ.1,000, ప్రత్యేక బహుమతులు ఇద్దరికి రూ.500 ఇవ్వనున్నారు. హామీ పత్రంపై మాత్రమే రచయిత వివరాలు పేర్కొనాలి. కథలను ఆగస్టు 30వ తేదీ లోపు చలపాకారతి, పి.బి.నెం.5, 11-57/1-32, చేతులి కాంప్లెక్స్ రెండవ అంతస్తు, రథశ వీధి, విజయవాడ-520001, సెల్: 9247475975 అనే చిరునామాకు పంపాలి.

- చలపాక ప్రకాశ్, వశిష్ట సోమేపల్లి

'సైనికులు' కథాంశంగా ఈ దీపావళికి వెలువడనున్న 'సంచిక' కథా సంకలనంలో ప్రచురణ కోసం కథలను ఆహ్వానిస్తున్నాం. దేశ భద్రత కోసం, దేశ రక్షణ కోసం తమ ప్రాణాలను పణంగా పెట్టే పోరాట సైనికుల పోరాట పటిమను, కర్తవ్యదీక్షను, త్యాగనిరతిని, దేశభక్తిని విభిన్న కోణాలలో ప్రతిబింబింపజేసే కథలు పంపాలి. మీ కథలను కస్తూరి మురళీకృష్ణ, ఫ్లాట్ నెం. 32, ఇంటి నెం.8-48, రఘురాంనగర్ కాలనీ, ఆదిత్య హాస్పిటల్ వీధి, దమ్మాయిగూడ, హైదరాబాద్-500083 అనే చిరునామాకు గానీ, 98496 17392 అనే నెంబర్‌కు వాట్సాప్ ద్వారా గానీ, sanchikastorycom pilation@ gmail.comకు ఇ-మెయిల్ ద్వారా కానీ పంపాలి. కథలు పంపాల్సిన చివరి తేదీ 2024, అక్టోబర్ 31.

- కస్తూరి మురళీకృష్ణ, కోడీహళ్ళి మురళీమోహన్

ప్రదానోత్సవ సభ

2024, జూలై 21 ఆదివారం రోజున ఉదయం 10.30 గంటలకు హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో 'కార్టూనిస్టు శేఖర్ మెమోరియల్ అవార్డు-2024' ప్రదానోత్సవ సభ జరుగనున్నది. ఈ అవార్డును తెలంగాణ టుడే ఎడిటోరియల్ కార్టూనిస్టు పి.నర్సిం అందుకోనున్నారు. డాక్టర్ ఎస్.రఘు అధ్యక్షత వహించనున్న ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర మీడియా అకాడమీ ఛైర్మన్ కె.శ్రీనివాసరెడ్డి హాజరుకానున్నారు. శేఖర్ స్మారకోపన్యాసం ప్రసేన్ చేయనున్నారు. విశిష్ట అతిథులుగా విమలక్క, వలకాని వెంకట్ యాదవ్, ఆత్మీయ అతిథులుగా శంకర్ సామల్తి, కొరిళ్ళి శ్రీనివాస్, చంద్రకళా శేఖర్‌లు పాల్గొననున్నారు.

- నిర్వహణ: శేఖర్ మిత్రులు, కుటుంబసభ్యులు

2024, జూలై 16 మంగళవారం రోజు ఉదయం 11.00 గంటలకు 'సిటీ కాలేజీ మఖ్దూమ్ మొహియుద్దీన్ నేషనల్ అవార్డు ప్రదానోత్సవ సభ-2024' హైదరాబాద్‌లోని ప్రభుత్వ సిటీ కళాశాల సమావేశ మందిరంలో జరుగనున్నది. సుప్రసిద్ధ కవి, విమర్శకులు డాక్టర్ అమ్మంగి వేణుగోపాల్ ఈ అవార్డును స్వీకరించనున్నారు. సభాధ్యక్షులుగా ఆచార్య పి.బాల భాస్కర్ వ్యవహరించనుండగా, ముఖ్య అతిథిగా డాక్టర్ మునిగంటి మురాళీరెడ్డి హాజరుకానున్నారు. విశిష్ట అతిథిగా డాక్టర్ యాకూబ్, గౌరవ అతిథులుగా వాహెద్, డాక్టర్ రాయారావు సూర్యప్రకాశరావు పాల్గొననుండగా డాక్టర్ ఏలూరి యాదయ్య, డాక్టర్ జి.వెక్కప్రసాదరావు సమన్వయపరుస్తారు.

- డాక్టర్ విప్లవ్ దత్ శుక్లా, డాక్టర్ కోయి కోటేశ్వరరావు

ప్రకటన

'సహృదయ సాహిత్య సాంస్కృతిక సంస్థ-వరంగల్' ఆధ్వర్యంలో కీ.శే.ఒద్దిరాజు సోదర కవుల స్మృత్యర్థంగా ఏటా 'సహృదయ సాహితీ పురస్కారం' అందిస్తున్న విషయం తెలిసిందే. అయితే ఈ ఏడాదికి గాను 'కరిపించని కృతువు' నవల రాసిన మెట్టు మురళీధర్ ఎన్నికైనట్లు అధ్యక్షులు గన్నమరాజు గిరిజామనోహరబాబు, సాహిత్య కార్యదర్శి, మల్లారెడ్డి మురళీరావు, ప్రధాన కార్యదర్శి కుందావజుల కృష్ణమూర్తి తెలిపారు. ఈ పురస్కారాన్ని సహృదయ వార్షికోత్సవంలో అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

> ఆధునిక గణితంలో భావన అనేది ఉండదు. సూత్ర రూపకల్పనలు మాత్రమే ఉంటాయి. ఇలాంటి పద్యాల్లో గణ ధర్మాలు గణితం అయితే మనోభావన లోక రీతులు, వేద పురాణేతిహాసాల కథలు మొదలైనవి. ఇలా జ్ఞానాన్ని పెంచుకుంటూ ఉంటే మానసిక ఆనందం మనోహరంగా ఉంటుంది. జ్ఞానం హింసారహితంగా పది మందికి ఉపయోగపడుతుంది.


గణిత విజ్ఞాన కల్పవృక్షాలు

పద్యంలో పద్యం-2

కొందరు తెలుగు కవులు పద్యంలో పద్యం అంటూ కందగీతగర్భచంపకమాల పద్యాలను కూడా రాశారు. ఈ పద్యాలను చూసి, పద్య మూలాలు ఎరుగని కొందరు ఆధునిక కవులు కవిత్వంలో ఈ సర్కస్ ఫీట్లు ఎందుకండి? అని అంటారు. నిజానికి ఇవి సర్కస్ ఫీట్లు కావు. గణిత విజ్ఞాన కల్పవృక్షాలు. మేధో సామర్థ్యాన్ని వివిధ కోణాల్లో పెంచే విద్యా వినోద ప్రక్రియలు. ఆధునిక గణితంలో ఏ ప్లస్ బీ హోల్ క్యూబ్‌లో ఏ ప్లస్ బీ హోల్ స్క్వేర్ ఉందని చెప్పుంటారు. గణిత పరిజ్ఞానం ఉన్నవారు అలా చెప్పడం పెద్ద విశేషం కాదు. కానీ, ఏ ప్లస్ బీ హోల్ క్యూబ్‌లో దానికి సరిసమానమైన మరో గణిత సూత్రం ఉందని ఇంతవరకు ఎవరూ చెప్పలేదు. మన తెలుగు గర్భ కవిత్వంలో ఆ విషయం ఏనాడో చెప్పారు. అదే కందగర్భ మణిగణ వృత్తం. కందగర్భమణిగణ వృత్తంలో కంద పద్య లక్షణాలు, మణిగణవృత్త పద్య లక్షణాలు రెండూ ఒకే స్థాయిలో సాగుతాయి.

ప్రకారం ఏడు మాత్రలవుతాయి. అదే ఉదా త్తానుదాత్త స్వరాలను అనుసరించి వేద ఛందస్సు ప్రకారం తొమ్మిది మాత్రల వరకు అవుతాయి. అప్పుడు అక్కడి గణిత లెక్కలు మారిపోతాయి. ఈ పద్ధతిన మన ఛందో శాస్త్రం ముందుకువెళ్తే విద్యార్థులు ఇటు ఛందస్సును అటు ఆధునిక గణితంలోని కొన్ని అధ్యాయాలను ఏకకాలంలో నేర్చుకుంటారు. పద్యంలో పద్యం వంటి ప్రక్రియలు విద్యార్థుల గణిత మేధో సామర్థ్యాన్ని, మనోభావ సామర్థ్యాన్ని ఏకకాలంలో సహజీయంగా పెంచుతాయి.

ఛందోశాస్త్ర మూలాలు కనీసం కొన్నైనా నేటి విద్యా ప్రపంచంలో వ్యాపించి ఉంటే నేటి విద్యా ప్రపంచం మరోలా వుండేది. ఇంకా ఆ మూలాలు విద్యా ప్రపంచంలో వ్యాపించకపోవడం వల్ల ఇటు తెలుగు సాహిత్యం హీనదశ లేదా కేవలం పరీక్షలకు పరిమితమవుతుంటే అటు మన ఛందో గణిత మూలాలు మరో రూపంలో విద్యా ప్రపంచంలోకి వస్తున్నాయి. కనుక మనం భావ దారిద్ర్యంతో, జ్ఞాన దారిద్ర్యంతో తలవంచుకోవలసి వస్తుంది. 'కథలు తెలుసుకోవడానికి పద్యాల మీద కుస్తీ పట్టనవసరం లేదు. అయా కథలను వచనంలో ఉన్న పుస్తకాల ద్వారా తెలుసుకో వచ్చు. అప్పై పరీక్షల ముందు ఏదో ఒక గైడ్ లేదా మెటీరియల్ పట్టుకుంటే 'పరీక్షలో పాస్ మార్కుల కంటే ఎక్కువే వస్తాయి'నే భావనకు విద్యార్థులు వచ్చేశారు.




ఆధునిక గణితాది శాస్త్రాల అధ్యయనంలో జ్ఞాపక శక్తికి తప్ప మనోభావాలకు తావు లేకపోవడంతో అలాంటి అధ్యయనం ఎక్కువ శాతం హింసాత్మకత్వాన్ని పెంచుతుంది. మన పద్యంలో పద్యం వంటి అభ్యాసాలు హింసాత్మకత్వాన్ని తగ్గిస్తాయి. మానవత్వాన్ని పెంచుతాయి. నైతిక విలువల మూలాలను ఈ తరం ముందుంచుతాయి.

నిజం చెప్పాలంటే నేటి విద్యార్థులు పాత తరం వారికంటే ఎక్కువగానే విద్యాభ్యాసం చేస్తున్నారు. విజ్ఞాన సముపార్జన చేస్తున్నారు. అందుకే వారి మేధస్సును, కాలాన్ని కరిగిస్తున్నారు. కాకుంటే ఆ అభ్యాసం తెలుగు భాష మీద ఉండటం లేదు. దీనికి కారణం నేటి విద్యార్థులు తెలుగు అంటే చులకనభావంతో ఉన్నారనేదం సమంజసం కాదు. తెలుగు పద్య పునాదిలో ఉన్న గణిత రాయను ఒడిసి పట్టుకుంటే పద్యంలో పద్యం పవర్ ఏమిటో ఈ తరం విద్యా ప్రపంచానికి తెలుస్తుంది.

ఇక వేద ఛందస్సు మంత్రాల్లోని ఉదా త్తాను దాత్తాది స్వరాల లెక్క కూడా చెప్పుంది. ఉదాహరణకు అగ్ని మీళే అనే అక్షరాలు తెలుగు ఛందస్సు

ఇదిలా ఉంటే తెలుగులో గర్భ కవిత్వమే గాక బంధ కవిత్వం కూడా ఉంది. బంధ కవిత్వంలో వీణా బంధ శార్దూలము, రథ బంధ శార్దూలము, పోలకరిక చక్రబంధము వంటి బంధ కవిత్వం ఉంది. మెదక్‌పల్లికి చెందిన శ్రీమాన్ కరణమాల్ కృష్ణమాచార్యులు వారు చిత్రప్రబంధం అనే పేరుతో శతవిధ బంధ కావ్యాన్ని రాశారు. అందులో చిత్రపటాలతో సహా తెలుగు పద్యాలుంటాయి.

వీటివల్ల విద్యార్థుల మేధోస్థాయి మరింత వికసిస్తుంది. భారతీయ కళారూపాల దృశ్యాలు వాటి గణ ధర్మాలు విద్యార్థులకు తెలుస్తాయి. వేద ఛందస్సును అటుంచి, కనీసం తెలుగు పద్య మూలాల్లోకి వెళ్తే ఆధునిక విద్యా ప్రపంచాన్ని తోసిరాజు అనగల జ్ఞానం, శక్తి, అర్హత, అవసరం మన తెలుగు పద్యంలో పద్యానికి ఉంది.



వాగుమూడి లక్ష్మీ రాఘవరావు
98494 48947



'మనం లోంచి నేను... మనది లోంచి నాది'

పునాదుల్ని వెక్కిరిస్తూ
పెళ పెళమంటూ
వంతెనలు కూలిపోతాయి
స్నేహ నది చీకటిపోతుంది
ఆత్మీయ ఆకాశం బావురుమంటుంది

రెండు తీరాల నడుమ
గాలి స్తంభించిపోతుంది
ఓయ్ అంటే ఓయ్ అనే
ధ్వని ప్రతిధ్వనులు మూగబోతాయి

బాల్యం నుంచి పిట్టగోడల్లో మొలిచి బిగుతుండిన
పచ్చదనం మాడిపోయి
జనన ప్రవాహాలు నిలబడతాయి

ఊపిరాడ్డం మొదలయినప్పటినుండి
ఊహలు ఊపిరి పోసుకున్నప్పటి నుండి
మొలకెత్తి విస్తరించిన బంధాలు
పరిమళాల్ని పోగొట్టుకుంటాయి

మనంతం వలసపోతుంది
బతుకు లెక్క మారిపోతుంది
జమా ఖర్చులే
బ్రహ్మామీముక్తలా ముందుకొస్తాయి

సమ్మకాలు నడిబజార్లో
అమ్మకానికొస్తాయి

ఇదంతా యధాలాపంగానో
అన్యాపదేశంగానో జరగదు

మనం లోంచి 'నేను'
మనది లోంచి 'నాది'
తలెగరేసిన క్షణమే 'ఖాళీలకు'
బీజం పడుతుంది

ముచ్చటకు ముచ్చెమటలు పడతాయి
సంభాషణలకు సమాధులు వెలుస్తాయి
దూరాలు ఉత్తర దక్షిణ ధ్రువాలవుతాయి
సంతోషాలు ఆగమయి ఎడారిలో కలుస్తాయి



వారాల ఆనంద్
94405 01281





బీఆర్‌టీయూ సమావేశంలో ఆదివారం మాట్లాడుతున్న ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మారయ్య, బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి రూప్‌సింగ్, కార్మిక విభాగం అధ్యక్షుడు రాంబాబు, ఆటో యూనియన్ నాయకులు

ఆటోడ్రైవర్ల ఆత్మహత్యలకు బాధ్యుడు రేవంతే

> మొదటిపేజీ తరువాయి...

పాల్గొన్నారని ఆవేదన వ్యక్తంచేశారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఆటోడ్రైవర్లు ఎదుర్కొంటున్న సమస్యలు, దీన పరిస్థితులపై చర్చించేందుకు ఆదివారం తెలంగాణభవన్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మారయ్య మాట్లాడుతూ.. కాంగ్రెస్ పాలనలో ఆటోడ్రైవర్ల బతుకు అగమ్యగోచరంగా మారిందని ఆవేదన వ్యక్తంచేశారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కారణంగా ఆటోడ్రైవర్ల ఉపాధి దెబ్బతిని 58 మంది ఆత్మహత్య చేసుకున్నా ప్రభుత్వం ఆదుకోవటం లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఆటోడ్రైవర్లకు ఏటా రూ.12 వేలు ఇస్తామని, సంక్షేమ బోర్డు ఏర్పాటుచేస్తామని రేవంత్‌రెడ్డి, ఉత్తమ్‌ మల్లన్న పదే పదే చెప్పారని గుర్తుచేశారు. ఆటోడ్రైవర్ల చావులకు రేవంత్‌రెడ్డి, ఉత్తమ్‌ మల్లన్న బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ఈ రెండు అంశాలపై చర్చించాలని, లేనిపక్షంలో అసెంబ్లీని ముట్టడిస్తామని హెచ్చరించారు.

అక్రమ ఫైనాన్సర్ల ఆగడాలను అరికట్టాలి

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో 2 లక్షల మంది ఆటో డ్రైవర్లు ఉన్నారని, వీరిలో 90 శాతం ఆటోలు ఫైనాన్స్ మీదే నడుస్తున్నాయని మారయ్య తెలిపారు. అధిక వడ్డీతో ఆటోడ్రైవర్ల శ్రమను దోచుకుంటున్న అక్రమ ఫైనాన్సర్లపై నిఘా పెట్టి వారిని చట్టపరిధిలోకి తీసుకొచ్చి, వారి ఆగడాలను అరికట్టాలని డిమాండ్ చేశారు. షాపింగ్‌మాల్స్ వద్ద ఆటోస్టాండ్లు ఉండాలని, అవి లేకపోవటంతో అక్కడ నిలిపిన ఆటోడ్రైవర్లకు పోలీసులు చలాన్లు రాస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. గ్రేటర్‌లో ఆటోమీటర్ సిస్టం పెట్టాలని, మీటర్ రేట్లు కూడా పెంచాలని డిమాండ్ చేశారు. మోటర్ రంగంపై సీఎం ఇంతవరకు ఎందుకు సమీక్ష నిర్వహించలేదని ప్రశ్నించారు. సమావేశంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి రూప్‌సింగ్, బీటీటీయూ నాయకులు పాండునాయక్, రవీందర్, రామకృష్ణ, పాతం రమేశ్, నిరంజన్, హైదర్, పరశురాముడు తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల రికవరీలపై వెనకడుగు!

> మొదటిపేజీ తరువాయి...

లబ్ధిపొందుతున్న అంశంపై ప్రభుత్వం తదుపరి ఉత్తర్వులు ఇచ్చేవరకు ఏమాత్రం రికవరీ చర్యలు చేపట్టరాదని స్పష్టంచేశారు. వివిధ సంక్షేమ పథకాల్లో అనర్హులు లబ్ధిపొందుతున్నట్టు ప్రభుత్వం దృష్టికి వచ్చిందని పేర్కొన్నారు. అర్హులైన లబ్ధిదారులకు మరింత మెరుగైన పద్ధతుల్లో సంక్షేమ ఫలాలను అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టినట్టు తెలిపారు. సంక్షేమ పథకాలలోని వివిధ సమస్యలు, వాటి పరిష్కారాలపై వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో చర్చించనున్నట్టు వెల్లడించారు. నిజమైన లబ్ధిదారులకు సంక్షేమ ఫలాలు అందించడంతోపాటు అనర్హులు పొందిన ప్రయోజనాలను రికవరీ చేసే విషయమై ప్రభుత్వం త్వరలో స్పష్టమైన మార్గదర్శకాలను జారీ చేస్తుందని పేర్కొన్నారు. వృద్ధులకు అండగా ఉండేందుకు గత కేసీఆర్ ప్రభుత్వం అత్యంత మానవీయ కోణంలో ఆసరా పథకాన్ని అమలు చేయగా, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అనర్హుల పేరుతో అప్పుడిచ్చిన పెన్షన్ మొత్తాలను రికవరీ చేసేందుకు సిద్ధపడటం వివాదాస్పదమైంది. పెన్షన్లను రూ.2,000 నుంచి రూ.4,000కు పెంచుతామని ఎన్నికల ప్రచారంలో చెప్పిన కాంగ్రెస్ పార్టీ, ఇప్పుడు ఉన్న పింఛన్లనే ఊడబీకే పని పెట్టుకున్నది. రాష్ట్రవ్యాప్తంగా 1,826 మంది అనర్హులు ఉన్నారంటూ ఒక జాబితాను రూపొందించిన సర్కారు, వారినుంచి పెన్షన్లను రికవరీ చేయాలని అధికారులను ఆదేశించింది. ఈ క్రమంలోనే భద్రాద్రి కొత్తగూడెంలోని బాబాక్కాం ప్రాంతానికి చెందిన దాసరి మల్లమ్మకు సంబంధించిన నోటీసులు సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో ప్రభుత్వంపై పెద్ద ఎత్తున విమర్శలొచ్చాయి. వృద్ధాప్యంతోపాటు పక్షవాతంతో మంచానికే పరిమితమైన మల్లమ్మకు రికవరీ నోటీసులు జారీచేయడంతో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. దీంతో అధికార యంత్రాంగం హుటాహుటిన మల్లమ్మ ఇంటికి చేరుకొని ఆమె ఆరోగ్య, కుటుంబ పరిస్థితులను ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. ఉద్యోగం చేస్తున్న కూతురు మరణించడంతో మల్లమ్మకు ఫ్యామిలీ పెన్షన్ వస్తున్న విషయాన్ని అధికారులు గుర్తించారు. ఆమె పోషణ, వైద్య ఖర్చులకే భారీగా ఖర్చవుతుండటంతో ఆమె నుంచి రికవరీ చేయడం సాధ్యంకాదని అధికారులు గుర్తించారు. వృద్ధులకు ఆసరాగా ఉన్న పెన్షన్లను రికవరీ చేయాలని గ్రామాల్లో పలువురు వ్యక్తం చేస్తున్న నిరసనలను, అనారోగ్య సమస్యలుంటాయి. వారిని సరిగా చూసుకునేవారు ఉండరు. పెన్షన్ డబ్బులతోనే వారి జీవితాలు గడుస్తాయి. ఇప్పటికే గత కేసీఆర్ సర్కారు ఆసరా పెన్షన్ జారీలో కొంత ఉదారంగా వ్యవహరించింది. కాగా, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం వారి ఆరోగ్య, కుటుంబ పరిస్థితులు పట్టించుకోకుండా రికవరీ నోటీసులు జారీచేయడం వివాదాస్పదమైంది. ప్రజల నుంచి విమర్శలు వెల్లువెత్తడంతో ప్రభుత్వం పునరాలోచనలో పడింది.

గెజిటెడ్ ఎంఈవో పదోన్నతులివ్వండి: యూటీఎఫ్

హైదరాబాద్, జూలై 14 (నమస్తే తెలంగాణ): నాన్ గెజిటెడ్ టీచర్ పోస్టులపై మాత్రమే కోర్టు స్టే ఉందని, గెజిటెడ్ పర్యవేక్షణాధికారుల ఖాళీల్లో క్యాడర్ స్ట్రెంత్ ప్రకారం టీచర్లకు పదోన్నతులివ్వాలని టీఎస్ యూటీఎఫ్ ప్రభుత్వాన్ని కోరింది. స్థానిక సంస్థల టీచర్లకు ఎంఈవోలుగా, ఉన్నత పాఠశాల విద్యాశాఖ నియంత్రణలోకి వచ్చారని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కే జంగయ్య, ప్రధాన కార్యదర్శి చావ రవి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నాన్ గెజిటెడ్ టీచర్ పోస్టులు ఏకీకృత జిల్లా క్యాడర్‌గా రాష్ట్రపతి ఉత్తర్వుల్లో పేర్కొన్న అంశంపై మాత్రమే హైకోర్టు స్టే కొనసాగుతున్నదని గుర్తుచేశారు. రెండు దశాబ్దాలుగా పర్యవేక్షణ పోస్టుల భర్తీలేక సంక్షోభం నెలకొన్నదని, ప్రభుత్వం చొరవ తీసుకుని, వెంటనే ఉప విద్యాధికారులు, ఎంఈవో, డైట్, బీఈడీ కళాశాల అధ్యాపక పోస్టులను పదోన్నతుల ద్వారా భర్తీచేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

డౌన్‌మెరిట్ లేనట్టే.. మళ్లీ బ్యాక్‌లాగ్

- గురుకుల పోస్టుల్లో డౌన్‌మెరిట్ కల్పిస్తామని ఆశలు.. ఇప్పుడు నోటిఫికేషన్ ప్రకారమేనని ప్రకటన
- స్వయంగా వెల్లడించిన సీఎం రేవంత్‌రెడ్డి
- గురుకుల అభ్యర్థుల్లో ఆందోళన

హైదరాబాద్, జూలై14 (నమస్తే తెలంగాణ): గురుకుల పోస్టుల్లో బ్యాక్‌లాగ్ లేకుండా చూస్తామని, మెరిటింగ్ జాబితా అమలును పరిశీలిస్తామని నమ్మబలికిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు దాటవేస్తోంది. నోటిఫికేషన్ ప్రకారమే పోస్టులు భర్తీ చేస్తామంటూ సీఎం రేవంత్‌రెడ్డి తాజాగా చేసిన ప్రకటనే అందుకు నిదర్శనం. దీంతో గురుకుల అభ్యర్థులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.

చాలా పోస్టులు భర్తీకాని పరిస్థితి..

రాష్ట్రవ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, బీసీ గురుకులాల్లో 9,210 పోస్టుల భర్తీ ప్రక్రియను తెలంగాణ రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూట్ రిక్రూట్‌మెంట్ బోర్డు (ట్రిబ్)కు అప్పగించిన విషయం తెలిసిందే. డీఎల్, జేఎల్, పీజీటీ, టీజీటీకి కామన్ పేపర్లను పెట్టడం, డిసెండింగ్ ఆర్డర్ పాటించకపోవడంతో చాలా పోస్టులు భర్తీకాని దుస్థితి నెలకొన్నది. ఇదే విషయమై అభ్యర్థులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఫలితాలను వెల్లడించి అపాయింట్‌మెంట్ ఆర్డర్లు ఇచ్చినప్పటి నుంచి ప్రభుత్వానికి విజ్ఞప్తులు చేస్తూనే ఉన్నారు. పోస్టులు బ్యాక్‌లాగ్ కాకుండా ఉండేందుకు డౌన్‌మెరిట్ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ధర్నాలకు దిగారు. నోటిఫికేషన్ ప్రకారమే పోస్టులను భర్తీ చేస్తామని సీఎం ప్రకటించడంతో అభ్యర్థుల ఆశలన్నీ గల్లంతయ్యాయి. గురుకుల పోస్టుల భర్తీకి సంబంధించి ట్రిబ్ జారీచేసిన నోటిఫికేషన్‌లోని పేరా 5(1)లో జీవో 81 ప్రకారం మెరిటింగ్ లిస్టు విధానం లేదు. భర్తీ కాని, అభ్యర్థులు జాయినింగ్ కాని ఖాళీలను క్యారీ ఫార్వర్డ్ చేసి రాబోయే నోటిఫికేషన్ ద్వారా నింపాల్సి ఉంటుంది.

2016లో డౌన్‌మెరిట్ కల్పించిన బీఆర్‌ఎస్ సర్కార్

గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం జీవో 81ను పక్కనపెట్టి 2016లో వన్ టైం రిలాక్సేషన్ కింద డౌన్‌మెరిట్ అమలుచేసి పోస్టులను భర్తీ చేసింది. ప్రస్తుత పోస్టుల్లోనూ బ్యాక్‌లాగ్ లేకుండా డౌన్‌మెరిట్ కల్పించే అవకాశమున్నా కాంగ్రెస్ ప్రభుత్వం సానుకూలంగా స్పందించకపోవడంపై అభ్యర్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

జేఎల్‌తో మరిన్ని ఖాళీలు..

డీఎల్, జేఎల్, పీజీటీ పోస్టులకు సమాన అర్హత ఉన్నాయి. చాలా మంది పీజీటీతోపాటు జేఎల్, డీఎల్‌కూ హాజరయ్యారు. వారిలో చాలా మంది ఒకటికి మించి పోస్టులకు ఎంపికయ్యారు. దీంతో ఉన్నతస్థాయి పోస్టును ఎంచుకుని మిగిలిన పోస్టులను వదులుకున్నట్టు తెలుస్తున్నది. పీజీటీ పోస్టుల్లోనే 70 శాతం మిగిలిపోనున్నట్టు సమాచారం. గురుకులాల్లోని పోస్టులకు పరీక్ష రాసిన అభ్యర్థుల్లో అందరూ జేఎల్ పోస్టులకు సైతం హాజరయ్యారు. గురుకులాల్లో పోస్టులు సాధించిన అభ్యర్థులే ఇందులోనూ ఎంపికైనట్టు తెలుస్తున్నది. జేఎల్ పోస్టులకే మొగ్గుచూపే అవకాశముంది. ఈ నేపథ్యంలో గురుకుల పోస్టుల్లో మరిన్ని ఖాళీలు మిగిలే అవకాశముంది.

మరో నోటిఫికేషన్‌కు మొగ్గు..

డౌన్‌మెరిట్ అమలుచేసి పోస్టులు బ్యాక్‌లాగ్ కాకుండా చూసే అవకాశమున్నా కాంగ్రెస్ సర్కార్ ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదు. ప్రస్తుత నోటిఫికేషన్‌లో మిగిలిన పోస్టులన్నీ క్యారీ ఫార్వార్డ్ చేయాలని చూస్తున్నది. ఆ పోస్టులతోపాటు ఇప్పటికే స్పష్టమైన ఖాళీలు, వేరువేరుగా గతంలోనే మంజూరైన పోస్టులన్నింటినీ కలిపి మరో నోటిఫికేషన్ ఇచ్చి తమ ఖాతాలో వేసుకోవాలని యోచిస్తున్నది.

విద్యుత్తు కమిషన్‌పై సుప్రీంకు కేసీఆర్

- విచారణ చేపట్టనున్న ప్రధాన న్యాయమూర్తి ధర్మాసనం

హైదరాబాద్, జూలై 14 (నమస్తే తెలంగాణ): విద్యుత్తు కమిషన్ అంశంపై బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. విద్యుత్తు కొనుగోళ్లు, యాదాద్రి, భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్ల నిర్మాణంపై సమీక్షకు నియమించిన జస్టిస్ నరసింహారెడ్డి కమిషన్‌పై హైకోర్టు ఇచ్చిన తీర్పును ఆయన దేశ అత్యున్నత న్యాయస్థానంలో సవాల్ చేశారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం మార్చి 14న జారీచేసిన జీవో 9ని సవాలు చేస్తూ కేసీఆర్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయటం, హైకోర్టు దాన్ని కొట్టివేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో కేసీఆర్ సుప్రీంకోర్టుకు వెళ్లారు. సోమవారం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ధర్మాసనం ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టనున్నది.



ఎస్‌సెట్ వెబ్ ఆప్షన్లకు నేడే ఆఖరు

హైదరాబాద్, జూలై 14 (నమస్తే తెలంగాణ): ఇంజినీరింగ్ కోర్సుల్లో ప్రవేశాలు కల్పించే ఎప్‌సెట్ వెబ్ ఆప్షన్ల గడువు సోమవారంతో ముగియనుంది. కౌన్సెలింగ్‌కు హాజరైన వారు సోమవారం వరకు వెబ్‌ఆప్షన్లు ఎంచుకోవచ్చు. ఇప్పటివరకు 99,170 మంది అభ్యర్థులు వెబ్ కౌన్సెలింగ్‌కు హాజరుకాగా, 90వేలకు పైగా అభ్యర్థులు వెబ్ ఆప్షన్లు నమోదుచేసుకున్నారు. 19లోపు సీట్లను కేటాయిస్తారు. 173 ఇంజినీరింగ్ కాలేజీల్లో 98,296 సీట్లున్నాయి. కన్వీనర్ కోటాలో 70,307, మేనేజ్‌మెంట్ కోటాలో మరో 27,989 సీట్లున్నాయి. కన్వీనర్ కోటాలోని మొత్తం సీట్లలో 41,968 సీట్లు (59.69శాతం) సీఎస్‌ఈ, సీఎస్‌ఈ అనుబంధ బ్రాంచీల్లోనే ఉన్నాయి.



జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని టీబీజీకేఎస్ కార్యాలయంలో మాట్లాడుతున్న టీబీజీకేఎస్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు సమ్మయ్య

ఎల్లో, రెడ్ కార్డుల విధానాన్ని నిలిపేయాలి

- టీబీజీకేఎస్ ఉపాధ్యక్షుడు సమ్మయ్య

భూపాలపల్లి రూరల్, జూలై 14: సింగరేణి యాజమాన్యం ఎల్లో, రెడ్ కార్డుల విధానాన్ని వెంటనే నిలిపివేయాలని భూపాలపల్లి టీబీజీకేఎస్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు బడితల సమ్మయ్య డిమాండ్ చేశారు. ఆదివారం జయశంకర్‌భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని టీబీజీకేఎస్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రక్షణ చర్యల్లో భాగంగా సింగరేణి యాజమాన్యం ఎల్లో, రెడ్ కార్డుల విధానాన్ని అమలు చేసే పనిలో ఉందని తెలిపారు. ఈ విధానం వల్ల పని ప్రదేశాల్లో ఉద్యోగులు పొరపాటు చేస్తే స్థానికంగా ఉండే అధికారులు మొదట ఎల్లో కార్డు జారీ చేస్తారని, తర్వాత కార్మికుడికి రెడ్ ఆఫ్ నుంచి తప్పు చేసిన కార్మికుడికి నేరుగా ఎల్లో కార్డు జారీ చేస్తున్నారని తెలిపారు. ఎన్నిసార్లు కార్మికుడికి 3 కార్డులు ఎల్లో కార్డు వస్తే ఆతడికి వెంటనే రెడ్ కార్డు జారీ చేస్తారని, రెడ్ కార్డు అందుకున్న కార్మికుడిపై యాజమాన్యం చార్జిషీట్‌తోపాటు సస్పెన్షన్, ఇంక్రిమెంట్ కట్, డిస్మిస్ ఇలా ఏదైనా క్రమశిక్షణ చర్యలు తీసుకోవచ్చని చెప్పారు. కార్మికుడికి రెడ్ కార్డు ఇచ్చి ఉద్యోగం నుంచి తొలగిస్తే అతడి కుటుంబం పరిస్థితి ఏంటనేది యాజమాన్యం ఆలోచించాలని సూచించారు. ఇప్పటికే కొందరు కార్మికులకు ఎల్లో కార్డులు జారీ అయినట్టు సందేశాలు వచ్చాయని తెలిపారు. ఈ విషయం టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిరియాల రాజిరెడ్డి దృష్టికి వచ్చిన వెంటనే సీఎండీ, సంబంధిత అధికారులతో చర్చించడం జరిగిందని, ఈ నిర్ణయాన్ని వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు గోరికపుత్య్య, నరేశ్, మధు, రాంచందర్, రాజేందర్, సురేశ్, రవి పాల్గొన్నారు.

ముందుకు సాగని బదిలీలు!

- విద్యాశాఖలో ఇంకా విడుదల కాని మార్గదర్శకాలు
- గడువు పొడిగింపు కోరే యోచనలో అధికారులు

హైదరాబాద్, జూలై 14 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని వివిధ శాఖల్లో ఉద్యోగుల సాధారణ బదిలీల ప్రక్రియ ముందుకు సాగడం లేదు. ఆయా శాఖల్లో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉంది. ముఖ్యంగా సీఎం రేవంత్‌రెడ్డి వద్దే ఉన్న విద్యాశాఖలో బదిలీలకు సంబంధించిన ఐదులు మార్గదర్శకాలే ఇంకా జారీ కాలేదు. ఇంటర్మీడియట్, సాంకేతిక, కళాశాల విద్యాశాఖల్లో లెక్చరర్లు, ఉద్యోగుల బదిలీల ప్రక్రియ ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. దీంతో ఈ నెల 20లోపు బదిలీలు పూర్తయ్యే అవకాశం కనిపించడం లేదు. రాష్ట్రంలో ఉద్యోగులకు సాధారణ బదిలీలపై నిషేధాన్ని ఎత్తివేస్తూ ఈ నెల 3న సర్కారు జీవో జారీ చేసిన విషయం తెలిసిందే. 16 రోజుల్లో ప్రక్రియ పూర్తయ్యేలా ప్రభుత్వం షెడ్యూల్‌ను విడుదల చేసింది. ప్రభుత్వం పూర్తిస్థాయిలో ఈ నెల 19, 20 తేదీల్లో బదిలీల ఉత్తర్వులు విడుదల కావాల్సి ఉంది. కానీ, ఇప్పటివరకు విద్యాశాఖలోని పలు హెచ్‌వోడీల్లో మార్గదర్శకాలే విడుదల కాలేదు. దీంతో బదిలీలు సకాలంలో జరుగుతాయా? లేదా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికిప్పుడు మార్గదర్శకాలు విడుదలైతే ప్రక్రియ పూర్తయ్యేందుకు 10 రోజులు పడుతుంది. ఈ నేపథ్యంలో మరో 5 రోజులు గడువు పొడిగించాలని కోరనున్నట్టు తెలిసింది.

	గరిష్ఠం	కనిష్ఠం
ఆదిలాబాద్	34.1°c	21.1°c
రంగారెడ్డి	32.6°c	21.9°c
మెదక్	32.3°c	23.3°c
ఖమ్మం	32.0°c	27.0°c
నిజామాబాద్	31.3°c	24.9°c
కరీంనగర్	29.0°c	25.0°c
వరంగల్	29.0°c	24.0°c
నల్లగొండ	29.0°c	21.0°c
మహబూబ్‌నగర్	27.7°c	24.1°c
హైదరాబాద్	29.1°c	24.1°c

మేడిగడ్డకు 41,200 క్యూసెక్కుల వరద

మహదేవపూర్, జూలై 14 : జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని మేడిగడ్డ (లక్ష్మి) బ్యారేజీకి వరద ప్రవాహం కొనసాగుతున్నది. 16.17 టీఎంసీల నీటినిల్వ సామర్థ్యం కలిగిన బ్యారేజీకి ఆదివారం ఇన్‌ఫ్లో 41,200 క్యూసెక్కులు కాగా, 8 బ్లాక్‌లోని 85 గేట్లు ఎత్తి అంతే మొత్తంలో ప్రవాహాన్ని దిగువకు విడుదల చేస్తున్నారు. బ్యారేజ్ రివర్ బెడ్ లెవల్ సముద్ర మట్టానికి 88 మీటర్లు కాగా, ప్రస్తుతం 89.50 మీటర్ల ఎత్తులో వరద ప్రవహిస్తున్నది. వరద ప్రవాహం మరింత పెరిగే అవకాశం ఉన్నదని అధికారులు చెబుతున్నారు.

నేటినుంచి బదిలీలు, ప్రమోషన్లు

హైదరాబాద్, జూలై 14 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వ ఎస్సీ గురుకులాల్లో బదిలీలు, ప్రమోషన్లు, నూతన నియామక ఉత్తర్వులు జారీ అయ్యాయి. క్యాడర్లవారీగా బదిలీల షెడ్యూళ్లు విడుదలచేస్తూ అధికారులు ఉత్తర్వులు ఇవ్వడంపై గురుకుల జేఏసీ అధ్యక్షుడు మామిడి నారాయణ, ప్రధాన కార్యదర్శి మధుసూదన్, నాయకులు ఆదివారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి, ఎస్సీ గురుకుల సంస్థ సెక్రటరీ, ఎస్సీడీడీ ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీధర్, గురుకుల సంస్థ కార్యదర్శి అలగు వర్షిణి, హెడ్ ఆఫీస్ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.



బీరు సీసాల్లో ఉన్న పురుగులు, చెక్కాపెడారం

బీరు సీసాల్లో పురుగులు

కోనరావుపేట, జూలై 14: బీరు సీసాల్లో పురుగులు, చెత్తాచెదారం రావడంతో మద్యం ప్రియులు అవాక్కయ్యారు. ఈ ఘటన ఆదివారం రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం నిజామాబాద్ గ్రామ శివారులో ఉన్న శ్రీ లక్ష్మీనరసింహ వైన్స్‌లో వెలుగుచూసింది. మండల కేంద్రానికి చెందిన ఇద్దరు యువకులు ఆదివారం శ్రీ లక్ష్మీనరసింహ వైన్స్‌లో నాలుగు బీర్లు కొనుగోలు చేశారు. వాటిలో రెండు బీరు సీసాల్లో పురుగులు, చెత్తాచెదారం కనిపించడంతో ఆశ్చర్యానికి గురయ్యారు. నాణ్యత లేని బీర్లు సరఫరా చేస్తున్న వారిపై ఎక్సైజ్ అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



కరీంనగర్‌లో మాట్లాడుతున్న బండి సంజయ్

ఫీజు రీయింబర్స్‌మెంట్ బ్యాంక్ లోనా?

- వచ్చేటం సెటిల్‌మెంట్ ఎట్లా చేస్తరు?
- పార్టీ మారే ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించే దమ్ము ఉందా?: బండి సవాల్

విద్యానగర్, జూలై 14: 'ఫీజురీయింబర్స్‌మెంట్‌పై వన్‌టైం సెటిల్‌మెంట్ ఏంది? ఇదేమైనా బ్యాంకు అనుకుంటున్నారా? లోన్లు తీసుకుని వడ్డీలు కట్టలేక సెటిల్‌మెంట్ చేసుకోవడానికి' అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ మండిపడ్డారు. ఎంతటి దరఖాస్తులు చేసినా ఫీజులు కట్టకపోవడంతో కాలేజీ యాజమాన్యాలు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, ఇప్పటికైనా పూర్తిస్థాయిలో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలని సూచించారు. ఆదివారం ఆయన కరీంనగర్‌లో మీడియాతో మాట్లాడారు. 'అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌లోకి చేరుతున్నారని మాట్లాడుతున్న ఏది కారు పార్టీ నేతలా? నిజంగా మీరు అభివృద్ధి చేసినట్టు అయితే మీ పార్టీలో చేరిన ఎమ్మెల్యేలందరితో రాజీనామా చేయించి ఉప ఎన్నికల్లో ప్రజా తీర్పు కోరే దమ్ముందా?' అని సవాల్ విసిరారు. ఎమ్మెల్యేలు తమ ఆక్రమాస్తులను కాపాడుకోవడానికి అధికార పార్టీలోకి వెళ్తున్నారని మండిపడ్డారు. నియోజకవర్గ అభివృద్ధి కోసమే కాంగ్రెస్‌లో చేరుతున్నామని వచ్చించడం సిగ్గుచేటన్నారు. దొంగ హామీల నుంచి ప్రజల దృష్టి మళ్లించడానికి కాంగ్రెస్‌నేతలు ఇలాంటి నాటకాలు ఆడుతున్నారని మండిపడ్డారు. కొందరికేమో అధికారం ఎక్కడుంటే ఆ పార్టీలోకి జంప్ అవుతున్నారని విమర్శించారు. బీజేపీలో చేరేందుకు చాలామంది ఆసక్తి చూపుతున్నారు. రాజీనామా చేసి రావాలని చెబుతున్నామని, బీజేపీ తమ విధానమని స్పష్టంచేశారు. కాంగ్రెస్ మోసాలు, దొంగ హామీలను ప్రజలుగుర్తిస్తున్నారని... ఆకోనీనగర్‌లో నిర్మిస్తోన్న తెప్పించి ఇందులో ఇందుకు నిదర్శనమని అన్నారు.

ఉచిత విద్యుత్ కట్ చేస్తున్నరు

- బకాయిలు విడుదల చేసి ఆదుకోండి
- నాయీబ్రాహ్మణ సేవా సంఘం డిమాండ్

హైదరాబాద్, జూలై 14 (నమస్తే తెలంగాణ): రజక, నాయీ బ్రాహ్మణులకు అమలు చేస్తున్న 250 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకానికి సంబంధించి బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని నాయీబ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాచమల్ల బాలకృష్ణ డిమాండ్ చేశారు. ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించిన సంఘ సమావేశంలో బాలకృష్ణ మాట్లాడారు. ఉచిత విద్యుత్‌కు సంబంధించి రూ.100 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని సత్వరమే విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం నిధులను విడుదల చేయకపోవడంతో బిల్లులు కట్టాలని నాయీబ్రాహ్మణులను, రజకులను విద్యుత్ అధికారులు వేధిస్తూ, కరెంట్ కట్ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నాయీబ్రాహ్మణ ఫెడరేషన్‌కు కార్పొరేషన్‌గా మార్చి పాలక మండలిని నియమించాలని, బడ్జెట్‌లో రూ.250 కోట్లు కేటాయించాలని, రూ.5లక్షల జీవిత బీమా కల్పించాలని కోరారు. సమావేశంలో సంఘ నేతలు మాదర్ల రవి, గోలుకొండ అశోక్, చందు శ్రీనివాస్, సింగోజు వెంకటస్వామి, శ్రీరాములు నరేశ్, ఫణి పాల స్వామి, జంపాల శ్రీనివాస్, కొత్వాల రవి, రాజు, శ్రీరాములు, భూషణం పాల్గొన్నారు.



హైదరాబాద్‌లో నిర్వహించిన సంఘ సమావేశంలో మాట్లాడుతున్న బాలకృష్ణ

ప్రీలాంచ్ మోసం 100 కోట్లు!

> మొదటిపేజీ తరువాయి...

గ్రామంలోని సర్వే నంబర్ 9, 10, 11, 15, 16లలో కొత్త ప్రాజెక్టుకు అంకురార్పణ చేస్తున్నదని, 2021 మార్చి నుంచి మొదలు పెడితే 42 నెలల్లోనే పూర్తి చేస్తుందంటూ నమ్మించారు. వాళ్ల మాటలు నమ్మి శోభాషరణ్ అందులో ప్లాట్ కొనేందుకు 30 శాతం అడ్వాన్స్‌గా రూ. 24.29 లక్షలు ఇచ్చినట్టు తెలిపారు. బ్లాక్ 1లో ఫ్లాట్ నంబర్ 2304 రెండు కార్ పార్కింగ్‌లతో 2075 ఎస్ఎఫ్‌టీకి ఎంవోయూ రాసుకున్నారు. 18 నెలల తరువాత ప్రాజెక్టుపై నమ్మకం లేక్కపోగా, ఒప్పందాన్ని రద్దు చేసుకోవడాని, అందుకు చెల్లించిన మొత్తానికి దీనికి 8 శాతం వడ్డీతో తిరిగి ఇచ్చేస్తామంటూ ఒప్పందం చేసుకున్నారు. ఇదేవిధంగా ప్రాజెక్టు పరిస్థితి గురించి ఆరా తీసి, ఆ స్థలాన్ని శోభాషరణ్ సందర్శించారు. బహుళ అంతస్తుల భవనాలు నిర్మిస్తామంటూ హామీ ఇచ్చిన స్థలానికి గేట్ వేసి ఉండడం, ఆ స్థలం రాహుల్ రస్తోగిది అంటూ అక్కడున్నవారు చెప్పారు. దీంతో కంగుతిన్న శోభాషరణ్ సంస్థ నిర్వాహకులను శ్రీనివాస్ మేక గురించి ఆరా తీశారు. భూ యజమానికి ఎలాంటి డెవలప్‌మెంట్ అగ్రిమెంట్ లేకపోవడం, ఇప్పటివరకు హెచ్‌ఎండీఏ అనుమతులకు దరఖాస్తు చేయకపోవడంతో ఇదంతా మోసమని గుర్తించారు. వెంటనే సీసీఎస్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. తమ నుంచి రూ. 1.39 కోట్లు వసూలు చేసి మోసం చేశారంటూ సంస్థపై పలువురు బాధితులు సీసీఎస్‌లో ఫిర్యాదు చేశారు. బాధితులు వందల సంఖ్యలో ఉన్నట్టు పేర్కొన్నారు. ఆదిత్య సాహితీ ఇన్‌ఫ్రా, భువనతేజ, జేవీఆర్ ఇన్‌ఫ్రా సంస్థల మోసం మరువకముందే, తాజాగా మరో సంస్థ అందులో చేరింది.



- ఎస్సై కుటుంబానికి 25 లక్షల ఆర్థికసాయం

దివంగత ఎస్సై శ్రీరాముల శ్రీనివాస్ కుటుంబానికి సివిల్ టీఎస్, ఏపీ ఎస్సైస్ వెల్ఫేర్ సొసైటీ చేయూతనిచ్చింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేటలో ఎస్సైగా పనిచేస్తున్న శ్రీనివాస్ ఇటీవల ఆత్మహత్యచేసుకున్నాడు. ఈ నెల 7న మృతి చెందిన విషయం విదితమే. ఎస్సైల బృందం ఆదివారం వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం నారక్కపేటకు చేరుకొని శ్రీనివాస్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు ఎస్సై శ్రీధర్ ఆధ్వర్యంలో శ్రీనివాస్ భార్య కృష్ణవేణికి రూ.25 లక్షల ఆర్థికసాయం అందజేశారు. - నల్లబెల్లి

పలు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్

- ఐదు రోజుల పాటు భారీ వర్షాలు: వాతావరణశాఖ

హైదరాబాద్, జూలై 14 (నమస్తే తెలంగాణ): తెలంగాణలో వచ్చే ఐదురోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో పలు జిల్లాలకు హైదరాబాద్ వాతావరణ కేంద్రం ఆరెంజ్ అలర్ట్ ప్రకటించింది. సముద్రమట్టానికి 5.8 కిలోమీటర్ల ఎత్తులో కొనసాగుతున్న ద్రోణితో పాటుగా మధ్య బంగాళాఖాతంలో శనివారం ఏర్పడిన అల్పపీడనం వాయవ్య బంగాళాఖాతం మీదుగా ఏర్పడిన ఆవర్తనంతో కలిసిపోయిందని పేర్కొన్నది. నేటి నుంచి ఐదు రోజుల పాటు ఆయా జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్టు పేర్కొన్నది. ఆదివారం హైదరాబాద్‌లో భారీ వర్షం కురిసింది. చాలా ప్రాంతాల్లో ప్రధాన రోడ్లపైకి వరద చేరడంతో, వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దీంతో నగరంలో ట్రాఫిక్ పెద్ద ఎత్తున నిలిచిపోయింది. ముఖ్యంగా మాదాపూర్, హైటెక్ సిటీ మార్గంలో ట్రాఫిక్ జామ్ అయ్యింది. ప్రత్యామ్నాయ మార్గాల్లో వెళ్లాలని ట్రాఫిక్, జీహెచ్ఎంసీ సిబ్బంది వాహనదారులకు సూచించారు. యూసుఫగూడలోని శ్రీకృష్ణనగర్‌లో ఓ కారు వరదలో కొట్టుకుపోయింది.



హైదరాబాద్ రాంనగర్‌లో కురుస్తున్న భారీ వర్షం



నాపైనా రెండుసార్లు హత్యాయత్నం

ఎలాన్ మస్క్ వెల్లడి

వాషింగ్టన్, జూలై 14: ట్రంప్‌పై కాల్పుల ఘటనతో అమెరికా ఉలిక్కిపడింది. గతంలో తనపైనా రెండుసార్లు హత్యాయత్నాలు జరిగాయన్న సంగతిని ప్రపంచ కుబేరుడు, టెస్లా సీఈవో ఎలాన్ మస్క్ తాజాగా బయటపెట్టారు. టెక్సాస్‌లోని టెస్లా ప్రధాన కార్యాలయానికి సమీపంలో తుపాకులతో సంచరిస్తున్న ఇద్దరు వ్యక్తుల్ని అరెస్టు చేసినట్టు మస్క్ చెప్పారు. ట్రంప్‌పై కాల్పుల ఘటన నేపథ్యంలో, మస్క్ భద్రతపై 'ఎక్స్' ఖాతాదారు ఒకరు ఆందోళన వ్యక్తం చేశారు. 'దయచేసి.. మీ వ్యక్తిగత భద్రతను మూడింతలు చేయండి. ట్రంప్‌పై గన్ ఎక్కుపెట్టినవారు.. ఏదో ఒక రోజు మీపైకి కూడా వస్తారు' అంటూ మస్క్‌ను హెచ్చరించారు. దీనిపై స్పందించిన మస్క్, గత 8 నెలల్లో తనపై రెండుమార్లు హత్యాయత్నం జరిగిందన్న సంగతిని 'ఎక్స్'లో చెప్పుకొచ్చారు. ఇదిలా ఉండగా, కాల్పుల ఘటనలో గాయపడ్డ ట్రంప్ త్వరగా కోలుకోవాలని మస్క్ ఆకాంక్షించారు.

19న సీయూఈటీ-యూజీ రీటెస్ట్

ఫలితాలు ఎప్పుడన్నది తెలుపని ఎన్టీఏ

న్యూఢిల్లీ, జూలై 14: దాదాపు వెయ్యి మందికిపైగా అభ్యర్థులకు సీయూఈటీ-యూజీ రీటెస్టును ఈ నెల 19న నిర్వహిస్తున్నట్టు ఎన్టీఏ (నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ) ఆదివారం ప్రకటించింది. పరీక్షకు సంబంధించి జూలై 7న ప్రొవిజనల్ ఆన్సర్ కీ విడుదల చేసిన ఎన్టీఏ.. పరీక్షపై అభ్యర్థుల నుంచి ఏమైనా అభ్యంతరాలు వస్తే, వాటిని పరిశీలించి జూలై 15-19 మధ్య రీటెస్ట్ నిర్వహిస్తామని ప్రకటించిన విషయం తెలిసిందే. తాజాగా రీటెస్ట్ పరీక్ష తేదీని ఖరారు చేసింది. అయితే ప్రవేశ పరీక్ష ఫలితాల కోసం దేశవ్యాప్తంగా విద్యార్థులు ఎదురుచూస్తున్నారు. ఫలితాల విడుదలపై ఎన్టీఏ ఎలాంటి స్పష్టత ఇవ్వలేదు.

ట్రంప్‌పై హత్యాయత్నం

అమెరికా మాజీ అధ్యక్షుడిపై కాల్పులు

- ఎన్నికల సభలో ప్రసంగిస్తుండగా ఘటన
- కుడి చెవిని తాకుతూ దూసుకెళ్లిన బుల్లెట్
- ప్రాణాలతో బయటపడ్డ డొనాల్డ్ ట్రంప్
- కాల్పుల్లో ఒకరి మృతి, ఇద్దరికి గాయాలు
- దుండగుడిని మట్టుబెట్టిన సీక్రెట్ సర్వీస్
- కాల్పులు జరిపిన వ్యక్తిని గుర్తించిన ఎఫ్‌బీఐ
- ఘటనను ఖండించిన ప్రపంచ దేశాధినేతలు
- ఐక్యంగా నిలబడదాం: ట్రంప్ పిలుపు



షికాగో, జూలై 14: అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై హత్యాయత్నం జరిగింది. శనివారం పెన్సిల్వేనియాలోని బట్లర్ పట్టణంలో జరిగిన ఎన్నికల ప్రచార సభలో ట్రంప్(78) మాట్లాడుతుండగా ఓ దుండగుడు ఆయనపై కాల్పులు జరిపాడు. ఈ ఘటనలో ట్రంప్ కుడి చెవికి గాయమైంది. సీక్రెట్ సర్వీస్ ఏజెంట్లు వెంటనే స్పందించడంతో ట్రంప్ త్రుటిలో ప్రాణాలతో బయటపడ్డారు. ఈ ఘటనలో ప్రచార సభకు హాజరైన ఒక వ్యక్తి మరణించగా, మరో ఇద్దరికి గాయాలయ్యాయి. ట్రంప్‌పై కాల్పులు జరిపిన దుండగుడిని వెంటనే సీక్రెట్ సర్వీస్ స్నైపర్ ఒకరు కాల్చి చంపేశారు. అధ్యక్ష ఎన్నికలు సమీపిస్తున్న వేళ జరిగిన ఈ అసాధారణ ఘటన అమెరికాను కుదిపేస్తున్నది.

కుడి చెవికి గాయం.. ముఖంపై రక్తపు ధారలు

రిపబ్లికన్ పార్టీ తరఫున మరోసారి పోటీ చేస్తున్న ట్రంప్ శనివారం బట్లర్‌లో ఎన్నికల ప్రచార సభను నిర్వహించారు. సాయంత్రం 6:15 గంటల సమయంలో తన మద్దతుదారుల మధ్యలో ఆయన ప్రసంగం ప్రారంభిస్తుండగా.. సమీపంలోని ఓ భవనం పైకప్పుపై నక్కిన దుండగుడు ట్రంప్‌ను లక్ష్యంగా చేసుకొని కాల్పులు జరిపాడు. ఒక బుల్లెట్ ట్రంప్ కుడి చెవిని తాకుతూ దూసుకెళ్లింది. దీంతో ప్రాణాలను కాపాడుకునేందుకు ఆయన పోడియం వెనుక మోకాళ్లపై కూర్చున్నారు. వెంటనే అప్రమత్తమైన సీక్రెట్ సర్వీస్ ఏజెంట్లు ట్రంప్ చుట్టూ రక్షణగా చేరి ఆయనను వేదిక కిందకు తీసుకెళ్లారు. ఈ ఘటనలో ట్రంప్ కుడి చెవికి గాయమై రక్తస్రావమైంది. ఆయన ముఖంపై రక్తపు ధారలు కారుతుండగానే.. సభకు హాజరైన జనాన్ని ఉద్దేశించి ట్రంప్ అభివాదం చేశారు. పిడికిలి బిగించి, 'ఫైట్, ఫైట్, ఫైట్' అని నినదించారు. వెంటనే ట్రంప్‌ను పిట్స్‌బర్గ్ ఏరియా హాస్పిటల్‌కు తరలించి చికిత్స అందించారు.



తనపై కాల్పుల అనంతరం 'ఫైట్' అంటూ నినదిస్తున్న ట్రంప్ చుట్టూ రక్షణగా చేరి ఆయనను కిందకు తీసుకెళుతున్న సీక్రెట్ సర్వీస్ ఏజెంట్లు

దుండగుడు జరిపిన కాల్పుల్లో సభకు హాజరైన ఓ వ్యక్తి మరణించగా, మరో ఇద్దరు గాయపడి చికిత్స పొందుతున్నారు.

దుండగుడి గుర్తింపు

దుండగుడిని బెథెల్ పార్క్‌కు చెందిన థామస్ మాథ్యూ క్రూక్స్(20)గా పోలీసులు గుర్తించారు. ఈ ఘటనపై అమెరికా ఎఫ్‌బీఐ విచారణ ప్రారంభించింది. దుండగుడు సభా ప్రాంగణంలోకి తుపాకీని ఎలా తీసుకొచ్చాడు, ఏ ఉద్దేశంతో కాల్పులు జరిపాడు అనేది తేలాల్సి ఉందని ఎఫ్‌బీఐ పిట్స్‌బర్గ్ ప్రాంత స్పెషల్ ఏజెంట్ కెవిన్ రోజెక్ తెలిపారు. అతడి గురించి సీక్రెట్ సర్వీస్ ఏజెంట్లకు చెప్పినా పట్టించుకోలేదని ఓ ప్రత్యక్ష సాక్షి ఆరోపించారు.

రిపబ్లికన్ ఓటరుగా నమోదై..

ట్రంప్‌పై కాల్పులు జరిపినట్టుగా భావిస్తున్న థామస్ మాథ్యూ క్రూక్స్ ఎవరనే అంశంపై ఎఫ్‌బీఐ విచారణ జరుపుతున్నది. అతడు రిపబ్లికన్ పార్టీ ఓటరుగా నమోదు చేసుకున్నట్టు వార్తలు వస్తున్నాయి. అయితే, 2021లో డెమొక్రటిక్ పార్టీ అనుబంధ ప్రోగ్రెసివ్ టర్నవుట్ ప్రాజెక్టుకు కూడా క్రూక్ 15 డాలర్లు విరాళంగా ఇచ్చారనే ప్రచారం కూడా జరుగుతున్నది. కాగా, క్రూక్స్ ఇంట్లో, కారులో బాంబు తయారీ ముడిపదార్థాలను భద్రతా సిబ్బంది గుర్తించారు.

అమెరికాలో ఇలాంటి ఘటనను నమ్మలేకపోతున్నా: ట్రంప్

కాల్పుల ఘటనపై ట్రంప్ తన 'ట్రూత్ సోషల్'లో పోస్ట్ చేశారు. 'మన దేశంలో ఇలాంటి ఘటన జరగడాన్ని నమ్మలేకపోతున్నా. నన్ను కాల్చిన ఒక బుల్లెట్ నా కుడి చెవి పైభాగాన్ని తాకింది. బుల్లెట్ శబ్దం విని ఏదో జరుగుతున్నది అని అనుకుంటుండగానే నాకు బుల్లెట్ తగిలింది. తీవ్ర రక్తస్రావం అయ్యింది. అప్పుడు నాకు ఏం జరిగిందో అర్థమైంది. గాడ్ బ్లెస్ అమెరికా' అంటూ ఆయన పేర్కొన్నారు. తర్వాత ఆయన మరోసారి స్పందిస్తూ.. 'ఊహించని పరిణామం నుంచి ఆ దేవుడే కాపాడాడు. ఈ సమయంలో అమెరికన్లు ఐక్యంగా నిలబడాల్సిన అవసరం ఉంది. మన అసలైన స్వభావాన్ని చాటి, చెడు గెలవకుండా చూడాలి' అని పిలుపునిచ్చారు. అటుపోట్లను తట్టుకుంటామన్నారు.

అమెరికాలో హింసకు చోటు లేదు: బైడెన్

ట్రంప్‌పై హత్యాయత్నాన్ని అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ఖండించారు. ట్రంప్ సురక్షితంగా ఉన్నందుకు సంతోషమని, ఆయన కోసం, ఆయన కుటుంబం కోసం ప్రార్థిస్తున్నట్టు తెలిపారు. ట్రంప్‌ను రక్షించిన సీక్రెట్ సర్వీస్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అమెరికాలో ఇలాంటి హింసకు తావులేదని, దేశమంతా ఐక్యంగా ఈ ఘటనను ఖండించాలని పిలుపునిచ్చారు. ట్రంప్‌తోనూ బైడెన్ ఫోన్‌లో మాట్లాడారని వైట్ హౌస్ అధికారి చెప్పారు.

ఖండించిన ప్రపంచ దేశాధినేతలు


తన స్నేహితుడు ట్రంప్‌పై జరిగిన దాడిని ఖండిస్తున్నట్టు భారత ప్రధాని మోదీ పేర్కొన్నారు. రాజకీయాలు, ప్రజాస్వామ్యాల్లో హింసకు చోటు లేదని, ట్రంప్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. వివిధ దేశాధినేతలు కూడా దాడిని ఖండించారు.



ట్రంప్‌పై హత్యాయత్నం జరిగిన రెండు గంటలకే ఆయన పిడికిలి బిగించి నినదిస్తున్న ఫొటోతో కూడిన టీ-షర్టులు చైనాలో అమ్మకానికి ఉంచారు. చైనా, అమెరికా నుంచి ఈ టీ షర్టుల కొనుగోలుకు భారీగా ఆర్డర్లు రావడం గమనార్హం.

పెరిగిన ట్రంప్ విజయావకాశాలు

అమెరికా అధ్యక్ష ఎన్నికలు సమీపిస్తున్న వేళ ట్రంప్‌పై హత్యాయత్నం ఘటన రాజకీయాలను మలుపుతిప్పే అవకాశం ఉందని సర్వే సంస్థలు చెప్తున్నాయి. నవంబరులో అధ్యక్ష ఎన్నికలు జరగాల్సి ఉన్నాయి. ట్రంప్‌పై హత్యాయత్నం ఘటన జరిగిన తర్వాత ట్రంప్ విజయావకాశాలు పెరిగినట్టు విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ట్రంప్ విజయావకాశాలు ఒకేసారి 8% పెరిగి, 70 శాతానికి చేరుకున్నట్టు రాజకీయాలను అంచనా వేసే పాలిమార్కెట్ అనే సంస్థ పేర్కొన్నది.



అబ్రహాం లింకన్ | జేమ్స్ గార్‌ఫీల్డ్ | విలియం మెకిన్లీ | జాన్ ఎఫ్ కెనడీ

అబ్రహం లింకన్ నుంచి కెనడీ దాకా..

హత్యకు గురైన నలుగురు అధ్యక్షులు!

వాషింగ్టన్: అమెరికా మాజీ అధ్యక్షుడు ట్రంప్‌పై ఎన్నికల ప్రచారం సందర్భంగా జరిగిన హత్యాయత్నం సంచలనం రేపింది. ఇంతకు ముందు కూడా అమెరికాలో అధ్యక్షులు, మాజీ అధ్యక్షులు, ప్రధాన పార్టీల అభ్యర్థులే లక్ష్యంగా పలుమార్లు హింసాత్మక దాడులు జరిగాయి. దాడుల కారణంగా ఏకంగా నలుగురు అధ్యక్షులు మరణించగా.. హత్యాయత్నాలతో పలువురు గాయపడ్డారు.

1865: హత్యకు గురైన అమెరికా మొదటి అధ్యక్షుడు అబ్రహం లింకన్. 1865, ఏప్రిల్ 14న ఆయన తన భార్యతో కలిసి వాషింగ్టన్‌లోని ఫోర్డ్స్ థియేటర్‌లో ఓ ప్రత్యేక కార్యక్రమానికి హాజరైన సమయంలో జాన్ వైక్స్ అనే వ్యక్తి కాల్పులు జరిపాడు. తలలో బలమైన గాయంతో లింకన్ తర్వాతి రోజున మరణించారు. నల్లజాతీయుల హక్కుల కోసం మద్దతు తెలపడమే ఆయన హత్య వెనుక కారణమని దర్యాప్తులో తేలింది.

1881: అధికారంలోకి వచ్చిన ఆర్నెల్లలోనే అధ్యక్షుడు జేమ్స్ గార్‌ఫీల్డ్ హత్యకు గురయ్యారు. 1881, జూలై 2న న్యూ ఇంగ్లండ్‌లోని ఓ రైల్వే స్టేషన్‌లో ఆయనపై చార్లెస్ గిటో అనే వ్యక్తి కాల్పులకు పాల్పడ్డారు. తర్వాత కొద్ది వారాలకు గార్‌ఫీల్డ్ మరణించారు.

1901: సెప్టెంబర్ 6న న్యూయార్క్‌లోని బఫెలో నగరంలో ప్రసంగించిన తర్వాత అధ్యక్షుడు విలియం మెకిన్లీపై కాల్పుల ఘటన చోటుచేసుకొన్నది. ప్రజలకు షేక్‌హ్యాండ్ ఇస్తున్న క్రమంలో పాయింట్ బ్లాంక్ రేంజ్‌లో మెకిన్లీ ఛాతీపై లియోన్ అనే 28 ఏండ్ల నిరుద్యోగి రెండు రౌండ్ల కాల్పులు జరిపాడు. మెకిన్లీ వారం తర్వాత మరణించారు.

1963: డల్లాస్ పర్యటన సందర్భంగా అధ్యక్షుడు జాన్ ఎఫ్ కెనడీ కాన్వాయ్‌పై దాడి జరిగింది. దుండగుడి కాల్పుల్లో తీవ్ర గాయాలైన కెనడీని పార్క్‌ల్యాండ్ దవాఖానకు తరలించారు. ఆ తర్వాత ఆయన మరణించారు.

పలువురు నేతలపై కాల్పుల ఘటనలు

1933లో ఫ్రాంక్లిన్ రూజ్‌వెల్ట్‌పై(32వ అధ్యక్షుడు), 1950లో హ్యారీ ఎస్ ట్రూమన్ (33వ అధ్యక్షుడు), 1975లో జెరాల్డ్ ఫోర్డ్‌పై (38వ అధ్యక్షుడు), 1981లో రొనాల్డ్ రీగన్(40వ అధ్యక్షుడు), 2005లో జార్జ్ డబ్ల్యూ బుష్(43వ అధ్యక్షుడు)పై హత్యాయత్నాలు జరిగాయి. పలువురు అధ్యక్ష అభ్యర్థులపై కాల్పుల ఘటనలు చోటుచేసుకున్నాయి.

75 మంది సిబ్బంది.. 24 గంటలూ

అమెరికా మాజీ అధ్యక్షులకు పటిష్ఠ భద్రత

న్యూయార్క్, జూలై 14: డొనాల్డ్ ట్రంప్‌పై హత్యాయత్నం ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. అగ్రరాజ్యంలో ఒక మాజీ అధ్యక్షుడు, మరోసారి అధ్యక్ష బరిలో ఉన్న వ్యక్తిపై ఇలాంటి ఘటన జరగడం అందరినీ ఆశ్చర్యపరిచింది. అసలు ట్రంప్ భద్రత ఎలా ఉంటుందనే చర్చ మొదలయ్యింది. సాధారణంగా అమెరికా మాజీ అధ్యక్షుల దంపతులకు జీవితాంతం అమెరికా సీక్రెట్ సర్వీస్ భద్రతను కల్పిస్తుంది. 75 మంది సిబ్బంది 24 గంటలూ రక్షణగా ఉంటారు. ట్రంప్ ఇప్పుడు మాజీ అధ్యక్షుడే కాకుండా అధ్యక్ష బరిలో ఉన్న అభ్యర్థి. కాబట్టి, మిగతా మాజీ అధ్యక్షుల కంటే ఆయనకు ఎక్కువ భద్రతను కల్పించారు. ఇటీవల ట్రంప్ భద్రతను మరింత పెంచినట్టు సీక్రెట్ సర్వీస్ ప్రకటించింది. అయినప్పటికీ ట్రంప్‌పై అసాధారణ రీతిలో హత్యాయత్నం ఘటన జరగడంతో సీక్రెట్ సర్వీస్‌పై విమర్శలు మొదలయ్యాయి.

తెరుచుకున్న భాండాగారం

- 46 ఏండ్ల తర్వాత ఇదే తొలిసారి
- ప్రత్యేక పూజల అనంతరం పూరీ జగన్నాథుడి రత్న భాండాగారం తలుపులు తెరిచిన కమిటీ
- లెక్కింపునకు మరి కొంత సమయం: ఆలయ ప్రధానాధికారి

పూరీ: ఒడిశాలోని పూరీలో 12వ శతాబ్దానికి చెందిన జగన్నాథుడి ఆలయ రత్న భాండాగారం 46 ఏండ్ల తర్వాత తెరుచుకొన్నది. ఆదివారం ప్రత్యేక పూజల అనంతరం ఆ రహస్య గదిని తెరిచారు. మొత్తం 11 మంది లోపలికి వెళ్లారు. భాండాగారంలోని ఆభరణాలు, ఇతర విలువైన వస్తువుల లెక్కింపు, గది మరమ్మతుల నిమిత్తం తలుపులు తెరిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీ ఆలయానికి మధ్యాహ్నం 12 గంటలకు చేరుకొన్నది. మధ్యాహ్నం 1.28 గంటలకు భాండాగారం తలుపులు తెరిచారు. ట్రెజరీని తెరిచిన సమయంలో ప్రభుత్వం నియమించిన కమిటీ చైర్మన్, ఒడిశా హైకోర్టు మాజీ జడ్జి జస్టిస్ బిశ్వనాథ్ రథ్, జగన్నాథ్ ఆలయ ప్రధానాధికారి అరవింద పాఢీ, ఏఎస్‌ఐ సూపరింటెండెంట్ గదనాయక్, పూరీ రాజా గజపతి మహారాజ ప్రతినిధి తదితరులు ఉన్నారు.

తాళాలు పగులగొట్టి లోపలికి..

ఆలయ ప్రధానాధికారి అరవింద పాఢీ మీడియాతో మాట్లాడుతూ 'అధికారిక వ్యక్తులు ట్రెజరీ వద్దకు వెళ్లగా, తలుపునకు మూడు తాళాలు ఉన్నాయి. జిల్లా అధికారుల వద్ద ఉన్న తాళం చెవి పని చేయలేదు. దీంతో మేజిస్ట్రేట్ సమక్షంలో తాళాలను పగులగొట్టాం. ఆ తర్వాత లోపలికి వెళ్లి చెక్కపెట్టెలు, బీరువాల్లో ఉన్న ఆభరణాలు, ఇతర వస్తువులను పరిశీలించాం' అని తెలిపారు. తాత్కాలికంగా ఆలయంలోనే ఏర్పాటు చేసిన తాత్కాలిక స్ట్రాంగ్‌రూమ్‌కు తరలించామని, రూమ్‌కు సీల్ వేశామని తెలిపారు. భాండాగారం లోపల పరిస్థితిని పురావస్తు శాఖ ఏఎస్‌ఐ పరిశీలించిందని, మొత్తం ప్రక్రియను వీడియోగ్రఫీ చేసినట్టు అధికారులు తెలిపారు.



రత్న భాండాగారంలోని విలువైన వస్తువులను సేకరించే పెట్టెలు ఆలయంలోకి తరలింపు

బహుద యాత్ర, సునా వేశ తర్వాత..

'తరలింపు ప్రక్రియ అంతా ఒకేసారి జరగాలి. అది ఈ రోజు సాధ్యం కాదు. భాండాగారంలో ఉన్న విలువైన వస్తువులను ప్రస్తుతానికి తరలించకూడదని కమిటీ నిర్ణయించింది' అని అరవింద పాఢీ వెల్లడించారు. బహుద యాత్ర, సునా వేశ కార్యక్రమాల అనంతరం ఆభరణాల తరలింపు తేదీని నిర్ణయిస్తాం అని తెలిపారు. మరమ్మతుల తర్వాత నిధిని తిరిగి ట్రెజరీలోకి తీసుకొస్తారని, తర్వాత లెక్కింపు ఉంటుందని అరవింద్ పాఢీ తెలిపారు. అంతకుముందు విలువైన వస్తువులను తరలించేందుకు తయారు చేయించిన 15 చెక్కపెట్టెల్లో ఆరింటిని ఆలయానికి తీసుకొచ్చారు.

అప్పుడు 70 రోజుల సమయం

చివరిసారి 1978లో రత్న భాండాగారాన్ని తెరిచారు. ట్రెజరీలోని నిధి లెక్కింపునకు 70 రోజుల సమయం పట్టింది. అప్పట్లో కొన్నింటిని వదిలేయడంతో లెక్కలపై సందేహాలున్నాయి. 2018లో హైకోర్టు ఆదేశాల మేరకు భాండాగారం తలుపులు తెరిచేందుకు ప్రయత్నించారు. అయితే అసలైన తాళాలు లేకపోవడంతో ఆ ప్రక్రియ వాయిదా పడింది.

ఆభరణాల వివరాల డిజిటలైజేషన్

దశాబ్దాల తర్వాత గదిని తెరవడంతో విష సర్పాలు ఉండే అవకాశం ఉందన్న ఉద్దేశంతో పాములు పట్టే నిపుణులను సిద్ధంగా ఉంచారు. అయితే పాములు ఏమీ లేవని అధికారులు తెలిపారు. ఆభరణాల బరువు, తయారీ వంటి వాటి వివరాలతో ప్రభుత్వం డిజిటల్ క్యాటలాగ్ సిద్ధం చేయనున్నది.



బీజేపీలో చేరిన హైకోర్టు మాజీ జడ్జి

భోపాల్, జూలై 14: వివాదాస్పద తీర్పులతో వార్తల్లో నిలిచిన మధ్యప్రదేశ్ హైకోర్టు మాజీ జడ్జి రోహిత్ ఆర్య బీజేపీలో చేరారు. ఈ విషయాన్ని ఆదివారం ఆయన నిర్ధారించారు. పార్టీ రాఘవేంద్ర శర్మ భోపాల్‌లోని పార్టీ కార్యాలయంలో ఆర్యను పార్టీలో చేర్చుకున్నారు. మూడు నెలల క్రితమే ఆర్య హైకోర్టు జడ్జిగా పదవీ విరమణ చేశారు. తీర్పుల సందర్భంగా ఆయన వివాదాస్పద వ్యాఖ్యలు చేసేవారు. హిందూ దేవతలకేసులో స్టాండప్ కమెడియన్ మునవర్ ఫారూఖీకి 2021లో బెయిల్ తిరస్కరించి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. అలాగే లైంగిక వేధింపుల కేసులో బెయిల్ షరతుగా నిందితుడు బాధితురాలితో రాఖీ కట్టించుకోవాలని, ఆమెకు 11 వేలు బహుమతిగా ఇవ్వాలని 2020లో ఒక కేసులో ఆదేశించారు.

చంద్రుడిపైనా నావిగేషన్ వ్యవస్థ

ఏర్పాటుకు చైనా శాస్త్రవేత్తల ప్రణాళిక




బీజింగ్, జూలై 14: భూమిపైన ఉన్నట్టుగానే చంద్రుడిపైన కూడా శాటిలైట్ నావిగేషన్ వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు పలువురు చైనా శాస్త్రవేత్తలు ప్రణాళికను రూపొందించారు. బీజింగ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పేస్‌క్రాఫ్ట్ సిస్టమ్ ఇంజినీరింగ్‌కు చెందిన బృందం చంద్రుడి చుట్టూ 21 ఉపగ్రహాలు ఏర్పాటు చేయాలని ప్రతిపాదించింది. చంద్రుడి ఆనుపానులు తెలుసుకునేలా ఈ నావిగేషన్ వ్యవస్థ పని చేస్తుందని శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. నాలుగు కక్ష్యల్లో, మూడు దఫాల్లో ఈ ఉపగ్రహాలను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. ఇది సుస్థిరమైన, తక్కువ ఖర్చుతో కూడుకున్న ప్రతిపాదన అని తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలు చైనీస్ స్పేస్ సైన్స్ అండ్ టెక్నాలజీ జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. చంద్రుడిపై పరిశోధనలకు గానూ చైనా లక్ష్యాలకు ఈ నావిగేషన్ వ్యవస్థ ఉపయోగపడుతుందని శాస్త్రవేత్తలు తెలిపారు. కాగా, ప్రస్తుతం భూమిపై అమెరికాకు చెందిన జీపీఎస్ ఉన్నట్టుగానే, చైనాకు సైతం బీదౌ పేరుతో సొంత నావిగేషన్ వ్యవస్థ ఉంది.

గ్రహశకలాలపై మైనింగ్


అంతరిక్ష నిర్మాణాల కోసం ఆస్టరాయిడ్స్ నుంచి మెటీరియల్స్: పిక్సెల్ స్పేస్

బెంగళూరు, జూలై 14: భవిష్యత్తులో అంతరిక్షంలో చేపట్టబోయే నిర్మాణాల కోసం కావాల్సిన పదార్థాలను గ్రహశకలాల నుంచి సేకరించే అవకాశం ఉందని అంటున్నది బెంగళూరుకు చెందిన అంతరిక్ష రంగ స్టార్టప్ పిక్సెల్ స్పేస్. ఈ సంస్థ సీఈవో అవైస్ అహ్మద్ తమ భవిష్యత్తు ప్రణాళికలను 'పీటీఐ'కు వెల్లడించారు. అంతరిక్షంలో నిర్మాణాల కోసం కావాల్సిన పదార్థాలను గుర్తించేందుకు చంద్రుడు, గ్రహశకలాలను మ్యాప్ చేయాలనే ఆలోచనలు ఉన్నట్టు తెలిపారు. భవన నిర్మాణ పదార్థాలు, ఇంధన వనరులను గ్రహశకలాల్లో అన్వేషించాలనే దీర్ఘకాలిక ప్రణాళిక ఉన్నట్టు చెప్పారు. భవిష్యత్తులో అంతరిక్షంపైకి మానవాళి విస్తరిస్తే.. కావాల్సిన పదార్థాలను భూమి నుంచి తీసుకెళ్లడం తెలివైన పని కాదని, అంతరిక్షంలో ఇంకా ఎక్కువ పదార్థాలు ఉన్నాయని తెలిపారు.



నేపాల్ కొత్త ప్రధానిగా కేపీ శర్మ ఓలి

కాఠ్మాండూ, జూలై 14: నేపాల్ ప్రధానిగా కేపీ శర్మ ఓలి మూడోసారి నియమితులయ్యారు. శుక్రవారం ప్రజా ప్రతినిధుల సభలో విశ్వాస పరీక్షలో ప్రధాని పుష్పకమల్ దహాల్ ప్రచండ ఓడిపోవడంతో ఓలి నేతృత్వంలో కొత్త ప్రభుత్వం కొలువుదీరనుంది. అస్థిరతకు మారుపేరైన నేపాల్‌లో సుస్థిర ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం ఓలి ముందున్న అతిపెద్ద సవాల్. నేపాల్-యునైటెడ్ మార్క్సిస్ట్ లెనినిస్ట్ (సీపీఎన్-యూఎంఎల్), నేపాలీ కాంగ్రెస్ (ఎన్‌సీ)లతో ఏర్పడిన సంకీర్ణ ప్రభుత్వంలో కొత్త ప్రధానిగా ఓలిని అధ్యక్షుడు రామచంద్ర పౌడెల్ ఆదివారం నియమించారు. ఓలి, అతని మంత్రివర్గం సోమవారం ప్రమాణ స్వీకారం చేస్తుంది. కాగా ఓలి గతంలో 2015-16, 2018-2021 కాలంలో ప్రధానిగా పనిచేయగా, ఇప్పుడు మూడోసారి అధికారం చేపట్టనున్నారు.



ఒకే రోజు 11 లక్షల మొక్కలు

ఇండోర్: మధ్యప్రదేశ్‌లోని ఇండోర్ ఒకే రోజు అత్యధిక సంఖ్యలో మొక్కలు నాటి గిన్నిస్ రికార్డును సాధించింది. ఆదివారం 24 గంటల్లో 11 లక్షల మొక్కలను నాటి కొత్త రికార్డును నెలకొల్పింది. మొక్కలు నాటే కార్యక్రమంలో 2 వేల మంది బీఎస్ఎఫ్ జవాన్లు, వంద మందికి పైగా ఎన్ఆర్ఐలు, ఎన్‌సీసీ కేడెట్లు, 50 స్కూళ్లకు చెందిన విద్యార్థులు, పౌరులు, వివిధ స్వచ్ఛంద సంస్థల కార్యకర్తలు భాగస్వాములయ్యారు. కాగా, అంతకుముందు ఈ గిన్నిస్ రికార్డు అస్సాం రాష్ట్రం పేరుపై ఉంది. 2023 సెప్టెంబర్ 13, 14 తేదీల్లో ఆ రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో 9,21,730 మొక్కలను నాటారు. ఇప్పుడు ఇండోర్ ఆ రికార్డును అధిగమించింది. గిన్నిస్ బుక్ ప్రతినిధులు మధ్యప్రదేశ్ సీఎం మోహన్ యాదవ్ సామాజిక మాధ్యమంలో షేర్ చేశారు.



పొదుపు చేస్తే.. మంచిగ నిద్ర

లండన్, జూలై 14: డబ్బుతో సంతోషాన్ని కొనలేం.. కానీ, ప్రతి నెలా ఎంతో కొంత పొదుపు చేయటం భవిష్యత్తుపై భరోసా కల్పిస్తుంది. అలా డబ్బులు పొదుపు చేసేవారికి హాయిగా నిద్ర పడుతుందని, దర్జాగా రిలాక్స్ అవుతారని 'బ్రిస్టల్ యూనివర్సిటీ' అధ్యయనం వెల్లడించింది. సేవింగ్స్‌కూ, స్లీపింగ్‌కూ సంబంధం ఉన్నదని పేర్కొన్నది. 'యాక్ట్ ఆఫ్ సేవింగ్'పై సర్వే నిర్వహించగా ఆసక్తికర వివరాలు వెల్లడించారు. ఆర్థిక నేపథ్యం, తాము ధనవంతులా? పేదలా? అన్నదానితో సంబంధం లేకుండా, ప్రతి నెలా పొదుపు చేసేవారిలో ఒకే విధమైన సంతృప్తి స్థాయిలు ఉన్నట్టు పరిశోధకులు గుర్తించారు. పొదుపు చేయలేకపోవటం.. తమను ఎంతగానో అసంతృప్తికి గురిచేసేదని గత పదేండ్లుగా పొదుపు పాటిస్తున్న కొంతమంది సర్వేలో చెప్పారు.



అమెరికా మాజీ అధ్యక్షుడు అబ్రహాం లింకన్ గే!

వాషింగ్టన్: అమెరికా మాజీ అధ్యక్షుడు అబ్రహాం లింకన్ గే అని తాజా డాక్యుమెంటరీ చెప్తున్నది. 'లవర్ ఆఫ్ మెన్ : ది అన్‌టోల్డ్ హిస్టరీ ఆఫ్ అబ్రహాం లింకన్' పేరుతో రూపొందించిన ఈ డాక్యుమెంటరీలో పురుషులతో లింకన్ రొమాంటిక్ రిలేషన్‌షిప్స్ గురించి వివరించారు. ప్రముఖ లింకన్ స్కాలర్స్ చెప్పిన విషయాలు, ఇప్పటి వరకు బయటపడని పాటలు, లేఖలు వంటివాటి ఆధారంగా ఈ చిత్రాన్ని రూపొందించారు. హార్వర్డ్, కొలంబియా తదితర ప్రతిష్ఠాత్మక సంస్థలకు చెందిన చరిత్రకారుల ఇంటర్వ్యూలు ఈ డాక్యుమెంటరీలో ఉన్నాయి. సెక్సువల్ నియమాలు 19వ శతాబ్దంలో ఎలా ఉండేవి? ఇప్పుడు ఎలా ఉన్నాయి? వాటి మధ్య తేడాలు ఏమిటి? అనే అంశాలను దీనిలో వివరించారు.



డిటెక్టివ్‌గా ఏంజెలా మెర్కెల్!

న్యూఢిల్లీ, జూలై 14: జర్మన్ మాజీ చాన్స్‌లర్ ఏంజెలా మెర్కెల్ ఇప్పుడు కొత్త పాత్రలో దర్శనమివ్వనున్నారు. రిటైరైన తర్వాత ఆమె ప్రముఖ జర్మన్ పాపులర్ టీవీ షోలో ఆమె మిస్ మార్పెల్‌గా డిటెక్టివ్ పాత్రలో అరంగేట్రం చేస్తున్నారు. అగాథా క్రిస్టీ రచించిన మిస్ మార్పెల్‌లో ఆమె ఆడిన పాత్రలో కన్పించబోతున్నారు. ఆ షోలో ఆమె ఉత్తర ఇటలీలోని నేరాలను పరిశోధించే డిటెక్టివ్‌గా కన్పిస్తారు. డెట్ ఎట్ ద క్యాపిటల్ పేరుతో రానున్న తొలి ఎపిసోడ్ ట్రైలర్ కూడా విడుదలైందని ఆమె తెలిపారు. కాగా రాజకీయాల నుంచి రిటైరైన 69 ఏండ్ల మెర్కెల్ 2005 నుంచి 2021 వరకు జర్మనీలో చాన్స్‌లర్‌గా, 2002 నుంచి 2005 వరకు విపక్ష నేతగా, 2000 నుంచి 2018 వరకు క్రిస్టియన్ డెమొక్రాటిక్ యూనియన్‌కు నేతగా ఉన్నారు.



బట్టలెత్తుకెళ్లిన పోలీసులు

బెంగళూరు, జూలై 14: టూరిస్టు ప్రదేశాలలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన హెచ్చరికలను చాలామంది పర్యాటకులు పట్టించుకోరు. అలా పట్టించుకోకుండా వర్షాకాలంలో జలపాతాల కింద స్నానం చేస్తున్న కొందరు పర్యాటకులకు పోలీసులు విధించిన చిన్నపాటి శిక్షను నెటిజన్లు ప్రశంసిస్తున్నారు. కర్ణాటక ముడిగెరెలోని చార్మడి జలపాతం వద్ద స్నానం చేయడాన్ని ప్రభుత్వం నిషేధించినా కొందరు స్నానాలు చేయడంతో వారు జలపాతం దిగువన ఉంచిన దుస్తులను పోలీసులు తీసుకుని వెళ్లిపోయారు. దీంతో పర్యాటకులు తమ బట్టలు ఇవ్వాలంటూ అర్ధనగ్నంగా పోలీసులను వేడుకుంటున్న దృశ్యాలు వైరల్ అయ్యాయి. దీంతో పర్యాటకులను హెచ్చరించిన అనంతరం పోలీసులు వారి బట్టలు ఇచ్చేశారు.



కుప్పకూలనున్న 20 శాటిలైట్లు!

కాలిఫోర్నియా, జూలై 14: అమెరికా ప్రైవేట్ అంతరిక్ష కంపెనీ 'స్పేస్ ఎక్స్' (ఎలాన్ మస్క్ సొంత సంస్థ) తాజాగా చేపట్టిన 'ఫాల్కన్-9' రాకెట్ ప్రయోగం విఫలమైంది. ఒకేసారి 20 శాటిలైట్లను రాకెట్ భూ కక్ష్యలో చేర్చలేకపోయింది. సాంకేతిక లోపం కారణంగా నిర్దేశిత కక్ష్యలో కాకుండా, దానికన్నా దిగువన ఉన్న కక్ష్యలోకి శాటిలైట్స్ ప్రవేశించాయి. ఈ నేపథ్యంలో ఆ శాటిలైట్స్ త్వరలో భూమి మీదకు దూసుకొచ్చి.. కుప్పకూలనున్నాయి అంటూ 'స్పేస్ ఎక్స్' అధికారిక వెబ్‌సైట్ వెల్లడించింది. 'గురువారం రాత్రి కాలిఫోర్నియా నుంచి చేపట్టిన రాకెట్ ప్రయోగం విఫలమైంది. ఈ నేపథ్యంలో ఆ శాటిలైట్స్ భూ వాతావరణంలోకి తిరిగి ప్రవేశించి.. నశిస్తాయి' అని ఒక ప్రకటనలో తెలియజేసింది.



ప్రాణం మీదకు తెచ్చిన రీల్స్ పిచ్చి

పాలి, జూలై 14: సోషల్ మీడియాలో రీల్స్ పిచ్చి దంపతుల ప్రాణాల మీదకు తెచ్చింది. రాజస్థాన్ పాలిలోని గోరంఘాట్ బ్రిడ్జిపై సోషల్ మీడియాలో రీల్ కోసం శనివారం మధ్యాహ్నం భార్యాభర్తలు వచ్చి ఫొటో షూట్ చేస్తున్నారు. అయితే బ్రిడ్జిపై అకస్మాత్తుగా రైలు వచ్చింది. పక్కన నిలబడేందుకు సైతం చోటు లేకపోవడంతో వారు దిక్కుతోచక ప్రాణాలు దక్కించుకోవడానికి 90 అడుగుల కింద ఉన్న వాగులోకి దూకేశారు. దీంతో భార్యాభర్తలిద్దరూ తీవ్రంగా గాయపడగా, భర్త పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. ఈ ప్రమాదానికి సంబంధించిన దృశ్యాలు వీడియోలో రికార్డయ్యాయి. కాగా, ప్రకృతి అందాలకు గోరంఘాట్ బ్రిడ్జి కేంద్రంగా ఉండటంతో ఇక్కడకు పలువురు వచ్చి ప్రమాదకర పరిస్థితుల్లో ఫొటోలు, వీడియోలు తీసుకుంటున్నారు.

- బోనాల భక్తులపై లాఠీచార్జి



పోలీసులు మరోసారి లాఠీలకు పనిచెప్పారు. గతవారం బల్కంపేటలో జరిగిన ఘటన మరిచిపోకముందే ఆదివారం మరోసారి గోల్కొండ కోటలో భక్తులపై పోలీసులు తమ ప్రతాపం చూపారు.

నీటి సమస్యపై రోడ్డెక్కి నిరసన



రెండు వారాలుగా మిషన్ భగీరథ నీరు సరిగ్గా రావడం లేదని ఆగ్రహిస్తూ మెదక్ జిల్లా చిన్నశంకరంపేట మండలంలోని గవ్వలపల్లి చౌరస్తా, అగ్రహారం, అంబాజీపేట గ్రామస్తులు రోడ్డెక్కారు. ఆదివారం ఖాళీ బిందెలతో గవ్వలపల్లి చౌరస్తాలో మెదక్-చేగుంట ప్రధాన రహదారిపై గంటకు పైగా బైఠాయించారు.

– చిన్నశంకరంపేట

బీసీలకు రాజ్యాధికారం కావాలి

హక్కుల కోసం ఉద్యమిస్తాం: ఆర్ కృష్ణయ్య



సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణయ్య

హైదరాబాద్, జూలై 14: బీసీలకు కావాల్సింది పదవులు కాదని, రాజ్యాధికారమని రాజ్యసభ సభ్యుడు కృష్ణయ్య పేర్కొన్నారు. తెలంగాణ మేధావుల సంఘం ఆధ్వర్యంలో 'బీసీ సమాజం అభివృద్ధి-శక్తుల కర్తవ్యం' అనే అంశంపై అఖిల పక్ష రౌండ్ టేబుల్ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ కృష్ణయ్య మాట్లాడుతూ స్వాతంత్య్రం వచ్చిన 76 ఏండ్లలో ఏ ఒక్క రాజకీయ పార్టీ కూడా బీసీలను పట్టించుకోలేదని ఆరోపించారు. 'ప్రతి గ్రామంలో వంద మంది బీసీలు విద్యావంతులుగా ఉన్నారని, వారికి పదవులు ఇవ్వాల్సి వస్తుందని సీఎం రేవంత్‌రెడ్డి అంటున్నారని, కానీ తాము రాజ్యాధికారాన్ని కోరుకుంటున్నామని స్పష్టం చేశారు. ప్రధాని స్థాయిలో బీసీ ఉంటే సరిపోదని, ఆ విధానాలను అమలుచేయాలని పేర్కొన్నారు. ఇక రాష్ట్ర క్యాబినెట్‌లో ఉన్న 18 మంది మంత్రుల్లో కేవలం ఇద్దరు, 119 మంది ఎమ్మెల్యేల్లో 21 మంది మాత్రమే బీసీలని పేర్కొన్నారు. ఇక్కడే వివక్ష కనిపిస్తున్నదని, ఇక హక్కుల కోసం ఉద్యమించాల్సి ఉందని చెప్పారు. ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ అసమానతలు తొలగించకుండా భారత్ పూర్తిగా ప్రజాస్వామిక దేశం కాదని స్పష్టం చేశారు. మాజీ ఐఏఎస్ చిరంజీవులు, తెలంగాణ మేధావుల సంఘం వైస్ చైర్మన్ కేశవులు, రాజ్యాధికార సమితి అధ్యక్షుడు సురేశ్, మేధావుల సంఘం కన్వీనర్ కిరణ్, శ్రీనివాస్ యాదవ్, ప్రొఫెసర్ ప్రభంజన్ యాదవ్, సురేందర్, కార్యదర్శులు ఎం. నర్సయ్య, డీఎస్ రావు, రాహుల్ దేవ్, డాక్టర్ ఎస్ ప్రముఖులు పాల్గొన్నారు.

జైళ్ల శాఖ బదిలీలను నిలిపేయాలి: వినోద్



ఉస్మానియా యూనివర్సిటీ, జూలై 14: రాష్ట్రపతి ఉత్తర్వులకు విరుద్ధంగా సోమవారం నుంచి జైళ్ల శాఖలో చేపట్టనున్న బదిలీలను తక్షణమే నిలిపివేయాలని దక్షిణ భారత రాజకీయ జేఏసీ చైర్మన్ ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్ డిమాండ్ చేశారు. తార్నాకలోని ఆయన కార్యాలయంలో ఆదివారం మాట్లాడారు. ఉమ్మడి రాష్ట్రంలో రాష్ట్రస్థాయి క్యాడర్‌గా ఉన్న వార్డర్స్, ఇతర్స్ పోస్టులను తెలంగాణలో జిల్లా క్యాడర్‌గా మార్చి 2021 డిసెంబర్ 6న వివిధ జిల్లాలకు బదిలీ చేశారని వివరించారు. కాంట్రిబ్యుటరీ జీవో 54 ప్రకారం వీరిని జోనల్ విధానంలో సొంత జిల్లా నుంచి బదిలీ చేయనున్నారని చెప్పారు. ఐజీ స్థాయి అధికారులు దొడ్డిదారిగా ఒకే దగ్గర విధులు నిర్వర్తిస్తుండగా, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పనిచేసిన వీరిని తెలంగాణలో సొంత జిల్లాలకు బదిలీ చేశారని గుర్తు చేశారు. నాలుగేళ్లు పూర్తికాకుండానే బదిలీలను చేస్తున్నారని ఆరోపించారు. వారికి న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

భార్యతో గొడవ.. ఆత్మహత్యాయత్నం

- కుమార్తెతోపాటు 'పాలేరు'లో దూకబోయిన ఆటో డ్రైవర్

కూసుమంచి, జూలై 14: కుటుంబ కలహాలు, భార్యతో గొడవ పడిన ఓ ఆటో డ్రైవర్ ఆత్మహత్యకు యత్నించాడు. ప్రకాశంలో అసలు విషయం తెలియని రెండేండ్ల కుమార్తెను పాలేరులో వదిలి తానూ ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకుని జలాశయం వద్దకు చేరుకున్నాడు. చిన్నారిని జలాశయంలోకి విసిరేసే సమయంలో అక్కడికి వచ్చిన బ్లూకోల్ట్ కానిస్టేబుల్.. అతడి ప్రయత్నాన్ని అడ్డగించి పాపను చేతుల్లోకి తీసుకుని వారి ప్రాణాలు కాపాడారు. ఈ ఘటన ఆదివారం ఖమ్మం జిల్లా కూసుమంచి మండలంలో జరిగింది. కూసుమంచి మండలం జక్కేపల్లి గ్రామానికి చెందిన బంగారు నరేశ్ ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. కుటుంబ సమస్యలతోపాటు భార్యతో గొడవపడి మనస్తాపం చెందాడు. ప్రకాశంతో లోపే అదే మండలంలో ఉన్న పాలేరు జలాశయంలో దూకి ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్నాడు. తన రెండేండ్ల కుమార్తెను తీసుకొని పాలేరు రిజర్వాయర్ వద్దకు చేరుకున్నాక 100కు ఫోన్ చేశాడు. తన కుమార్తెను పాలేరులో వదిలి తాను కూడా ఆత్మహత్య చేసుకుంటున్నట్టు చెప్పి ఫోన్ కట్ చేశాడు. వెంటనే తన కుమార్తె అంగీకి రాళ్లు కట్టి ఆమెను జలాశయంలో పడేసేందుకు ప్రయత్నిస్తున్నాడు. అప్పటికే సమాచారం అందుకున్న కూసుమంచి బ్లూకోల్ట్ కానిస్టేబుల్ బ్రహ్మం.. క్షణాల్లో అక్కడికి చేరుకున్నాడు. పాపను జలాశయంలోకి విసురుతుండగా తన చేతుల్లోకి తీసుకున్నాడు. నరేశ్‌ను కూడా పట్టుకు తీసుకొచ్చాడు. పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చి నరేశ్‌కు కౌన్సెలింగ్ ఇచ్చారు. చిన్నారిని అతడి కుటుంబ సభ్యులకు అప్పగించారు. క్షణాల్లో స్పందించి మెరుపువేగంతో వెళ్లి ఇద్దరిని కాపాడిన బ్లూకోల్ట్ కానిస్టేబుల్ బ్రహ్మంను పోలీసులు, మండల ప్రజలు అభినందించారు.

బీడీలమ్మిన దానంకు ఇన్ని కోట్లా?

- దానం కబ్జాల బాగోతాలు బయటకు తీస్తాం
- కేటీఆర్‌ను విమర్శించే స్థాయి నీకు లేదు
- ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ఫైర్



ప్రెస్‌మీట్‌లో ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి

హైదరాబాద్, జూలై 14 (నమస్తే తెలంగాణ): బీడీలు అమ్ముకున్న దానం నాగేందర్.. ఇన్ని వేల కోట్లు ఎలా సంపాదించారని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ప్రశ్నించారు. దానం తన ఇంటి మధ్యలో, హైదరాబాద్‌లో చేసిన భూకబ్జాల బాగోతాలన్నీ బయటకు తీస్తామని హెచ్చరించారు. కబ్జాకోరు, చీటర్, రౌడీషీటర్ అయిన దానం నీతులు చెప్పడం తగదని హితవు పలికారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను విమర్శించే స్థాయా? అని నిలదీశారు. ఆదివారం తెలంగాణభవన్‌లో కౌశిక్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. స్థాయిమర్చి నోటికొచ్చినట్టు మాట్లాడొద్దని దానం నాగేందర్‌ను హెచ్చరించారు. 2018 జూన్ 22న టీఆర్ఎస్‌లో చేరినప్పుడు 'కాంగ్రెస్ అన్యాయం చేస్తున్నది.. కేసీఆర్ దయ వల్ల రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన..' అని చెప్పిన దానం ఇప్పుడు సిగ్గు, శరం లేకుండా మాట్లాడటం తగదని మండిపడ్డారు. అందితే జుట్టు అందకపోతే కాళ్లు పట్టుకొనే రకం దానం అని ఎద్దేవా చేశారు. పార్టీ మారిన నేతలందరూ రాజీనామా చేసి మళ్లీ గెలవాలని సవాల్ చేశారు.

డీఎస్సీని వాయిదా వేయాలి

డీఎస్సీని వాయిదా వేయాలని, ప్రిపేరయ్యేందుకు అభ్యర్థులకు సమయం ఇవ్వాలని కౌశిక్‌రెడ్డి డిమాండ్ చేశారు. కేసీఆర్ పాలనలో 2.32 లక్షల ఉద్యోగాలు ఇచ్చారని, ప్రైవేట్ రంగంలో 10-12 లక్షల ఉద్యోగాలు సృష్టించారని చెప్పారు. దేశంలోనే అత్యధిక ఉద్యోగాలను కేసీఆర్ కల్పించారని వివరించారు. దేశంలోని ఏ కాంగ్రెస్, బీజేపీ పాలిత రాష్ట్రంలో ఇంత పెద్దమొత్తంలో ఉద్యోగాలు ఇచ్చారా? అని నిలదీశారు. ఇలా ఇచ్చినట్టు నిరూపిస్తే తాను రాజీనామాకు సిద్ధమని సవాల్ విసిరారు. గ్రూప్-1 మెయిన్స్‌కు 1:100 నిష్పత్తిలో అభ్యర్థులను తీసుకోవాలని నాడు అసెంబ్లీలో డిమాండ్ చేసిన భట్టి విక్రమార్క ఇప్పుడు ఎందుకు అమలుచేయడం లేదని నిలదీశారు. సమావేశంలో బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి రూపసింగ్ పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలి: మంత్రి పొంగులేటి



స్కాలర్‌షిప్ చెక్కులను అందజేస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, చిత్రంలో రెడ్డి జన సంఘం అధ్యక్షుడు చేపూరెడ్డి నర్సింహారెడ్డి, సలహాదారుడు ప్రొఫెసర్ దశరథ్‌రెడ్డి

సుల్తాన్‌బజార్, జూలై 14: విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆకాంక్షించారు. ఆదివారం ఆబిడ్స్‌లోని రెడ్డి బాలుర వసతి గృహంలోని ఆడిటోరియంలో రెడ్డి జన సంఘం (ఆబిడ్స్) ఆధ్వర్యంలో 2023-24 విద్యాసంవత్సరానికి చెందిన ఇంజినీరింగ్, మెడికల్, గ్రాడ్యుయేషన్‌లో మెరిట్ సాధించిన 353 మంది విద్యార్థులకు రూ.30 లక్షల చెక్కులు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మొదట రాజా బహదూర్ వెంకటరామిరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు ఉపకార వేతనాలు అందిస్తున్న రెడ్డి జన సంఘం కృషి అభినందనీయమని కొనియాడారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి, నల్లగొండ ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డిని జన సంఘం అధ్యక్షుడు చేపూరెడ్డి నర్సింహారెడ్డి సన్మానించారు. ప్రొఫెసర్ కంచర్ల దశరథ్‌రెడ్డి, కోశాధికారి రాజిరెడ్డి పాండురంగారెడ్డితో కలిసి ఉపకార వేతనాల దాతలు డాక్టర్ మహిపాల్ రెడ్డి, ఆర్‌కే ఎస్ సుకన్యారెడ్డి, స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ బాలకృష్ణారెడ్డిని సన్మానించారు. కార్యక్రమంలో రెడ్డి జన సంఘం ఆబిడ్స్ ఉపాధ్యక్షుడు ... కార్యదర్శి డాక్టర్ మధుసూదన్‌రెడ్డి, కోశాధికారి వీరారెడ్డి, సభ్యులు తీగల మోహన్ రెడ్డి, మర్రి ప్రభాకర్‌రెడ్డి, భారతి, మర్రి దామోదర్‌రెడ్డి, రావుల శ్రీధర్‌రెడ్డి, జైపాల్ రెడ్డి, బాలాపూర్ మాజీ చైర్మన్ బోయపల్లి రంగారెడ్డి పాల్గొన్నారు.

ముగిసిన వీహెచ్‌పీ న్యాయవాదుల జాతీయ సమావేశాలు

హైదరాబాద్, జూలై 14 (నమస్తే తెలంగాణ): శంషాబాద్‌లోని ముచ్చింతల్ త్రిదండి చిన్నజీయర్‌స్వామి ఆశ్రమంలో రెండు రోజులుగా కొనసాగుతున్న వీహెచ్‌పీ న్యాయవాదుల విభాగం మూడో జాతీయ సమావేశాలు ఆదివారం ముగిశాయి. ప్రభుత్వాల అజమాయిషీ నుంచి హిందూ దేవాలయాల తొలగింపు, జనాభా అసమతుల్యత, రిజర్వేషన్లు, మతమార్పిడి తదితరవాటిపై చర్చించి తీర్మానాలు చేశారు. సమావేశంలో వీహెచ్‌పీ కేంద్రీయ అధ్యక్షుడు అలోక్ కుమార్, సహ ప్రధాన కార్యదర్శి సురేందర్‌జైన్, లీగల్‌సెల్ జాతీయ కన్వీనర్ దిలీప్ త్రివేది, జాతీయ కోకన్వీనర్ అభిషేక్, కో కన్వీనర్ శ్రీనివాస్, 150 మంది ప్రతినిధులు పాల్గొన్నారు.

'మున్నూరుకాపు సంఘాన్ని పటిష్టపరచాలి'

హైదరాబాద్, జూలై 14 (నమస్తే తెలంగాణ): మున్నూరుకాపు సంఘాన్ని గ్రామం నుంచి పటిష్టపరచాలని అపెక్స్ కౌన్సిల్ తీర్మానం చేసింది. ఆదివారం రాజ్యసభ సభ్యుడు, మున్నూరుకాపు సంఘం గౌరవాధ్యక్షుడు వద్దిరాజు రవిచంద్ర అధ్యక్షతన హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో నిర్ణయం తీసుకున్నారు. సమావేశంలో కౌన్సిల్ కన్వీనర్ సర్దార్ పుటం పురుషోత్తమరావు, సభ్యులు కొతు కనకయ్య, సీ విఠల్, బొంతు రామ్మోహన్, ఆకుల రజిత్, నాగేందర్, మణికొండ సుధీర్ కుమార్, విష్ణు జగతి, ఆది విష్ణుమూర్తి, కొత్త లక్ష్మణ్, బసంగాల అనిల్, ఆవుల రామారావు పాల్గొన్నారు.

పాఠశాలలను బలోపేతం చేద్దాం: కోదండరాం

హైదరాబాద్, జూలై 14 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు కృషి చేయాలని ప్రొఫెసర్ కోదండరాం ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. టీచర్ల బదిలీలు, పదోన్నతులతో ప్రభుత్వం పాఠశాలల్లోని అన్ని ఖాళీలను నింపే ప్రయత్నం చేసిందని, ఇక నుంచి బడుల బలోపేతంపై దృష్టిపెట్టాలని సూచించారు. ఆదివారం కాచిగూడలోని ఎస్టీయూ భవన్‌లో రాష్ట్రస్థాయి కార్యక్రమం శిక్షణా శిబిరానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రభుత్వం మ్యానిఫెస్టోలో పొందుపరిచిన విధంగా సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని, బదిలీ అయిన టీచర్లను రిలీవ్ చేయాలని ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఎం పర్వత్‌రెడ్డి, కార్యదర్శి జీ సదానందంగౌడ్ విజ్ఞప్తిచేశారు.

ప్రభుత్వం పేరుతో వచ్చే ఈ-నోటీసులతో జాగ్రత్త

కేంద్రం అడ్వైజరీ



న్యూఢిల్లీ, జూలై 14: ప్రభుత్వ కార్యాలయాల నుంచి అనుమానిత రీతిలో ఈ-మెయిల్ వస్తే అందులోని అటాచ్‌మెంట్‌ను తెరవొద్దని కేంద్ర హోం శాఖ సైబర్ విభాగం ప్రజలను హెచ్చరించింది. సైబర్ నేరగాళ్లు ప్రభుత్వ అధికారుల పేరుతో ఈ-నోటీసులు పంపిస్తూ మోసాలకు పాల్పడుతున్నారని తెలిపింది. gov.inతో అంతమయ్యే అధికారిక ప్రభుత్వ వెబ్‌సైట్ నుంచి వచ్చాయా లేదో చెక్ చేసుకోవాలని సూచించింది. ...

అతి విశ్వాసమే బీజేపీని దెబ్బ తీసింది

- యూపీలో లోక్‌సభ ఫలితాలపై సీఎం యోగి ఆదిత్యనాథ్

లక్నో, జూలై 14: అతి విశ్వాసమే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని దెబ్బతీసిందని ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్ అన్నారు. ... 2014, 2017, 2019 ఎన్నికల్లో విజయం సాధించాం. అయితే 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఓట్లు ప్రతిపక్షానికి బదిలీ అయ్యాయి. ...

ఢిల్లీ దవాఖానలో కాల్పులు.. రోగి మృతి

న్యూఢిల్లీ: ఢిల్లీలోని జీటీబీ హాస్పిటల్‌లో ఓ టీనేజర్ ఆదివారం జరిపిన కాల్పుల్లో ఓ రోగి ప్రాణాలు కోల్పోయారు. ...

30 ఏండ్లకు తెరుచుకున్న ఉమా భగవతి ఆలయం

శ్రీనగర్: జమ్ముకశ్మీర్‌లోని అనంత్‌నాగ్ జిల్లాలో ఉన్న ఉమా భగవతి దేవాలయాన్ని సుమారు 30 ఏండ్ల తర్వాత తిరిగి తెరిచారు. ...

ఆగస్టునాటికి దేశవ్యాప్తంగా 'యూ-విన్'

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా సాధారణ టీకాల కార్యక్రమ ట్రాకింగ్, నమోదు కోసం ఆగస్టు చివరి నాటికి యూ-విన్ పోర్టల్ అందుబాటులోకి రానుందని అధికార వర్గాలు తెలిపాయి. ...

కర్ణాటకలో బస్సు చార్జీల మోత!

- ఏకంగా 20 శాతం మేర పెంపు?
- ప్రభుత్వానికి ప్రతిపాదనలు చేశాం
- కేఎస్ఆర్టీసీ చైర్మన్ శ్రీనివాస్ వెల్లడి
- గత నెల పెట్రోల్, డీజిల్‌పై పన్నును 4 శాతం పెంచిన కాంగ్రెస్ ప్రభుత్వం
- ఏడాదిగా ప్రజలపై పన్నుల మోత
- సిద్ధరామయ్య సర్కార్‌పై జనాగ్రహం



తుమకూరు/బెంగళూరు, జూలై 14: కాంగ్రెస్ పాలిత కర్ణాటకలో సామాన్య ప్రజలపై మరో భారం పడనున్నది. రాష్ట్రంలో త్వరలో బస్సు చార్జీలు భారీ స్థాయిలో పెరగనున్నాయి. దీనిపై కర్ణాటక రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ(కేఎస్ఆర్టీసీ) చైర్మన్ ఎస్.ఆర్ శ్రీనివాస్ ఆదివారం మీడియాతో మాట్లాడుతూ కీలక విషయాలు వెల్లడించారు. ... 'చార్జీల పెంపు తప్పనిసరి' అని శ్రీనివాస్ స్పష్టం చేశారు. ... ప్రజలపై పన్నుల మోత మోగిస్తున్నది. ... గత నెలలో పెట్రోల్, డీజిల్‌పై సేల్స్ ట్యాక్స్‌ను దాదాపు 4 శాతం చొప్పున పెంచింది. దీంతో లీటర్ పెట్రోల్ ధర రూ.3, లీటర్ డీజిల్ ధర రూ.3.02 మేర పెరిగింది. మరోవైపు పాల ధరలను కూడా లీటర్, అర లీటర్ ప్యాకెట్లపై రూ.2 చొప్పున కర్ణాటక మిల్క్ ఫెడరేషన్(కేఎంఎఫ్) పెంచిన విషయం తెలిసిందే.

గత ఏడాదిలో పన్నుల మోత

గ్యారెంటీలకు అడ్డంగా కోతలు

గత ఏడాది అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఐదు గ్యారెంటీల ప్రచారంతో కాంగ్రెస్ ఊదరగొట్టింది. ఆ గ్యారెంటీలను అమలు చేయాలంటే వేలాది కోట్ల రూపాయలు అవసరం. అయితే నిధుల అందుబాటును పరిగణనలోకి తీసుకోకుండా అడ్డగోలుగా హామీలిచ్చిన కాంగ్రెస్.. అధికారం చేపట్టిన తర్వాత ఆయా గ్యారెంటీలకు ఆంక్షలు, కోతలతో ఎగనామం పెడుతున్నది. 'ఉచిత విద్యుత్తు' అంటూ ఊదరగొట్టి చార్జీల పెంపునకు తెరతీసి... 'శక్తి' స్కీమ్‌లో వయసు, వృత్తి అంటూ కొత్త పరిమితులు తెచ్చారని, నిరుద్యోగులకు భృతి కల్పిస్తామన్న 'యువనిధి', పేదలకు ఉచిత బియ్యమన్న 'అన్నభాగ్య' ఇలా ప్రతీ స్కీమ్ లోనూ కోతలు విధిస్తున్నారని ప్రజలు ఆగ్రహంతో రగిలిపోతున్నారు.

నిన్న వాల్మీకి.. నేడు వక్ఫ్ బోర్డ్

- కర్ణాటకలో నిధుల గోల్‌మాల్

బెంగళూరు, జూలై 14: కాంగ్రెస్ పాలిత కర్ణాటకలో అవినీతి బాగోతాలు మెల్లమెల్లగా బయటపడుతున్నాయి. వాల్మీకి కార్పొరేషన్‌లో చోటుచేసుకున్న భారీ కుంభకోణం (రూ.187 కోట్ల కుంభకోణం) మరువకముందే, రాష్ట్ర వక్ఫ్ బోర్డ్‌లో మరో అవినీతి బాగోతం వెలుగులోకి వచ్చింది. ... రూ.4,00,45,465 ... 2016 ... 2024 జూన్ 12న ...

అందరికీ ఇన్సూరెన్స్!

- బీమా చట్టానికి సవరణలు
- బడ్జెట్ సమావేశాల్లో కేంద్రం బిల్లు



న్యూఢిల్లీ: బీమా చట్టం, 1938ని సవరించడం కోసం ఓ బిల్లును రానున్న పార్లమెంటు బడ్జెట్ సమావేశాల్లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టే అవకాశం కనిపిస్తున్నది. 2047నాటికి అందరికీ బీమా కల్పించాలనే లక్ష్యంతో ఈ చట్టాన్ని సవరించబోతున్నట్టు తెలుస్తున్నది. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం, పాలసీదారుల ప్రయోజనాలతోపాటు సులువుగా వ్యాపారం చేయడాన్ని ప్రోత్సహించే విధంగా ఈ సవరణ ఉండబోతున్నట్టు సమాచారం. ... బీమా లేదా సాధారణ బీమా పాలసీలను మార్కెటింగ్ చేసే... 1938నాటి ...

ఎక్స్‌లో 10 కోట్లకు చేరిన మోదీ ఫాలోయర్లు

న్యూఢిల్లీ: ఎక్స్ సామాజిక మాధ్యమంలో ప్రధాని మోదీ రికార్డు సృష్టించారు. ఆయనను ఫాలో అవుతున్నవారి సంఖ్య ఆదివారం 10 కోట్లను దాటింది. ... రాహుల్ గాంధీకి 2.64 కోట్ల మంది ... 3.81 కోట్ల మంది ... 2.15 కోట్ల మంది ఫాలోయర్లు ఉన్నారు.

ముగ్గురు ఉగ్రవాదులు హతం

శ్రీనగర్: జమ్ము కశ్మీర్‌లోని కేరన్ సెక్టార్‌లో ఆదివారం ముగ్గురు ఉగ్రవాదులను భద్రతా దళాలు మట్టుబెట్టాయి. ...

మణిపూర్‌లో మిలిటెంట్ల దాడి

- సీఆర్పీఎఫ్ జవాన్ మృతి

ఇంఫాల్, జూలై 14: మణిపూర్‌లో భద్రతా బలగాలపై మిలిటెంట్లు జరిపిన దాడిలో ఓ సీఆర్పీఎఫ్ జవాన్ ప్రాణాలు కోల్పోయాడు. ... (43) ...

క్రిప్టో కరెన్సీ పేరుతో 20 లక్షలు టోకరా

- హైదరాబాద్‌కు చెందిన పీహెచ్‌డీ స్కాలర్ అరెస్టు

న్యూఢిల్లీ, జూలై 14: క్రిప్టోకరెన్సీ పేరుతో ఢిల్లీకి చెందిన ఓ వ్యక్తి నుంచి రూ.20 లక్షలు కాజేసిన హైదరాబాద్‌కు చెందిన పీహెచ్‌డీ స్కాలర్‌ను ఢిల్లీ పోలీసులు అరెస్టు చేశారు. ... రూ.20.16 లక్షలు ...

ఎస్‌సీఎస్‌ఎస్ అదుర్స్

జూలై-సెప్టెంబర్ వడ్డీరేటు ఆకర్షణీయం



రిటైర్మెంట్ తర్వాత ఆర్థిక భద్రతను కల్పించడంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం తెచ్చినదే సీనియర్ సిటిజన్ సేవింగ్ స్కీం (ఎస్‌సీఎస్‌ఎస్). దీని వడ్డీరేటును 3 నెలలకోసారి కేంద్రం సమీక్షించి ఓ నిర్ణయం తీసుకుంటుంది.

ఎవరు పెట్టుబడి పెట్టవచ్చు?

60 ఏండ్లు, అపై వయసు కలిగినవారు ఎస్‌సీఎస్‌ఎస్‌లో పెట్టుబడి పెట్టవచ్చు. అలాగే స్వచ్ఛందంగా లేదా స్పెషల్ వాలంటరీ స్కీంలో భాగంగా రిటైరైన 55 ఏండ్లపైబడినవారూ అర్హులే. సివిల్ డిఫెన్స్ సిబ్బంది మినహా రక్షణ సర్వీసుల నుంచి రిటైరైన ఉద్యోగులకూ ఈ పథకం వర్తిస్తుంది.

ప్రస్తుత వడ్డీరేటు

ఈ జూలై-సెప్టెంబర్ త్రైమాసికానికిగాను డిపాజిట్లు చేసేవారికి 8.2 శాతం వడ్డీరేటు వస్తుంది. ప్రతి మూడు నెలలకోసారి వడ్డీ చెల్లింపులుంటాయి. ఏటా మార్చి 31, జూన్ 30, సెప్టెంబర్ 30, డిసెంబర్ 31 తేదీల్లో త్రైమాసికపు చెల్లింపులుంటాయి.

డిపాజిట్ పరిమితి

కనిష్ఠంగా 1,000, గరిష్ఠంగా రూ.30 లక్షలదాకా డిపాజిట్ చేసుకోవచ్చు. ఖాతాలో ఒకవేళ పరిమితికి మించి నగదు డిపాజిట్లు జరిగితే.. ఆ మొత్తాలను ఖాతాదారుకు వెంటనే రిఫండ్ చేయడం జరుగుతుంది. అయ్యినైతే డిపాజిట్ చేసిన దగ్గర్నుంచి రిఫండ్ ఇచ్చేదాకా పట్టిన సమయానికిగాను సదరు మొత్తాలు పోస్టాఫీస్ సేవింగ్స్ అకౌంట్ వడ్డీరేటును లెక్కించి ఇస్తారు.

కాలవ్యవధి

డిపాజిట్ కాలపరిమితి ఐదేండ్లు. అపై మరో మూడేండ్లు పొడిగించుకోవచ్చు. ఇలా ఎన్నేండ్లైనా పెంచుకుంటూపోవచ్చు. ప్రతి పొడిగింపునకు ఓ దరఖాస్తును సమర్పించాలి. కాలపరిమితి ముగింపు దరిలోనే ఇవ్వాలి.

పన్ను లాభాలు

ఆదాయ పన్ను (ఐటీ) చట్టం 1961లోని సెక్షన్ 80సీ కింద పన్ను ప్రయోజనాలు అందుతాయి. ఆర్థిక సంవత్సరంలో రూ.50 వేలకు మించి వడ్డీ ఆదాయం వచ్చినప్పుడే పన్నులు వర్తిస్తాయి. నిబంధనలకు లోబడి ఫామ్ 15జీ/15హెచ్ సమర్పిస్తే టీడీఎస్ ఉండదు.

ముందస్తు ఉపసంహరణలపై..

కొత్త మార్గదర్శకాల ప్రకారం ఏడాదిలోగా ఎస్‌సీఎస్‌ఎస్ డిపాజిట్ ఖాతాను మూసేస్తే.. సదరు డిపాజిట్‌లో 1 శాతానికి సమానమైన మొత్తాలను ఇన్వెస్టర్లు కోల్పోవాల్సి వస్తుంది. అలాగే పూర్తి కాలపరిమితికన్నా ముందే చేసే ఉపసంహరణలపైనా పెనాల్టీలు వర్తిస్తాయని గుర్తుంచుకోవాలి.



ఇలా ప్రయత్నిస్తే పన్ను ఆదా..

ఆదాయ పన్ను రిటర్న్స్ (ఐటీఆర్) దాఖలుకు సమయం ఆసన్నమైంది. దీంతో పన్ను ఆదా ఎలా? అన్న ప్రశ్న మళ్లీ అందరి మదిలో మెదులుతున్నది. అయితే ఇందుకు కొన్ని మార్గాలున్నాయి. వాటిలో.. ఈపీఎఫ్, పీపీఎఫ్, ఎఫ్‌డీ, ఎల్‌ఐసీ పాలసీలు, ఈఎల్‌ఎస్‌ఎస్, ఎన్‌పీఎస్ తదితర పెన్షన్ ప్లాన్లలో పెట్టుబడులు కొన్ని. ఏటా రూ.1.5 లక్షల దాకా పన్ను మినహాయింపులను పొందవచ్చు. అలాగే ఉద్యోగులు వీలుంటే హెచ్ఆర్‌ఏతోపాటు టెలిఫోన్/ఇంటర్నెట్ ఖర్చుల రీయింబర్స్‌మెంట్, ఎడ్యుకేషన్ అలవెన్సులు, ఫుడ్ కూపన్స్‌ను ఎంచుకోవచ్చు. ఈపీఎఫ్ వితాలను పెంచుకోవడం కూడా కలిసొచ్చే అంశమే. ఇల్లు కొనే ఆలోచన ఉంటే.. గృహ రుణంపై పన్ను ప్రయోజనాలను అందుకోవచ్చు. ఐటీ చట్టంలోని సెక్షన్ 80డీ కింద లక్షన్నర రూపాయల వరకు లాభం పొందవచ్చు. వ్యక్తిగతంగా, కుటుంబ సభ్యుల పేరిట తీసుకొనే ఆరోగ్య బీమాలకు చెల్లించే ప్రీమియంలపైనా రూ.50,000 వరకు పన్ను తగ్గింపులను కోరవచ్చు.



ఆర్థిక ఫలితాలే దిక్సూచి

మార్కెట్ పల్స్

దేశీయ స్టాక్ మార్కెట్లలో గత వారం కూడా కొత్త రికార్డులు నమోదయ్యాయి. సూచీలు తీవ్ర ఒడిదొడుకులకు లోనైనా.. ఓవరాల్‌గా లాభాలనే అందుకున్నాయి. ఆల్‌టైమ్ హైలోనూ ఇన్వెస్టర్లు పెట్టుబడులకే మొగ్గు చూపారు. దీంతో ఈక్విటీ మార్కెట్లు మునుపెన్నడూ లేని స్థాయిల్లోనే స్థిరపడ్డాయి. ఈ క్రమంలోనే అంతకుముందు వారం ముగింపుతో చూస్తే బాంబే స్టాక్ ఎక్స్చేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 522.74 పాయింట్లు ఎగిసి 80 వేలకు ఎగువన 80,519.34 వద్ద నిలిచింది. అలాగే నేషనల్ స్టాక్ ఎక్స్చేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ 178.30 పాయింట్లు ఎగబాకి 24,502.15 దగ్గర ముగిసింది. సెన్సెక్స్ 80,500 మార్కును, నిఫ్టీ 24,500 స్థాయిని దాటి ఆగడం ఇదే తొలిసారి. ఐతే ఈ వారం మదుపరులు ఆయా సంస్థల త్రైమాసిక ఆర్థిక ఫలితాల ఆధారంగా తమ పెట్టుబడులపై నిర్ణయం తీసుకునే వీలున్నది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి (2024-25)గాను తొలి త్రైమాసికం ఏప్రిల్-జూన్‌కు కంపెనీలు తమ ఫైనాన్షియల్ రిజల్ట్స్‌ను ప్రకటిస్తున్నారు. దీంతో ఈ వారం మార్కెట్ సరళిని ఇవి అత్యంత ఎక్కువగా ప్రభావితం చేయవచ్చని అంటున్నారు. కాగా, గ్లోబల్ స్టాక్ మార్కెట్లు, విదేశీ సంస్థాగత మదుపరుల పెట్టుబడులు, అంతర్జాతీయ పరిణామాలు, డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ ఎప్పట్లాగే ఈ వారం కూడా భారతీయ స్టాక్ మార్కెట్ల తీరును నిర్దేశించనున్నాయి. అమ్మకాల ఒత్తిడి ఎదురైతే నిఫ్టీకి 24,200 పాయింట్ల స్థాయి కీలకమైనదవుతోవచ్చు. దీనికి దిగువన మున్ముందు 23,900 పాయింట్ల స్థాయిని మద్దతుగా చెప్పుకోవచ్చని ఆర్థిక నిపుణుల మాట. అయితే సూచీలు పరుగందుకుంటే ఈ వారం 24,700-24,900 మధ్యకు నిఫ్టీ వెళ్లవచ్చని కూడా చెప్తున్నారు.

ఆర్బీఐ రిటైల్ డైరెక్ట్ స్కీం

మదుపరుల కోసం రిజర్వ్ బ్యాంక్ తెచ్చిన పథకం



రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) 2021 నవంబర్‌లో పరిచయం చేసిన పథకమే రిటైల్ డైరెక్ట్ స్కీం. నేరుగా ప్రభుత్వ సెక్యూరిటీల్లో పెట్టుబడి పెట్టేందుకు వ్యక్తులు/రిటైల్ ఇన్వెస్టర్ల కోసం ఇదో వన్-స్టాప్ సొల్యూషన్‌గా వచ్చింది. అంతకుముందు ఈ పెట్టుబడి సౌకర్యం సంస్థాగత మదుపరులకే ఉండేది. అప్పట్లో మ్యూచువల్ ఫండ్స్ ద్వారానే ప్రభుత్వ బాండ్లను రిటైల్ ఇన్వెస్టర్లు కొనాల్సి వచ్చేది. కానీ ఇప్పుడు ఆర్బీఐ వెబ్‌సైట్‌పై అందుబాటులో ఉండే రిటైల్ డైరెక్ట్ స్కీం ద్వారా స్వల్ప, దీర్ఘకాలిక ప్రభుత్వ బాండ్లను రిటైల్ ఇన్వెస్టర్లు కొనవచ్చు. పెట్టుబడుల కాలపరిమితుల ఆధారంగా రాబడులుంటాయి. అయితే ఈ స్కీం ద్వారా పొందే వడ్డీ ఆదాయానికి పన్నులు వర్తిస్తాయి. ఈ స్కీం కోసం బ్యాంకులు లేదా ఆర్బీఐ ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు.

ఏయే సెక్యూరిటీల్లో పెట్టుబడులు?

ఈ పథకం కింద 4 రకాల ప్రభుత్వ సెక్యూరిటీల్లో ఇన్వెస్టర్లు పెట్టుబడి పెట్టవచ్చు. అవి..

ప్రభుత్వ సెక్యూరిటీలు (జీ-సెక్)

తేదీతో కూడిన కేంద్ర ప్రభుత్వ సెక్యూరిటీలు ఫిక్స్‌డ్ లేదా ఫ్లోటింగ్ కూపన్ వడ్డీరేట్లను కలిగి ఉంటాయి. 6 నెలల ప్రాతిపదికన ముఖ విలువ ఆధారంగా చెల్లింపులు జరుగుతాయి. సాధారణంగా వీటి కాలపరిమితి 5 ఏండ్ల నుంచి 40 ఏండ్లదాకా ఉంటుంది. ప్రారంభ పెట్టుబడి రూ.10,000.

రాష్ట్ర అభివృద్ధి రుణాలు

కేంద్ర ప్రభుత్వ సెక్యూరిటీల మాదిరిగానే నిధుల అవసరం ఉన్నప్పుడు రాష్ట్ర ప్రభుత్వం కూడా మార్కెట్ నుంచి రుణాలను సమీకరిస్తుంది. వీటినే రాష్ట్ర అభివృద్ధి రుణాలుగా పిలుస్తారు. ఈ పథకంలో కనీస పెట్టుబడి రూ.10,000. గరిష్ఠ కాలపరిమితి పదేండ్లు.

ప్రభుత్వ ట్రెజరీ బిల్లులు

ట్రెజరీ బిల్లులు లేదా టీ-బిల్స్ అనేవి.. మనీ మార్కెట్ సాధనాలు. కేంద్ర ప్రభుత్వం జారీచేసే స్వల్పకాలిక రుణ సాధనాలుగా కూడా పరిగణిస్తారు. ఇందులో కనీస పెట్టుబడి రూ.25,000. 91 రోజులు, 182 రోజులు, 364 రోజుల కాలపరిమితిని కలిగి ఉంటాయి.

సావరిన్ గోల్డ్ బాండ్లు (ఎస్‌జీబీ)

గ్రాముల రూపంలో బంగారం లెక్కన ఉండేవే ఈ సావరిన్ గోల్డ్ బాండ్లు. వీటిని భౌతిక బంగారానికి ప్రత్యామ్నాయ పెట్టుబడిగా చూడవచ్చు. నగదు రూపంలో ఇష్యూ ధరను ఇన్వెస్టర్లు చెల్లించాల్సి ఉంటుంది. మెచ్యూరిటీ సమయంలో తిరిగి నగదు రూపంలోనే అందుకోవచ్చు. కేంద్ర ప్రభుత్వం తరఫున వీటిని ఆర్బీఐ జారీ చేస్తుంది. కనీస పెట్టుబడి 1 గ్రాము బంగారం. గరిష్ఠం 4 కిలోలు. పెట్టుబడి కాలపరిమితి 8 ఏండ్లు. అయితే ఐదేండ్ల తర్వాత ఎప్పుడైనా తీసుకోవచ్చు.

ప్రయోజనాలు

- ఖాతాను తెరిచేందుకు ఖర్చుండదు.
- పోర్ట్‌ఫోలియో వైవిధ్యం.
- క్రయవిక్రయాలకు అందుబాటులో ప్రైమరీ, సెకండరీ మార్కెట్లు.
- స్థిరమైన, ఆకర్షణీయమైన రాబడులు.
- వ్యక్తుల అవసరాలకు తగ్గట్టు రకరకాల మెచ్యూరిటీల్లో ప్రభుత్వ సెక్యూరిటీలు.
- క్రెడిట్ రిస్క్ ఉండదు.
- సురక్షిత పెట్టుబడులు.




ఆర్డీజీ ఖాతాతో..

ఆర్బీఐ రిటైల్ డైరెక్ట్ స్కీం కింద, ప్రభుత్వ సెక్యూరిటీల్లో పెట్టుబడులు పెట్టడానికి రిటైల్ డైరెక్ట్ గిల్ట్ (ఆర్డీజీ) అకౌంట్‌ను ఇండివిడ్యువల్ ఇన్వెస్టర్లు తెరవాల్సి ఉంటుంది. ఇది కూడా డీమ్యాట్ ఖాతా తరహాలోనే ఉంటుంది. భారత పౌరులతోపాటు ప్రవాస భారతీయులూ (ఎన్నారై) ఖాతాను తెరవవచ్చు. అయితే ఎన్నారైలు విదేశీ మారకపు నిర్వహణ చట్టం (ఫెమా) నియంత్రణలో ఉంటారు. అలాగే ఎస్‌జీబీల్లో పెట్టుబడులు పెట్టలేరు. ఇక ఖాతాను తెరిచేందుకు అవసరమైన వాటిలో..

- ఆధార్‌తో లింకైన మొబైల్ నెంబర్.
- నెట్-బ్యాంకింగ్/యూపీఐ ఉన్న సేవింగ్స్ బ్యాంక్ రూపీ అకౌంట్.
- ఒరిజినల్ పాన్ కార్డు.
- ఖాతాదారుడి సంతకం స్కాన్ ఇమేజ్.
- ఈ-మెయిల్, కేవైసీ ధ్రువీకరణలు.

విశ్వంభర స్వరాలవేట



ఒకప్పుడు సినిమా మ్యూజిక్ సిట్టింగ్స్ అంటే ఓ పండుగలా జరిగేది. సంగీత దర్శకుడు, గీత రచయిత, దర్శకుడు, నిర్మాత, గాయనీగాయకులు, హీరో.. ఇలా అందరూ కూర్చొని ఒకరి అభిప్రాయాలను ఒకరు పంచుకుంటూ మంచి ఆల్బమ్ వచ్చే వరకూ కసరత్తులు చేసేవారు. ఇప్పుడైతే ఆ పరిస్థితి లేదు. సంగీతం, సాహిత్యం అన్నీ ఫోన్లలోనే వినడం, ఫోన్లోనే ఓకే చేయడం. అయితే.. 'విశ్వంభర' టీమ్ ఈ పద్ధతికి ఫుల్‌స్టాప్ పెట్టి, పాత విధానానికి శ్రీకారం చుట్టింది. బెంగళూరులోని కీరవాణి ఫామ్ హౌస్‌లో చిరంజీవి, కీరవాణి, దర్శకుడు వశిష్ఠ, గీత రచయిత చంద్రబోస్, గాయకుడు రాహుల్ సిప్లిగంజ్ అంతా కలిసి మ్యూజిక్ సిట్టింగ్స్‌లో కూర్చుని అద్భుతమైన ఆల్బమ్‌ని రాబట్టేందుకు కృషి చేస్తున్నారు. షూటింగ్‌కి బ్రేక్ రావడంతో ఈ సమయాన్ని మ్యూజిక్ సిట్టింగ్స్ కోసం వాడుకుంటున్నారు మూవీ టీమ్. వారంరోజుల పాటు వీరంతా అక్కడే ఉండి 'విశ్వంభర' పాటల పనిపట్టి తిరిగొస్తారట. చిరంజీవి నటించిన ఘరానామొగుడు, ఆపద్బాంధవుడు, ఎస్పీ పరశురామ్ చిత్రాలకు కీరవాణి స్వరాలందించారు. మ్యూజికల్‌గా మూడు సినిమాలూ ఆకట్టుకున్నాయి. 'విశ్వంభర' నాలుగో సినిమా. ఎలాగైనా మంచి పాటలు ఇవ్వడానికి కీరవాణి మనసుపెట్టి పనిచేస్తున్నారు. త్రిష కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రం జనవరి 10న సంక్రాంతి కానుకగా విడుదల కానుంది.

మా ఊరి జాతరలో..



ఉద్వేగపూరితమైన పాత్రలో అల్లరి నరేశ్ నటిస్తున్న చిత్రం 'బచ్చలమల్లి'. సుబ్బు మంగదేవి దర్శకత్వంలో, 'హాస్య మూవీస్' పతాకంపై రాజేశ్ దండ, బాలాజీ గుత్తా కలిసి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమా నిర్మాణం తుదిదశకు చేరుకుంది. ఈ సందర్భంగా మ్యూజికల్ ప్రమోషన్స్‌ని మేకర్స్ స్టార్ట్ చేశారు. ఇందులో భాగంగా ఈ నెల 16న ఈ సినిమాలోని ఫస్ట్ సింగిల్ 'మా ఊరి జాతరలో' పాటను విడుదల చేయనున్నారు. విశాల్ భరద్వాజ్ ఈ పాటకు స్వరకర్త. మునుపెన్నడూ చూడని కొత్త అవతారంలో ఇందులో అల్లరి నరేశ్ కనిపిస్తారని మేకర్స్ చెబుతున్నారు. అమృత అయ్యర్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో రోహిణి, రావు రమేశ్, అచ్యుత్‌కుమార్, బలగం జయరామ్, హరితేజ, ప్రవీణ్, వైవా హర్ష ఇతర పాత్రధారులు. ఈ చిత్రానికి కెమెరా: రిచర్డ్ ఎం.నాథన్.

ముఖ్యపాత్రల్లో మెరవనున్నారు



సిద్ధార్థ్ హీరోగా తెలుగు, తమిళ భాషల్లో ఓ సినిమా రూపొందనుంది. ఇది సిద్ధార్థ్ 40వ సినిమా కావడం విశేషం. శ్రీగణేశ్ దర్శకుడు. అరుణ్‌విశ్వ నిర్మాత. ఈ సినిమాలో సీనియర్ స్టార్స్ శరత్‌కుమార్, దేవయాని కీలక పాత్రలు పోషించనున్నారు. ఈ విషయాన్ని ఆదివారం మేకర్స్ ప్రకటించారు. ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించిన స్క్రిప్ట్ వర్క్ జరుగుతున్నది. హైబడ్జెట్, టాప్ ప్రొడక్షన్ వాల్యూస్‌తో రూపొందనున్న ఈ సినిమాకు సంబంధించిన ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలు త్వరలో తెలియనున్నాయి.

అందుకే ఒళ్లు దగ్గరపెట్టుకొని చేస్తున్నా

చిత్రం



అంబానీ ఇంట పెళ్లివేడుకలో బంగారంలా మెరిసిపోయింది జాన్వీకపూర్. అక్కడ అందరి దృష్టి ఈ అందాలభామ పైనే. బంగారు రంగు డ్రెస్‌లో జాన్వీని చూసిన వారంతా కళ్లు తిప్పుకోలేకపోయారట. ఇదిలావుంటే.. ఇటీవల ముంబయిలోని ఓ ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొన్న జాన్వీ.. ఓ నేషనల్ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో టాలీవుడ్ గురించి ఆసక్తికరంగా మాట్లాడింది. ''దేవర-1' టాలీవుడ్‌లో నా తొలి సినిమా. అమ్మమ్మ తెలుగు. అమ్మ ఎక్కువ సినిమాలు చేసింది కూడా తెలుగులోనే. అందుకే.. కొత్తగా ఏం అనిపించలేదు. అప్పుడప్పుడు అమ్మ చుట్టాలతో తెలుగులో మాట్లాడుతుంటే చూసేదాన్ని. అందుకే తెలుగులో డైలాగులు చెప్పడం కష్టం అనిపించలేదు. సెట్‌లో అందరూ నన్ను ప్రత్యేకంగా చూడటం.. వయసులో చిన్నదాన్ని అయినా గౌరవించడం.. ఇవన్నీ మొదట్లో కాస్త ఇబ్బంది అనిపించింది. తర్వాత అర్థమైంది.. అదంతా అమ్మ ప్రభావం అని. తెలుగువాళ్లు అమ్మను ఎంత గౌరవిస్తారో, ఎంత ఆరాధిస్తారో సెట్‌లో వాళ్లిస్తున్న గౌరవం చెప్పకనే చెబుతోంది. తెలుగులో తారక్ నా తొలి హీరో కావడం నిజంగా ఆనందంగా ఉంది. తను గొప్ప నటుడు. అందుకే ఒళ్లు దగ్గర పెట్టుకొని చేస్తున్నా. రామ్‌చరణ్ సినిమా ఇంకా మొదలవ్వలేదు. తనతో నటించేరోజు కోసం ఎదురుచూస్తున్నా. టాలీవుడ్‌లో మంచి అవకాశాలొస్తే వదులుకోను. ఎందుకంటే అది నా మదర్ ఇండస్ట్రీ.' అని ఆనందం వెలిబుచ్చింది జాన్వీ కపూర్.

కొత్త సినిమాకు క్రేజీ టైటిల్?



'కల్కి 2898ఏడీ'తో వెయ్యికోట్ల మైలు రాయిని దాటేసి, రికార్డుల్ని వేటాడే పనిలో ఉన్నారు ప్రభాస్. ఎక్కడ చూసినా ఇంకా 'కల్కి' ఫీవరులోనే ఉంది. మరి ఈ వేడుక ఫుల్‌స్టాప్ ఎక్కడ పడుతుందో తెలియాలి. ఇదిలావుంటే.. ప్రభాస్ తాజా సినిమాకు సంబంధించిన క్రేజీ అప్‌డేట్ ఒకటి ఫిల్మ్ సర్కిల్స్‌లో బలంగా వినిపిస్తున్నది. 'సీతారామం'ఫేం హను రాఘవపూడి దర్శకత్వంలో ప్రభాస్ ఓ చిత్రం చేయనున్న విషయం తెలిసిందే. ప్రతిష్ఠాత్మక మైత్రీమూవీమేకర్స్ నిర్మించనున్న ఈ సినిమాకు 'ఫౌజీ' అనే టైటిల్ అనుకుంటున్నట్టు తెలుస్తున్నది. ఫౌజీ అంటే సైనికుడు అని అర్థం. ఈ సినిమాలో ప్రభాస్ సైనికుడిగా కనిపించనున్నారట. అందుకే ఈ టైటిల్ బావుంటుందని యూనిట్ భావిస్తున్నది. స్వాతంత్య్రానికి పూర్వం జరిగే కథతో దర్శకుడు హను రాఘవపూడి ఈ సినిమాను తెరకెక్కించనున్నారట. బ్రిటీష్‌వారి సైనికుడిగా ఇందులో ప్రభాస్ కనిపించనున్నారట. ఇందులో కథానాయికగా మృణాల్‌ఠాకూర్ ఖరారైనట్టు వార్తలు వస్తున్నాయి. విశాల్ చంద్రశేఖర్ ఈ సినిమాకు బాణీలు సమకూరుస్తున్నారు.

నెక్ట్స్ ఎవరితో?



'గుంటూరుకారం' తర్వాత త్రివిక్రమ్ ఎవరితో సినిమా చేసేదీ క్లారిటీ రాలేదు. 'గుంటూరుకారం' నిర్మాణంలో ఉన్నప్పుడు నెక్ట్స్ సినిమా బన్నీతో అని వార్తలొచ్చాయి. అయితే షూటింగ్ పూర్తవ్వకపోవడంతో 'పుష్ప2' డిసెంబర్ 6కు వాయిదా పడింది. దాంతో త్రివిక్రమ్ కథ మళ్లీ మొదటికొచ్చింది. అంతేకాకుండా 'పుష్ప'తో అల్లు అర్జున్ ఇమేజ్ పానిండియా స్థాయికి చేరుకుంది. దాంతో త్రివిక్రమ్‌ని కూడా ఆ స్థాయి కథనే సిద్ధం చేయమని అల్లు కాంపౌండ్ చెప్పిందట. దానికి గురూజీ కొంత టైమ్ అడిగినట్టు ఇన్‌సైడ్ టాక్. ప్రస్తుతం ప్రధమశ్రేణి హీరోలంతా పాన్ ఇండియా స్థాయిలో ఆలోచిస్తున్న నేపథ్యంలో, ఇప్పుడు త్రివిక్రమ్ ఆ స్థాయి కథనే సిద్ధం చేసుకోవాల్సిన పరిస్థితి. ఇదిలావుంటే.. రామ్ పోతినేనితో ఎప్పట్నుంచో సినిమా చేయాలనుకుంటున్నారు త్రివిక్రమ్. ఎందుకంటే నిర్మాత స్రవంతి రవికిశోర్ తీసిన సినిమాలే త్రివిక్రమ్‌ని స్టార్‌ని చేశాయి. దర్శకుడిగా ఆయన తొలి సినిమా కూడా స్రవంతి మూవీస్ కావడం గమనార్హం. ఆ రుణం తీర్చుకునేందుకే రవికిశోర్ తమ్ముడి తనయుడైన రామ్ పోతినేని హీరోగా ఓ సినిమా చేయాలనుకుంటున్నారట త్రివిక్రమ్. బయట టాక్ అయితే ఇలావుంది. మరి త్రివిక్రమ్ అంతరంగం ఎలావుందో.

టాలీవుడ్‌లో చేయడానికి రెడీ



ఇటీవలే 'సర్ఫిరా'తో ప్రేక్షకుల ముందుకు వచ్చారు అక్షయ్‌కుమార్. సుధా కొంగర దర్శకత్వంలో తమిళ సినిమా 'సూరారై పోట్రు' ఆధారంగా రూపొందిన ఈ సినిమా ప్రస్తుతం థియేటర్లలో ఆడుతున్నది. సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా అక్షయ్ ఇచ్చిన ఇంటర్వ్యూలో టాలీవుడ్ ఎంట్రీ గురించి మాట్లాడారు. 'తెలుగులో 'కన్నప్ప' సినిమా చేస్తున్నాను. ప్రస్తుతం టాలీవుడ్ మేకర్స్ కొత్తగా ఆలోచిస్తున్నారు. అందుకే వారి సినిమాలు జాతీయ స్థాయిలో విజయాలను అందుకుంటున్నాయి. ఇప్పుడు ఏ భాషలో నటించినా దేశం మొత్తం చూస్తున్నారు. అందుకే తెలుగు మేకర్స్‌తో పనిచేయాలని ఉంది. 'కన్నప్ప' తర్వాత నేను చేయదగ్గ పాత్రలు తెలుగులో దొరికితే తప్పకుండా నటిస్తా.' అని చెప్పుకొచ్చారు అక్షయ్. ఇది టాలీవుడ్ దర్శకులకు, రచయితలకూ ఓ మంచి వార్తే అని చెప్పక తప్పదు. కథ నచ్చితే చిన్న సినిమా అయినా చేసేయడం అక్షయ్ స్టైల్. మిగతా హీరోలకు ఆయన పూర్తి భిన్నం. ఏడాదికి ఐదారు సినిమాలు ఇప్పటికీ చేస్తుంటారు. ఇప్పుడు తెలుగులో చేయడానికి రెడీ అన్నారు. ఆయన నిర్ణయం వల్ల తెలుగులో మరెన్నో మంచి కథలు తయారయ్యే అవకాశం లేకపోలేదు.

48గంటల్లో జరిగే ఫిక్షన్ డ్రామా



'ఐదుగురు స్నేహితుల్లో ఒకరు ఓ ఇన్సిడెంట్‌లో చనిపోతారు. మిగతా నలుగురూ ఆ సిట్యుయేషన్‌ను ఎలా హ్యాండిల్ చేశారు? పోలీసుల నుంచి ఎలా తప్పించుకున్నారు.? ఒకవేళ అరెస్ట్ అయితే ఎలా బయటపడ్డారు? అనే ఆసక్తికరమైన ప్రశ్నల సమాహారం ఈ సినిమా. నిజంగా జరిగిన సంఘటన ఆధారంగా తెరకెక్కిన సినిమా ఇది. నాక్కూడా ఈ తరహా కథలంటే ఇష్టం. వినగానే నచ్చేసింది. అందుకే ఒప్పుకున్నా' అని 'బిగ్‌బాస్' ఫేం రవికృష్ణ అన్నారు. ఆయన కథానాయకుడిగా నటించిన థ్రిల్లర్ మూవీ 'ది బర్త్‌డే బాయ్'. సమీర్ మల్లా, రాజీవ్ కనకాల కీలక పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి విస్కీ దర్శకుడు. ఐ.భరత్ నిర్మాత. ఈ నెల 19న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా ఆదివారం రవికృష్ణ విలేకరులతో ముచ్చటించారు. 'నా ఫైనల్ గోల్ సినిమాల్లో నటించడం. నాకు సినిమాలంటే పిచ్చి. అన్ని తరహా పాత్రలు చేసి నటుడిగా గుర్తింపు తెచ్చుకోవడం నా ఆశయం. అందుకే మంచి అవకాశాలకోసం ఎదురుచూశా. 'విరూపాక్ష' తర్వాత అవకాశాలు బాగా వస్తున్నాయి. ఇందులో ఐదుగురు స్నేహితుల్లో ఒకడి సోదరుడి పాత్ర నాది. ఫుల్‌లెంగ్త్ ఉంటుంది. ఒక బ్రూ ఎమోషన్, బ్రూ డ్రామా తప్పకుండా ప్రేక్షకులను అలరిస్తుంది. 48 గంటల్లో జరిగే ఈ కథలో ఫిక్షన్ డ్రామా ఉత్కంఠభరితంగా ఉంటుంది.' అని తెలిపారు రవికృష్ణ. వందరోజుల 'విరూపాక్ష'లో కీలక పాత్ర పోషించడం తన అదృష్టమని, ఆ సినిమా టైమ్‌లోనే ఈ అవకాశం వచ్చిందని, 'విరూపాక్ష'లో మంచి పాత్ర ఇచ్చి ప్రోత్సహించిన దర్శకుడు కార్తీక్‌వర్మ దండు, సుకుమార్, సాయిదుర్గతేజ్‌లకు కృతజ్ఞతలని రవికృష్ణ చెప్పారు.

జిందగీ
చింతన
నమస్తే తెలంగాణ హైదరాబాద్
సోమవారం 15 జూలై 2024
www.ntnews.com



మంగళవారం నుంచి దక్షిణాయనం

ప్రతిరోజూ ఆధ్యాత్మిక పర్వమే!

కాలగణన గణితానికీ అంతుబట్టదు. రెప్పపాటులో జరిగిపోయే కాలానికి కళ్లెం వేయడం బ్రహ్మతరం కూడా కాదు. కాలం ఆధారంగా జీవనయానం చేసే మనుషుల కోసం మన రుషులు ఎంతో శోధించారు. కాలాన్ని గణించి.. కాలానుగుణంగా రుతువులుగా విభజించి ప్రకృతి ధర్మాన్ని అర్థం చేశారు. ఉత్తర, దక్షిణాయనాలుగా విడదీసి ఏ అయనంలో ఎటుగా పయనించాలో నిర్దేశించారు. ఇప్పుడు దక్షిణాయనానికి వేళ అయింది. ప్రకృతి విలక్షణంగా మారిపోయింది. ఉత్తరాయణం ముక్తికి మార్గమైతే.. ఆ దారికి చేరుకునే శక్తిని ప్రసాదించే పవిత్ర కాలం దక్షిణాయనం. ఈ పుణ్యకాలాన్ని ఆధ్యాత్మిక ప్రయాణానికి వినియోగించుకోవాలి.

దక్షిణాయనం దేవతలకు రాత్రి సమయంగా చెబుతారు. రాత్రివేళ దుష్టశక్తుల బలం పుంజుకుంటాయి. దైవశక్తి కొంత సన్నగిల్లుతుంది. ప్రతికూల శక్తుల ప్రభావం తగ్గించుకుంటూ ఉండాలంటే మానవ ప్రయత్నం అనివార్యం. దేవతల ప్రీత్యర్థం జపతపాలు చేయడం అత్యావశ్యకం. పారమార్థిక చింతన ఉన్నవారికి పర్వాలతో పనిలేదు. లౌకిక జీవనం కొనసాగించేవారికి అది సాధ్యపడదు. అందుకే, దక్షిణాయనంలో ప్రతినెలా విశేష పర్వదినాలు ఉండేలా మన రుషులు మార్గనిర్దేశం చేశారు. ఆషాఢం మొదలుకొని మార్గశిరం వరకు విశేష ఉత్సవాలు ఉండేలా పండుగలు వస్తుంటాయి.

ప్రతి నెలా పండుగలే..

దక్షిణాయనంలో మొదటి పండుగ ఆషాఢ శుక్ల ఏకాదశి. దీనినే తొలి ఏకాదశి అనీ, దేవశయన ఏకాదశి అనీ అంటారు. ఆనాటి నుంచి కార్తిక శుక్ల ద్వాదశి వరకు శ్రీమహావిష్ణువు యోగనిద్రలో ఉంటారు. స్థితికారుడు నిద్రపోవడం ఏంటి? బదులిచ్చేదెవరికీ మనుషులు పోయేలాంటి నిద్ర కాదిది. శ్రీహరిది యోగనిద్ర. నిద్రాకాలంలోనూ జాగ్రత్స్థితిలోనే ఉంటారు దేవాదిదేవుడు. తన స్థితికార్యాన్ని నిర్విఘ్నంగా కొనసాగిస్తూనే.. తపోనిష్ఠలో మునిగిపోతారు. అలా పాలకడలిలోని శేషతల్పం నుంచి వచ్చే ధనాత్మక తరంగాలు ఈ విశ్వానికి రక్షణ ఛత్రంలా కాపుకాస్తాయని పూర్వీకుల విశ్వాసం. ఆషాఢ పౌర్ణమి అత్యంత ప్రభావవంతమైన పర్వదినం. **విష్ణురూపంగా** భావించే వ్యాస మహర్షి జన్మించిన తిథి ఇదేనని. వేదాలను విభజించి, పంచమవేదమైన భారతాన్ని అందించి, అష్టాదశ పురాణాలు లిఖించి, భక్తి భావనకు ఆయువుపట్టుగా భావించే భాగవతాన్ని రచించి.. జగతిని జాగృతం చేసిన జగద్గురువు ఆ మహానీయుడు. వ్యాస మహర్షిని స్మరిస్తూ.. ఆయన ప్రతిరూపంగా గురువులను పూజించుకునే పండుగ ఇది. సాధకులు తమ తపోబలాన్ని పెంచుకునేందుకు అనువైన తిథి.
దక్షిణాయనంలో వచ్చే మాసాల్లో పవిత్రమైనది శ్రావణం. శివరూపంగా పిల్చే శ్రావణంలో మంగళగౌరి, మహాలక్ష్మి దేవతల పూజలు ఇంటింటా జరుగుతాయి. శ్రావణ వ్రతాలు ఆచరించడం వెనుక లౌకిక విశేషాలూ కనిపిస్తాయి. మనది వ్యవసాయ ఆధారిత దేశం. శ్రావణంలో వర్షాలు సమృద్ధిగా కురుస్తుంటాయి. వ్యవసాయ పనులు జోరందుకుంటాయి. పూర్వం మగవాళ్లు శ్రావణం వచ్చిందంటే.. పొలం పనుల్లోనే నిమగ్నమయ్యేవారు. కర్షకవృత్తిలో ఉన్న పతులకు దైవీబలం సంప్రాప్తించాలనే భావనతో భార్యలు వ్రతాలు ఆచరించే సంప్రదాయం ఏర్పడింది. ఈ వ్రతాల్లో భాగంగా ఇచ్చిపుచ్చుకునే వాయనాల్లో పచ్చి శనగలు ప్రధానంగా కనిపిస్తాయి. వర్షరుతువులో శరీరానికి మాంసకృత్తుల అవసరం అధికంగా ఉంటుంది. పచ్చిశనగల ద్వారా కావాల్సినన్ని ప్రొటీన్లు లభిస్తాయి. వ్రత నియమాల్లో భాగంగా ఉపవాసం కూడా దేహ సాధనకు తోడ్పడుతుంది.

> సూర్యుడు భూమికి దక్షిణ దిశలో సంచరించే మూడు రుతువుల (ఆరు నెలలు) కాలాన్ని దక్షిణాయనమనీ, భూమికి ఉత్తరదిశలో సంచరించే మూడు రుతువుల కాలాన్ని ఉత్తరాయణమని పేర్కొన్నారు. సూర్యుడు మేషరాశి మొదలుకొని ప్రతినెలా ఒక్కొక్క రాశిలో సంచరిస్తూ ఉంటాడు. సూర్యుడు మకరంలోకి ప్రవేశించింది మొదలు మిథునం దాటే వరకుగల ఆరు నెలల కాలాన్ని ఉత్తరాయణం అని, కర్కాటక సంక్రమణం మొదలు ధనుస్సు దాటే వరకూ ఉన్న ఆరునెలల కాలాన్ని దక్షిణాయనం అని విభజించారు. ఉత్తరాయణం శుభకార్యాలకు అనువైనదైతే.. దక్షిణాయనం ఉపాసనలు అనుష్ఠానం చేసుకోవడానికి విశేషమైనదిగా చెబుతారు.

శ్రావణంలో కృష్ణాష్టమిని అంగరంగ వైభవంగా చేసుకుంటారు. బాలకృష్ణుడి ఆరాధనతో సంతానం సంప్రాప్తిస్తుందనీ, ఐశ్వర్యం సిద్ధిస్తుందనీ విశ్వాసం. భార్యాభర్తల అన్యోన్యతకు శ్రీకృష్ణ ఆరాధన చేసుకోవాలని పెద్దల మాట. సోదరీ, సోదరుల మధ్య అన్యోన్యతను పంచుకునే రక్షాబంధన్‌ను శ్రావణ పౌర్ణమి నాడు చేసుకుంటారు. అనుబంధాలను పంచుకునే పండుగ ఇది.



భాద్రపదం గణపతి మాసం. వినాయక మంటపాలతో దేశమంతా ఆధ్యాత్మికతకు చిరునామాగా మారిపోతుంది. భక్తిభావంతోపాటు ఐక్యతను చాటిచెప్పే పండుగ ఇది. భాద్రపద కృష్ణపక్షం పితృదేవతల ఆరాధనకు కేటాయించారు పెద్దలు. ఉత్తరాయణం దేవతలు అనుగ్రహిస్తే, దక్షిణాయనం పితృదేవతల ఆశీస్సులు అందుతాయని శాస్త్ర వచనం. పితృపక్షాల్లో పితృతర్పణాలు విడవడం మన సంప్రదాయం. కాలం చేసిన పెద్దలను తలుచుకొని.. వారి పేరిట శక్తి కొద్ది దానధర్మాలు చేయాలని శాస్త్రం నిర్దేశించింది. ఆ ప్రకారంగా దానం చేసిన వారి వంశం అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నది.



ఆశ్వయుజం ఆధ్యాత్మిక సాధకులకు ప్రీతికరమైన మాసం. తెలంగాణ ఆడబిడ్డలకు ముఖ్యమైన మాసం కూడా ఇదే. దేవీ నవరాత్రులు శాక్తేయులు శక్తిసామర్థ్యాలు పెంచుకునే కాలం. బతుకమ్మ కోలాహలం ఆడబిడ్డల ఆనందాలు పంచుకునే సమయం. చెడుపై మంచి గెలిచిన సందర్భంగా దసరా ఉత్సవాలు చేసుకుంటారు. అమ్మవారి అనుగ్రహం పొందే అద్భుత పర్వం విజయదశమి. ఆశ్వయుజ అమావాస్యను దీపావళిగా చేసుకుంటాం. దీపాలు వెలిగించి చీకట్లను తొలగించుకుంటాం. మానవ మనుగడకు మూలాధారమైన సంపదల తల్లి మహాలక్ష్మిని ఆరాధించి ఆమెకు కృతజ్ఞతలు చెప్పుకొంటాం.





కార్తికం పవిత్ర మాసం. అద్వైత భావాన్ని తెలియజేసే నెల ఇది. శివకేశవులను ఆరాధిస్తూ ధన్యత పొందుతారు భక్తులు. పరమేశ్వరుడికి నిత్యాభిషేకాలు, శ్రీహరికి నిత్య నివేదనలు.. నెలంతా ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంటుంది. కార్తికంలో వనభోజనాలు ఆహ్లాదంతోపాటు భక్తి భావాన్ని పెంపొందిస్తాయి.


మార్గశిరం మరో మహోన్నత మాసం. గీతాచార్యుడు మాసాల్లో తాను మార్గశిరాన్ని అని ప్రకటించాడు. భగవద్గీత ఆవిర్భవించింది కూడా ఈ నెలలోనే. అంతేకాదు శివుడి రూపమైన కాలభైరవుడు ఆవిర్భవించింది మార్గశిరంలోనే!

ఇలా ప్రతినెలా పర్వాలతో కొనసాగే దక్షిణాయనం విలక్షణం కాక మరేమిటి? ఉత్తరాయణంలో ఉత్తమ మార్గం పొందడానికి కావాల్సిన శక్తిని పుంజుకోవడానికి దక్షిణాయనాన్ని వినియోగించుకోవాలి.

...✍ కళ్యాణ

సీతమ్మ పలికిన.. హనుమద్ మంత్రం

హితోపదేశం



త్వమస్మిన్ కార్య నిర్యోగే ప్రమాణం హరిసత్తమ
హనుమాన్ యత్నమాస్థాయ దుఃఖక్షయ కరో భవ॥

ఈ శ్లోకం వాల్మీకి రామాయణం సుందరకాండలోనిది. 'హనుమా! నేను చాలా దుఃఖంలో ఉన్నాను. నన్ను ఈ కష్టాల నుంచి గట్టెక్కించగల సమర్థుడవు నువ్వే!' అని తనకు రాముడి అభిజ్ఞానాన్ని అందించిన హనుమంతుడితో చెబుతుంది సీతమ్మ. ఇది కార్యసిద్ధి హనుమాన్ మంత్రంగా ప్రసిద్ధికెక్కింది.
రామాయణంలో మంథర, శూర్పణఖ పాత్రలు కీలక పరిణామాలకు కారణమైనవి. మంథర దుర్బోధ వల్ల కైకేయి సాధించిందేమీ లేకపోగా భర్తను కోల్పోయింది. విధవగా శేషజీవితాన్ని గడిపింది. దురాశకు పోయిన శూర్పణఖ దుర్బోధ వల్ల రావణాసురుడు తన ప్రాణాలు కోల్పోవడంతోపాటు లంక సర్వనాశనానికి కారకుడయ్యాడు. దుర్భరమైన వియోగదుఃఖాన్ని అనుభవించినప్పటికీ సీతారాములు పరస్పర ప్రేమను, మానసిక స్థైర్యాన్ని కోల్పోలేదు. సీతమ్మ కోసం వనమంతా గాలిస్తూ రాముడు శోకిస్తే.. అశోకవనంలో రాక్షస స్త్రీల మధ్య అనుక్షణం రాముణ్ని తలుచుకుంటూ దుఃఖించింది సీతమ్మ. ఆ మహా ఇల్లాలిని అన్వేషిస్తూ అశోకవనం చేరుకొన్నాడు హనుమంతుడు. రాముడు తనకు ఇచ్చిన అంగుళీయకాన్ని సీతమ్మకు అందించాడు. 'సీతమ్మ తల్లీ! శ్రీరామచంద్రుడు లంకకు తప్పకుండా వస్తాడు. రావణ సంహారం గావించి మిమ్మల్ని తీసుకెళ్తాడు' అని భరోసా కల్పిస్తాడు. ఆ సందర్భంలో సీతమ్మతల్లి పై శ్లోకం పలికింది. దంపతుల ఎడబాటుకు ప్రత్యక్షంగా కానీ, పరోక్షంగా కానీ కారకులైన వారికి బ్రహ్మహత్యా పాతకం తగులుతుందని భాగవతం పేర్కొంది. ఆధునిక కాలంలో సైతం తాత్కాలిక ఆకర్షణలకు లోనవుతూనో, ఇతరుల దుర్బోధల ప్రభావంతోనో దాంపత్య సమస్యలను ఎదుర్కొంటున్న వారు సీతారామ వియోగ ఘట్టం నుంచి నేర్చుకోవలసింది ఎంతో ఉంది. రాక్షసమాయలు, కుయుక్తులు తాత్కాలిక దుఃఖాన్ని, వియోగాన్ని కలిగించినా.. దైవశక్తి విశ్వంభరం ముందు అవి నిలబడలేవు. అంతిమంగా ధర్మమే జయిస్తుంది. ధర్మాన్ని పట్టుకోవడమే మనం చేయాల్సింది. హనుమతో సీతమ్మ పలికిన మాటలు కార్యసిద్ధి మంత్రంగా మారాయి. ఆపత్కాలంలో, నిత్య విధిలో పై శ్లోకాన్ని యథాశక్తి పఠించినవారికి కార్యసిద్ధి కలుగుతుంది.

...✍ డా॥ చెప్పెల హరినాథశర్మ

మూడు రోజులు.. నాలుగు పూటలు..

బుధవారం తొలి ఏకాదశి

అనంత ఫలాన్ని ఇచ్చే పుణ్యప్రదాయిని తొలి ఏకాదశి. ఈ పర్వదినం ఉపవాస ప్రధాన పండుగ. దశమి నాటి రాత్రి, ఏకాదశి రెండు పూటలు, ద్వాదశి రాత్రి ఉపవాసం చేయాలి. ఇలా త్రిరాత్ర ఉపవాస వ్రతం ఆచరించే విధానం ఉంది. మూడు రోజుల్లో నాలుగు పూటలు ఉపవాసాలు ఉండటం దీనిలోని ప్రత్యేకత. దశమి నాటి రాత్రి ముక్కోటి దేవతలు వైకుంఠానికి వెళ్లి.. మహావిష్ణువును అర్చిస్తారట. ఆ సమయంలో మనం కూడా ఉపవాసం పాటిస్తూ మహావిష్ణువును ధ్యానం చేస్తే.. సమస్త దేవతల అనుగ్రహం ప్రాప్తిస్తుందని విశ్వాసం. ఏకాదశి రోజు రెండు పూటలూ ఉపవాసం ఉండి హరినామ సంకీర్తనంతో తరించాలి. మర్నాడు పగటిపూట పారణ చేయాలి. అంటే స్వామి ప్రసాదంగా భావించి సాత్విక ఆహారం తీసుకోవాలి. రాత్రికి మళ్లీ ఉపవాసం పాటిస్తే.. ఏకాదశి వ్రతం ముగుస్తుంది. ఈ ఉపవాస దీక్ష వెనుక వైద్యపరమైన విశేషాలు కనిపిస్తాయి. ఆషాఢం మొదలు వానలు పుంజుకుంటాయి. వాతావరణంలో ఉన్నట్టుండి మార్పులు వస్తుంటాయి. వాటిని తట్టుకొనేందుకు వీలుగా శరీరాన్ని సిద్ధం చేసుకోవడమే ఏకాదశి ఉపవాస దీక్ష లక్ష్యంగా చెబుతారు పెద్దలు. దీని ఫలితంగా రోగనిరోధక శక్తి పెరగడంతోపాటు జీర్ణకోశంలోని వ్యర్థాలు తొలగిపోతాయి. ఆ తర్వాతి కాలంలో వాతావరణ మార్పులను శరీరం తట్టుకునేందుకు ఇది సాయపడుతుంది.

జీవం.. పునరుత్థానం

క్రీస్తు సందేశం



జీవం, పునరుత్థానం అనేవి ప్రభువులో కనిపిస్తాయి. కొన్ని అద్భుతాల్లో జీవం అనేది నిరూపితమైతే, చనిపోయిన లాజరుని మళ్లీ బతికించిన ఘట్టంలో పునరుత్థానం రుజువైంది. 'నేనే మార్గం, సత్యం, జీవం' (యోహాను 14:6) అని ప్రకటించుకున్న ప్రభువే, 'నేనే పునరుత్థానం' (యోహాను 11:25-26) అని కూడా పేర్కొన్నారు. క్రీస్తును ఎలాగైనా తప్పుపట్టాలని చూస్తున్న యూదు పెద్దల్లో.. ఈ రెండు మాటలూ మంటలు రేపాయి. నీళ్లను ద్రాక్షరసంగా మార్చడం, అంధుడికి చూపునివ్వడం, తుఫానును అణచివేయడం, ఐదు రొట్టెలు, రెండు చేపలు ఐదు వేలమందికి ఆహారంగా అందించడం తదితర సంఘటనల్లో క్రీస్తులోని జీవశక్తి ప్రస్ఫుటమైంది. రెండోది ఆయన మరణిస్తే గానీ తెలిసే అవకాశం లేదు. కానీ, ఓ సంఘటన కారణంగా ముందుగానే అది వ్యక్తమైంది. బేతనియా గ్రామంలో మరియ, మార్త అనే అక్కాచెల్లెళ్లు ఉండేవారు. వారికో సోదరుడు. అతని పేరు లాజరు. ఆ కుటుంబం ప్రభువుకి బాగా సుపరిచితం. ఒకసారి అకస్మాత్తుగా లాజరు చనిపోయాడు. ఆ సమయంలో ఎక్కడికో దూరప్రాంతానికి వెళ్లిన ఏసుక్రీస్తు నాలుగు రోజుల తర్వాత బేతనియా చేరుకుంటారు. తమ నివాసానికి వస్తున్న ప్రభువుకు మార్త ఎదురు వెళ్తుంది. మీరున్నట్లయితే నా సోదరుడు చనిపోయేవాడు కాదని కన్నీటి పర్యంతం అవుతుంది. ప్రభువును ప్రార్థించి 'నీ మహిమను ప్రకటించేందుకు' అని సమస్యను దేవుడి ముందు ఉంచింది. ప్రభువు అనుగ్రహించాడు. అక్కడి ప్రజల విశ్వాసం మరింత గట్టిపడేటట్టుగా సమాధి రాయి పక్కకు తొలగించి 'లాజరూ! వెలుపలికి రా!' అని పిలిచాడు ప్రభువు. చనిపోయిన వాడు లేచి, నడిచొచ్చాడు. అందరూ ఆ మహోత్తర అద్భుత శక్తికి ఆశ్చర్యపడి ప్రభువును కొనియాడారు. (యోహాను 11:17-44)

...✍ ప్రొ॥బిర్యాక్ష్ రాజు, 98667 55024

జ్ఞానయజ్ఞం.. ద్రవ్యయజ్ఞం..

శ్రేయాన్ ద్రవ్యమయాద్యజ్ఞాత్ జ్ఞానయజ్ఞః పరంతప।
సర్వం కర్మాఖిలం పార్థ జ్ఞానే పరిసమాప్యతే॥

(భగవద్గీత 4-33)

'అర్జునా! లోక కల్యాణం కోసం సర్వసమర్పణ భావనతో ఆచరించేది 'యజ్ఞం'. ద్రవ్యయజ్ఞాలని, జ్ఞానయజ్ఞాలని రెండు విధాలుగా చెప్పిన యజ్ఞాలలో ద్రవ్యయజ్ఞం కన్నా జ్ఞానయజ్ఞం ఉత్తమమైనది. కర్మలన్నీ జ్ఞానంలోనే పరిసమాప్తమవుతాయి' అంటాడు కృష్ణుడు. కఠోపనిషత్తు మనుషులకు 'ప్రేయో మార్గం, శ్రేయో మార్గం' అని రెండు మార్గాలను సూచించింది. భౌతిక జగత్తులో సంపదలను పొంది విలాసవంతమైన జీవితాన్ని గడపడం ప్రేయోమార్గం. జీవన పరమార్థాన్ని తెలుసుకొని, సంతృప్తితో కూడిన వివేకసాధనతో అర్థవంతం, ఫలవంతం, ఉత్తమమైన జీవితాన్ని గడపడం శ్రేయోమార్గం. మానవులకు ద్రవ్యయజ్ఞాలు ప్రేయస్సునిస్తే, జ్ఞానయజ్ఞాలు శ్రేయస్సునిస్తాయి. శ్రేయస్సులో ప్రేయస్సు కూడా అంతర్లీనంగా ఉంటుంది. అందుకే ఆరంభంలోనే 'శ్రేయాన్' అంటూ ఆరంభించాడు పరమాత్మ.

సనాతన ధర్మం భౌతిక సంపదను అమితంగా స్వీకరించమని, దానిని అత్యత ప్రాతిపదికగా సద్వినియోగం చేయమని చెబుతుంది. సంపదలను సమాజానికి వినియోగించడం, హోమాదులు నిర్వహించడం ద్రవ్యయజ్ఞంగా పేర్కొంటారు. హోమాదులు నిర్వహణలో 'కామన' ఉంటుంది. అలాగే త్యాగంలో 'నేను' చేస్తున్నాననే భావన ఉంటుంది. సాధారణంగా 'నేను.. నాది' అనే భేదభావన భౌతిక వస్తువులను ఆశ్రయించి ఉంటుంది. ఇదే అహంకార మమకారాలకు మూలాధారాలు. ఎప్పుడైతే సమాజం నుంచి పొందిన సంపదను సమాజానికే అర్పించాలనే భావన కలుగుతుందో, అప్పుడు ఆ సంపదలపై వ్యామోహం పోతుంది. పరోపకార బుద్ధి జాగృతమైన వేళ సమభావన వికసిస్తుంది. దానితో అభ్యుదయంతో కూడిన ప్రశాంతత మనసులో నిలుస్తుంది. అదే భౌతిక విజయానికి సోపానమవుతుంది.




ద్రవ్యయజ్ఞం వల్ల స్వర్గభోగాలు లభిస్తాయి. అర్జించిన సంపదలు తరిగిపోయినట్టుగానే, 'నేను' చేస్తున్నాననే భావనతో చేసే ద్రవ్యయజ్ఞ గత భోగాలూ కాలక్రమేణా తరిగిపోతాయి. అయితే.. కర్మఫలాపేక్ష లేకుండా 'పనిని ప్రేమిస్తూ, ఉపాసనాభావన'తో చేసే కర్మల ఫలితం మాత్రం అహంకార మమకారాలను దరిచేరనీయదు. ఆ స్థాయిని పొందేందుకు ఉపకరించేదే జ్ఞానయజ్ఞం. నిజానికి.. ద్రవ్యయజ్ఞం లేనిదే జ్ఞానయజ్ఞం ఉండదు. కాబట్టే.. ద్రవ్యయజ్ఞంతో ఆగక జ్ఞానయజ్ఞాన్ని ఆచరించే వారికే శ్రేయస్సు కలుగుతుంది.

విషయాన్ని తెలుసుకోవడం జ్ఞానం. అది ఉత్తమమే కాని దానిని ఆచరణయోగ్యంగా మలచుకోవడం విజ్ఞానం అవుతుంది (విశేషతో జ్ఞానం విజ్ఞానం). విజ్ఞానం వల్ల ప్రయోజనం ఉంటుంది. చేసే ప్రతికర్మ ఫలితాన్ని ఇస్తుంది. అది సమాజహితమైనదా కాదా అనేదానిపై ఆ పని మంచిదా చెడ్డదా అనేది ఆధారపడి ఉంటుంది. చెడుపనుల వల్ల చెడు అనుభవాలు, మంచిపనుల వల్ల మంచి అనుభవాలు కలుగుతాయి. ఈ అనుభవాలే జ్ఞానాలుగా చెప్పుకొంటాం. అయా అనుభవాలు ప్రాతిపదికగా.. ఏది ఆచరణీయమో గుర్తెరిగి, కర్మఫల త్యాగంతో చేసే కర్మలు పరిణతినిస్తాయి. ఆ పరిణతి కాలక్రమేణా అభ్యాసమై.. నిష్కామకర్మలకు మార్గం చూపుతుంది. నిష్కామకర్మలే యోగంగా మారి శ్రేయస్సునిస్తాయి. జీవితాన్ని భోగమయంగా కాక సాధనాక్షేత్రంగా చేసుకోవడం వల్ల జీవన ప్రయోజనం సిద్ధిస్తుంది. ఈ ప్రయాణంలో ఇష్టాయిష్టాలు ప్రలోభపెడతాయి. వాటిని అధిగమించి.. ద్రవ్యయజ్ఞం నుంచి జ్ఞానయజ్ఞం వైపు నడవడం మానవులకు కర్తవ్యం కావాలి. కర్మఫలాన్ని కోరకుండా సత్కర్మలను యజ్ఞాలుగా ఆచరించడం వల్ల శ్రేయస్సు కలుగుతుంది.

...✍ పాలకుర్తి రామమూర్తి

త్యాగనిరతిని స్మరిస్తూ..

బుధవారం మొహర్రం



ఇస్లామీయ చరిత్రలో ఎంతో పవిత్రత, ప్రాధాన్యం ఉన్న యౌమె ఆషూరా రోజునే హజ్రత్ ఇమామ్ హుసైన్ (రజి) అమరులయ్యారు. వందల సంవత్సరాల క్రితం న్యాయం కోసం, ధర్మం కోసం, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఆయన పరివారమంతా 'కర్బలా' మైదానంలో ప్రాణాలను పణంగా పెట్టి వీరోచితంగా పోరాడింది. కర్బలా ఘటన మనకు త్యాగస్ఫూర్తి పాఠాన్ని నేర్పుతుంది. దుర్మార్గాలపై, దౌర్జన్యాలపై రాజీలేని పోరాటాలు చేయాలని తెలుపుతుంది. ఆనాటి ఘటనను తలుచుకుంటూ ముస్లింలు మొహర్రం జరుపుకొంటారు. ఇమామ్ హుసైన్ (రజి) త్యాగస్ఫూర్తిని స్మరించుకుంటారు.

...✍ ముహమ్మద్ ముజాహిద్
96406 22076

ఇమామ్ హుసైన్ (రజి) సూక్తులు..

- ప్రపంచంలోనే స్వర్గాన్ని చూడాలనుకుంటే.. మీ అమ్మ ఒడిలో తలపెట్టి పడుకోండి.
- నేలపై వినమ్రంగా జీవించండి. చనిపోయాక నేలకింద హాయిగా ఉండవచ్చు.
- ఏ దిక్కూ లేని వారికి దేవుడే దిక్కు. అలాంటి వారిపై దౌర్జన్యం చేయకండి.
- నాకు స్వర్గ కాంక్ష కన్నా నమాజ్ అంటే ఎంతో ఇష్టం. ఎందుకంటే నమాజ్ అల్లాహ్‌కు ఎంతో ప్రీతి.
- ఈ దేహానికి మరణం తప్పదు. అలాంటప్పుడు ఈ జీవితాన్ని ప్రసాదించిన ఆ దైవం కోసం ప్రాణాలర్పించడమే మేలు.
- మిమ్మల్ని చెడు నుంచి వారించే వారే మీ నిజమైన శ్రేయోభిలాషి.
- మీ మనో న్యాయస్థానంలోకి వెళుతూ ఉండండి. ఎందుకంటే అక్కడ తప్పుడు తీర్పులు జరగవు.
- దైవదాస్యం చేసేవారికి ఈ ప్రపంచంలో ప్రతిదీ బానిసవుతుంది. దైవభీతితో గౌరవమర్యాదలను సాధించండి.
- దౌర్జన్యానికి వ్యతిరేకంగా పోరాడటంలో ఎంత ఆలస్యం చేస్తారో... అంత త్యాగం చేయాల్సి ఉంటుంది.
- ఏకాంతంలో ఉన్నప్పుడు పవిత్ర భావాలు గలిగినవారే నిజమైన మనిషి.



అట్టహాసంగా జేపీఎల్ ట్రోఫీ ఆవిష్కరణ

- ఈనెల 20 నుంచి టీ20 క్రికెట్ లీగ్

హైదరాబాద్, ఆట ప్రతినిధి: ఈనెల 20-25 మధ్య జరుగనున్న కేసీఆర్ జర్నలిస్ట్ ప్రీమియర్ లీగ్ (జేపీఎల్)లో భాగంగా ఆదివారం ట్రోఫీ ఆవిష్కరణ కార్యక్రమం అట్టహాసంగా ముగిసింది. ఆదివారం ఎల్బీ స్టేడియంలోని సమావేశ మందిరంలో జరిగిన ఈ వేడుకకు టీసీఏ మాజీ టీమ్ సెలెక్టర్ ఎమ్మెల్సీ ప్రసాద్, కాల్స్ ఛైర్మన్ శివసేనా రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై ట్రోఫీలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. ఏ క్రీడలో అయినా వర్ధమాన ఆటగాళ్లను వెలుగులోకి తేవాలంటే అది క్రీడా జర్నలిస్టులతోనే సాధ్యమవుతుందని, వారి కష్టాన్ని ప్రతిఒక్కరూ గుర్తించి గౌరవించాలన్నారు. ఈ టోర్నీకి కాల్స్ తరపున పూర్తి సహకారం అందిస్తామని శివసేనా రెడ్డి చెప్పారు. అనంతరం కేసీఆర్ ఛైర్మన్, ఇండి రేసింగ్ టీమ్ ఓనర్ కె. అభిషేక్ రెడ్డి, త్రిష్ణ ఫుడ్స్ ఎండీ భరత్ రెడ్డి, లైఫ్ స్పాన్ ప్రతినిధి భరత్ 10 జట్ల కెప్టెన్లకు క్యాప్స్ అందించారు.



నేటి నుంచే 'మాన్‌సూన్ రెగట్టా'

హైదరాబాద్, ఆట ప్రతినిధి: తెలంగాణ సెయిలింగ్ అసోసియేషన్, ద యాట్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ ఆధ్వర్యంలో సోమవారం నుంచి హుసేన్‌సాగర్ వేదికగా 15వ 'మాన్‌సూన్ రెగట్టా' పోటీలు ప్రారంభం కానున్నాయి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, మధ్యప్రదేశ్, ఒడిషా, కర్ణాటక, మహారాష్ట్ర నుంచి సుమారు 140 మంది సెయిలర్లు ఈ పోటీలలో పాల్గొననున్నారు. ఈ ఏడాది అండర్-18లో కొత్తగా ఐఎల్‌సీఏ4, 29ఈఆర్, ఇంటర్నేషనల్ 420 విభాగాలను చేర్చినట్టు నిర్వాహకులు తెలిపారు. అండర్-16లో తెలంగాణ అమ్మాయి గొమదవెల్లి దీక్షిత టాపర్‌గా బరిలోకి దిగనుంది. ఈనెల 20న పోటీలు ముగుస్తాయి.

కింగ్ అల్కారజ్

ఫైనల్‌లో జొకోవిచ్‌పై విజయం • వరుసగా రెండో ఏడాది టైటిల్ కైవసం

అదే కోర్టు! వాళ్లే ప్రత్యర్థులు!! కానీ ఫలితం మాత్రం మారలేదు. గతేడాది వింబుల్డన్‌లో పురుషుల సింగిల్స్ ఫైనల్స్‌కు రీమ్యాచ్‌గా ఆదివారం ముగిసిన తుదిపోరులోనూ స్పెయిన్ కుర్రాడు కార్లోస్ అల్కారజ్ అదరగొట్టి వింబుల్డన్ కోటలో మరోసారి పాగా వేశాడు. వరుసగా రెండో ఏడాది ఈ ప్రతిష్ఠాత్మక టైటిల్‌ను కైవసం చేసుకుని చరిత్ర సృష్టించాడు. తన కెరీర్‌లో 25వ టైటిల్ గెలవాలన్న దిగ్గజం నొవాక్ జొకోవిచ్‌పై పూర్తి ఆధిపత్యం చెలాయించి ఆరు వారాల వ్యవధిలో రెండు గ్రాండ్‌స్లామ్స్ (ఫ్రెంచ్ ఓపెన్, వింబుల్డన్) కైవసం చేసుకున్నాడు.

లండన్: ప్రతిష్ఠాత్మక వింబుల్డన్ టోర్నీని మూడో సీడ్ కార్లోస్ అల్కారజ్ వరుసగా రెండో ఏడాది గెలుచుకున్నాడు. ఆదివారం సెంటర్ కోర్టు వేదికగా జరిగిన ఫైనల్‌లో ఈ నయా స్పెయిన్ బుల్ 6-2, 6-2, 7-6 (7/4)తో నొవాక్ జొకోవిచ్ (సెర్బియా)పై నెగ్గి 21 ఏండ్ల వయసులోనే నాలుగు గ్రాండ్‌స్లామ్స్ సాధించాడు. గత వింబుల్డన్ ఫైనల్‌లో ఓడినా ఐదు సెట్ల పాటు హోరాహోరీగా పోరాడిన జొకో.. ఈ మ్యాచ్‌లో మాత్రం ఆ పట్టుదల, దూకుడు, పోరాటతత్వం లేకుండానే టోర్నీని ముగించాడు. 2 గంటల 27 నిమిషాల పాటు సాగిన ఈ మ్యాచ్‌లో తొలి రెండు సెట్లను అలవోకగా నెగ్గిన అల్కారజ్‌కు మూడో సెట్‌లో ప్రత్యర్థి నుంచి కాస్త ప్రతిఘటన ఎదురైంది. కీలకమైన ఈ సెట్‌ను దక్కించుకోవడానికి ఇరువురూ పోరాడినా స్కోర్లు సమం కావడంతో ఆట కాస్తా టైబ్రేకర్‌కు వెళ్లింది. ఇక టైబ్రేకర్‌లో అల్కారజ్.. జొకోను పదే పదే నెట్ దగ్గరికి రప్పిస్తూ పాయింట్లు రాబట్టి సెట్‌తో పాటు మ్యాచ్‌నూ సొంతం చేసుకున్నాడు. ఫైనల్‌లో అల్కారజ్ 5 ఏస్‌లు సంధించి 42 విన్నర్లు కొట్టాడు. 8 ఏస్‌లు కొట్టిన జొకో 26 విన్నర్స్‌కే పరిమితమయ్యాడు. ఈ విజయంతో ఒకే ఏడాది వరుసగా ఫ్రెంచ్ ఓపెన్, వింబుల్డన్ టైటిల్స్‌ను గెలిచిన ఆరో టెన్నిస్ ప్లేయర్‌గా అల్కారజ్ నిలిచాడు.

విజేత	అల్కారజ్	రూ. 28.60 కోట్లు
రన్నరప్	జొకోవిచ్	రూ. 14.00 కోట్లు



భారత్‌దే లెజెండ్స్ ట్రోఫీ

ఫైనల్‌లో పాకిస్థాన్ ఓటమి



ఎడ్జ్‌బాస్టన్: అంతర్జాతీయ క్రికెట్ నుంచి రిటైర్మెంట్ ప్రకటించిన మాజీ క్రికెటర్లు ఆడే 'వరల్డ్ చాంపియన్‌షిప్ ఆఫ్ లెజెండ్స్' టైటిల్‌ను భారత్ కైవసం చేసుకుంది. యువరాజ్ సింగ్ సారథ్యంలోని టీమ్‌ఇండియా ఫైనల్‌లో 5 వికెట్ల తేడాతో చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌ను ఓడించింది. ఈనెల 3 నుంచి 13 దాకా జరిగిన ఈ టోర్నీలో భాగంగా భారత కాలమానం ప్రకారం శనివారం రాత్రి ముగిసిన ఫైనల్‌లో యూనిస్ ఖాన్ సారథ్యంలోని పాక్ జట్టు మొదట బ్యాటింగ్ చేసి నిర్ణీత 20 ఓవర్లలో 156/6 పరుగులు చేసింది. షోయబ్ మాలిక్ (41) టాప్ స్కోరర్. భారత బౌలర్లలో అనురీత్ సింగ్ (3/43) రాణించాడు. అనంతరం బ్యాటింగ్‌కు వచ్చిన భారత్.. 19.1 ఓవర్లలోనే లక్ష్యాన్ని పూర్తిచేసింది. అంబటి రాయుడు (50) అర్ధ సెంచరీతో రాణించగా గుర్‌కీరత్ (34), యూసుఫ్ పఠాన్ (30) దూకుడుగా ఆడి భారత్ విజయాన్ని ఖాయం చేశారు.

గైక్వాడ్‌కు ఆర్థిక సాయం



ఢిల్లీ: ఏడాదికాలంగా క్యాన్సర్‌తో పోరాడుతున్న భారత మాజీ క్రికెటర్ అన్షుమన్ గైక్వాడ్‌కు బీసీసీఐ కోటి రూపాయల ఆర్థిక సాయం ప్రకటించింది. ఈ మేరకు కార్యదర్శి జై షా బీసీసీఐ అధికారులను ఆదేశించినట్టు బోర్డు ఓ ప్రకటనలో తెలిపింది. 'క్యాన్సర్ బారినపడ్డ భారత మాజీ క్రికెటర్ అన్షుమన్‌కు తక్షణ సాయం కింద కోటి రూపాయలను విడుదల చేయాలని కార్యదర్శి జై షా ఆదేశించారు. ఆయన కుటుంబసభ్యులతోనూ జై షా మాట్లాడారు. గైక్వాడ్ కుటుంబానికి బీసీసీఐ అండగా ఉంటుంది' అని ప్రకటనలో పేర్కొంది. బ్లడ్ క్యాన్సర్‌తో లండన్‌లోని కింగ్స్ కాలేజీ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న గైక్వాడ్‌కు తన మాజీ సహచర ఆటగాళ్లు కపిల్‌దేవ్, గవాస్కర్, సందీప్ పాటిల్ వంటి పలువురు సాయమందిస్తున్నారు. ఈ విషయాన్ని సందీప్ పాటిల్ ముందుగా బీసీసీఐ దృష్టికి తీసుకువచ్చారు. 1975 నుంచి 1987 దాకా భారత్ తరఫున 40 టెస్టులు, 15 వన్డేలు ఆడిన గైక్వాడ్.. టీమ్‌ఇండియాకు రెండుసార్లు హెడ్‌కోచ్‌గా కూడా పనిచేశారు.

విజయంతో ముగించారు

ఐదో టీ20లోనూ భారత్ గెలుపు • సిరీస్ 4-1తో కైవసం • రాణించిన శాంసన్, ముకేశ్

సీనియర్ల గైర్హాజరీలో జింబాబ్వేకు వెళ్లిన యువ భారత జట్టు ఈ పర్యటనను విజయంతో ముగించింది. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా తొలి టీ20లోనే అనూహ్య ఓటమి ఎదురైనా తర్వాత పుంజుకుని వరుసగా నాలుగు మ్యాచ్‌లలోనూ ఆతిథ్య జట్టుకు చుక్కలు చూపించింది. హరారే వేదికగా జరిగిన ఆఖరి టీ20లో భారత్ బ్యాట్‌తో ఆశించిన స్థాయిలో ఆకట్టుకోలేకపోయినా బంతితో మాత్రం రెచ్చిపోయి సిరీస్‌ను 4-1తో గెలుచుకుంది. బ్యాట్‌తో సంజూ శాంసన్, బంతితో ముకేశ్ కుమార్ రాణించారు.



హరారే: జింబాబ్వే పర్యటనలో యువ భారత జట్టు అదరగొట్టింది. ఆదివారం ఆతిథ్య జట్టుతో జరిగిన ఐదో టీ20లో జింబాబ్వేపై 42 పరుగుల తేడాతో గెలిచింది. సంజూ శాంసన్ (45 బంతుల్లో 58, 1 ఫోర్, 4 సిక్సర్లు), శివమ్ దూబె (12 బంతుల్లో 26, 2 ఫోర్లు, 2 సిక్సర్లు) రాణించడంతో భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 167 పరుగులు చేసింది. మోస్తరు లక్ష్య ఛేదనలో జింబాబ్వే 18.3 ఓవర్లలో 125 పరుగులకే చాప చుట్టేసింది. డియాన్ మైర్స్ (32 బంతుల్లో 34, 4 ఫోర్లు, 1 సిక్స్) ఫర్వాలేదనిపించాడు. భారత బౌలర్లలో ముకేశ్ కుమార్ (4/22), దూబె (2/25) ధాటికి జింబాబ్వే బ్యాటర్లు తోకముడిచారు. ఆల్‌రౌండ్ ప్రదర్శనతో ఆకట్టుకున్న దూబెకు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు దక్కగా సిరీస్ ఆసాంతం రాణించిన వాషింగ్టన్ సుందర్‌కు 'మ్యాన్ ఆఫ్ ద సిరీస్' లభించింది.

ఆదుకున్న శాంసన్:

టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన భారత్ పవర్ ప్లేలోనే మూడు కీలక వికెట్లు కోల్పోయింది. భారత ఇన్నింగ్స్‌లో తొలి రెండు బంతులను భారీ సిక్సర్లుగా మలిచిన జైస్వాల్ (12).. రజా వేసిన నాలుగో బంతికి క్లీన్‌బౌల్డ్ అయ్యాడు. వేగంగా ఆడిన అభిషేక్ (14), శుభ్‌మన్ గిల్ (13) సైతం విఫలమవడంతో భారత్ 40 పరుగులకే మూడు వికెట్లు నష్టపోయింది. ఈ క్రమంలో శాంసన్, రియాన్ పరాగ్ (22) భారత్‌ను ఆదుకున్నారు. ఇద్దరూ వికెట్ల పతనానికి అడ్డుకట్ట వేయడమే గాక స్కోరుబోర్డునూ ముందుకు నడిపించారు. జింబాబ్వే బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో మధ్య ఓవర్లలో పరుగుల రాక మందగించినా వీలుచిక్కినప్పుడల్లా శాంసన్ సిక్సర్లు బాదాడు. నవాంట 15వ ఓవర్లో పరాగ్ నిష్క్రమించడంతో 65 పరుగుల మూడో వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. అర్ధ సెంచరీ పూర్తిచేశాక శాంసన్‌ను ముజరబాని బౌల్డ్ చేశాడు. క్రీజులోకి రాగానే మూడో బంతికి సిక్స్ బాదిన దూబె ఎంగర్వ 19వ ఓవర్లో 4,6,4 తో భారత స్కోరును 150 మార్కు దాటించాడు.

ముకేశ్ పేస్‌కు విలవిల:

ఛేదనలో జింబాబ్వేను ముకేశ్ వణికించాడు. తొలి ఓవర్లో మూడో బంతికే ఓపెనర్ వెస్లీని బౌల్డ్ చేసిన అతడు.. మూడో ఓవర్లో బెన్నెట్ (10)ను బోల్డ్ చేశాడు. 5 ఫోర్లతో జోరుమీదున్న మరుమని (27) వాషింగ్టన్ సుందర్ 9వ ఓవర్లో వికెట్ల ముందు దొరికిపోయాడు. డియోన్‌ను పెవిలియన్‌కు పంపిన దూబె.. అద్భుత త్రో తో రజా (8)ను రనౌట్ చేశాడు. ఆ తర్వాత వచ్చిన జింబాబ్వే బ్యాటర్లలో ఫరజ్ అక్రమ్ (13 బంతుల్లో 27, 2 ఫోర్లు, 2 సిక్సర్లు) వేగంగా ఆడేందుకు ప్రయత్నించినా ముకేశ్ 19వ ఓవర్లో అతడి ఆట కట్టించడంతో ఆతిథ్య జట్టు ఓటమి ఖరారైంది.

సంక్షిప్త స్కోర్లు

భారత్: 20 ఓవర్లలో 167/6 (సంజూ 58, దూబె 26, ముజరబాని 2/19, రజా 1/37); జింబాబ్వే: 18.3 ఓవర్లలో 125 ఆలౌట్ (డియోన్ 34, అక్రమ్ 27, ముకేశ్ 4/22, దూబె 2/25)

మీరు రాకుంటే మేమూ రాం!

చాంపియన్స్ ట్రోఫీలో హైబ్రిడ్ మోడల్‌ను వ్యతిరేకిస్తున్న పాక్

లాహోర్: వచ్చే ఏడాది తమ దేశంలో జరుగబోయే ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీలో పాల్గొనేందుకు భారత్ నిరాకరించడంపై పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) మరోసారి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ఈ టోర్నీలో ఆడేందుకు భారత జట్టు పాకిస్థాన్‌కు రాకుంటే 2026లో భారత్/శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యమిచ్చే టీ20 వరల్డ్ కప్‌లో తాము ఆడబోమని హెచ్చరించినట్టు పాక్ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. అంతేగాక చాంపియన్స్ ట్రోఫీలో హైబ్రిడ్ మోడల్‌నూ తాము అంగీకరించబోమని టోర్నీ మొత్తం పాక్‌లోనే జరగాలని పీసీబీ పట్టుబడుతున్నట్టు తెలుస్తోంది. కాగా ఈ విషయంలో ఐసీసీ ఇరు దేశాల బోర్డులను ఎలా సమన్వయపరుస్తుంది..? ఈ సమస్యకు ఏ పరిష్కారం కనుగొంటుందో తెలియాలంటే ఈనెల 22 దాకా ఆగాల్సిందే. జూలై 19-22 మధ్య కొలంబో (శ్రీలంక) వేదికగా జరిగే ఐసీసీ వార్షిక సమావేశంలో దీనిపై ఓ స్పష్టత వచ్చే అవకాశముంది.

కేసీఆర్‌ది మానవీయ ప్రభుత్వం

- బీఆర్‌ఎస్ హయాంలో తగ్గిన రైతుల ఆత్మహత్యలు
- నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో గణాంకాలే నిదర్శనం

హైదరాబాద్, జూలై 14 (నమస్తే తెలంగాణ): తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాక పదేండ్లపాటు కేసీఆర్ ప్రజా ప్రభుత్వం నడిపారని, మానవీయ పాలన కొనసాగించారని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు తెలిపారు. బీఆర్‌ఎస్ హయాంలో రైతుల ఆత్మహత్యలు గణనీయంగా తగ్గాయని పేర్కొన్నారు. ఇందుకు నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో ప్రకటించిన గణాంకాలే నిదర్శనమని ఆదివారం ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. తెలంగాణలో 2015 నుంచి 2022 వరకు రైతుల ఆత్మహత్యలు గణనీయంగా తగ్గినట్టు నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో విడుదల చేసిన గణాంకాల చార్ట్‌ను అరవింద్ వారియర్ అనే నెటిజన్ పెట్టిన ట్వీట్‌కు కేటీఆర్ రీ ట్వీట్ చేశారు.

ఉమ్మడి రాష్ట్రంలో కరువు

'ఉమ్మడి పాలనలో తెలంగాణ ప్రాంతం అత్యంత కరువు పీడిత ప్రాంతాల్లో ఒకటిగా నిలిచింది. ఉద్దేశపూర్వకంగా గత పాలకులు నీటి వనరులను నిర్లక్ష్యంగా చేయడం మూలంగా తీవ్ర కరువుకాటకాలను అనుభవించింది. ఫలితంగా రైతులు పంటల సాగుకు అనేక ఇబ్బందులు పడ్డారు. సాగునీటి వసతులు లేక వ్యవసాయం గిట్టుబాటుగాక, అనేక మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. 2014 సంవత్సరానికి ముందు భారీ సంఖ్యలో రైతులు బలవన్మరణాలకు పాల్పడ్డారు.' '2014 తర్వాత ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు కావడం, కేసీఆర్ నేతృత్వంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం కొలువుదీరడంతో పరిస్థితులు ఒక్కసారిగా కొలిక్కివచ్చాయి. కొత్త ప్రాజెక్టుల నిర్మాణం, చెరువుల పునరుద్ధరణతో సాగునీటి వసతులు మెరుగుపడ్డాయి. వ్యవసాయం పండుగలా మారింది. క్రమంగా రైతుల ఆత్మహత్యలు గణనీయంగా తగ్గాయి. కేసీఆర్ ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలు, సమిష్టి ప్రయత్నాలు వ్యవసాయాన్ని సుసంపన్నంగా మార్చాయి. రైతు జీవితాలు మెరుగుపడ్డాయి. ఇది కదా.. మానవీయ ప్రభుత్వం అంటే' అని కేటీఆర్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం ట్వీట్ చేశారు. బీఆర్‌ఎస్ హయాంలో ఎనిమిదేండ్లలో రైతుల ఆత్మహత్యలు గణనీయంగా తగ్గినట్టు తెలిపారు. నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో విడుదల చేసిన గణాంకాల చార్ట్‌ను రీ ట్వీట్ చేశారు.



తగ్గిన రైతుల ఆత్మహత్యల శాతం

2015లో 11.1%	2016లో 5.66%
2017 7.98%	2018 8.77%
2019 4.85%	2020 4.41%
2021 3.29%	2022 1.57%

అప్పుల బాధతో రైతు బలవన్మరణం

పెట్టుబడుల కోసం 4 లక్షల అప్పు

- దిగుబడి రాక అప్పు తీరక మనస్తాపం
- పురుగుల మందు తాగి ఆత్మహత్య



తాంసి, జూలై 14: అప్పుల బాధ భరించలేక మనస్తాపంతో రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన ఆదివారం ఆదిలాబాద్ జిల్లా తాంసి మండలంలో వెలుగుచూసింది. కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదిలాబాద్ రూరల్ మండలం బట్టిసావర్గం గ్రామానికి చెందిన రైతు జక్కుల పెద్ద రాజన్న అలియాస్ పోతన్న(48)కు పదెకరాల వ్యవసాయ భూమి ఉన్నది. పెట్టుబడి కోసం రూ.4 లక్షలు అప్పు చేశాడు. రెండేండ్లుగా దిగుబడులు సక్రమంగా రాకపోవడంతో అప్పులు తీరలేదు. అప్పుల వాళ్లు ఇంటికి వస్తుండటం, ఎలా తీర్చాలో తెలియక మనస్తాపం చెంది శనివారం ఉదయం ఇంటి నుంచి వెళ్లాడు. తాంసి మండలం పొన్నారి శివారులోని తన చేనులో పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆదివారం అటువైపు వెళ్లిన వారు తాంసి పోలీసులు, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. పోతన్నకు భార్య రుక్మిణి, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

భర్తే కాలయముడు

- హై డోస్ మత్తు ఇంజెక్షన్ ఇవ్వడంతో భార్య మృతి
- ముక్కు మూసి, గొంతు నులిమి ఇద్దరు కూతుళ్ల హత్య
- కారుతో చెట్టుకు ఢీకొట్టి రోడ్డు ప్రమాదంగా చిత్రీకరణ
- ఓ మహిళతో వివాహేతర బంధం మత్తులో దారుణం
- ఖమ్మం ఏసీపీ వెల్లడి



భార్యాపిల్లలతో ప్రవీణ్ (ఫైల్)

రఘునాథపాలెం, జూలై 14: ఇటీవల ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలం బాబోజీతండాకు చెందిన ఒక మహిళ, ఇద్దరు కూతుళ్ల కారు ప్రమాదంలో చనిపోయిన ఘటనలో విస్తుగొలిపే నిజాలు బయటపడ్డాయి. ఈ కేసును విచారించిన పోలీసులు.. 'అది యాక్సిడెంట్ కాదు. ముగ్గురిదీ హత్యే' అని నిర్ధారించారు. ఆదివారం రఘునాథపాలెం పోలీస్ స్టేషన్‌లో ఖమ్మం ఏసీపీ రమణమూర్తి మీడియాకు వివరాలు వెల్లడించారు. బాబోజీతండాకు చెందిన బోడా ప్రవీణ్ హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు దవాఖానలో ఫిజియోథెరపీ డాక్టర్‌గా పనిచేస్తున్నాడు. ప్రవీణ్‌కు భార్య కుమారి (26), ఇద్దరు కుమార్తెలు కృతిక (4), కృతిక (3) ఉన్నారు. ప్రవీణ్.. అదే దవాఖానలో నర్సుగా పనిచేస్తున్న కేరళకు చెందిన సోని ఫ్రాన్సిస్‌తో వివాహేతర సంబంధం నెరపుతున్నాడు. భార్యను, పిల్లలను చంపితే సోని ఫ్రాన్సిస్‌తో సంతోషంగా ఉండొచ్చని భావించాడు. మే 28న భార్య, పిల్లల ఆధార్ కార్డులను అప్‌డేట్ చేయించేందుకు ముగ్గురినీ కారులో ఎక్కించుకొని ఖమ్మం తీసుకొచ్చాడు. తిరిగి వెళ్తుండగా భార్య తనకు ఒంట్లో బాలేదని చెప్పింది. ఇదే అదునుగా భావించిన ప్రవీణ్.. ప్లాన్ ప్రకారం అప్పటికే తెచ్చి కారులో పెట్టుకున్న హైడోస్ మత్తు ఇంజెక్షన్‌ను కుమారికి వేశాడు. దీంతో ఆమె మత్తులోకి వెళ్లింది. వెంటనే ఇద్దరు కుమార్తెలను కారు దింపాడు. ఒకరి తరువాత మరొకరి ముక్కు, నోరు మూసి హత్య చేశాడు. ఆ తరువాత పిల్లలను కారు ముందు సీటులో పడుకోబెట్టాడు. ముగ్గురూ రోడ్డు ప్రమాదంలో చనిపోయినట్టుగా చిత్రీకరించేందుకు.. హర్యాతండా వద్ద మూలమలుపులో కారుతో చెట్టుకు ఢీకొట్టాడు. ఆ ప్రమాదంలోనే భార్య, కుమార్తెలు చనిపోయినట్టు నమ్మించాడు. మొదట రోడ్డు ప్రమాదంగా కేసు నమోదు చేసిన పోలీసులు.. మృతుల శరీరంపై ఎలాంటి గాయాలూ లేకపోవడంతో అనుమానించారు. పోస్టుమార్టం రిపోర్టు ఆధారంగా ప్రవీణ్‌ను అదుపులోకి తీసుకొని విచారించగా తానే ముగ్గురినీ హత్య చేసినట్టు అంగీకరించాడు. ఈ ఘటనలో హంతకుడు ప్రవీణ్‌తోపాటు హత్యకు ప్రేరేపించిన ప్రియురాలు సోని ఫ్రాన్సిస్‌పైనా పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రవీణ్‌ను రిమాండ్‌కు తరలించినట్టు ఏసీపీ తెలిపారు.

Printed and Published by Damodar Rao Divakonda, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9, Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: Thigulla Krishna Murthy. Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.